# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

సోమవారం, మార్చి 23, 2015

**MONDAY, THE 23rd MARCH, 2015**

14వ శాసన సభ 4వ సమావేశం, వాల్యూం-7 నంబరు-6

**14TH L.A. IV SESSION, VOL- 7 NO.-6**

శక సంవత్సరం-1936, చైత్రం-3

**1- Chaitra, 1936 – S.E.**

శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు- 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | ః | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | ః | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | ః | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | ః | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | ః | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా. వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | ః | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

– – –

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

అధికార నివేదిక

(14వ శాసన సభ)
(నాల్గవ  సమావేశము ః పదకొండవ రోజు )

**సోమవారం, మార్చి 23, 2015**
**సభ ఉ.గం.09.00.లకు ప్రారంభమైనది**
(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

--------------

## విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభ సమావేశం (ఉ.గం.9.00.) | ..... | 5 |
| 2. | నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు మరియు సమాధానములు | ..... | 5-40 |
| 3. | సభ ముందు ఉంచిన పత్రములు | ..... | 40 |
| 4. | స్పెషల్ మెన్షన్ గురించి<br>(శ్రీమతి వి.అనితచే మోషన్ మూవ్ మరియు ఆమోదం) | .... | 40- 42 |
| 5. | జీరో అవర్ | ..... | 42-52 |
| 6. | సంతాపం తీర్మానం (శ్రీ లీక్వాన్యీ మృతికి) | ..... | 52-54 |
| 7. | రుణ ఉపశమన పథకంపై 344వ నిబంధన కింద<br>ముఖ్యమంత్రి గారిచే ప్రకటన, చర్చ మరియు ఆమోదం | ..... | 54-100 |
| 8. | ఆర్థిక ప్రతిపాదనలు | ..... | 100-102 |
| 9. | సభ వాయిదా | ..... | 102 |


**<u>అనుబంధం</u>**


I) కోత ప్రతిపాదనలు సభకు సమర్పణ (62-80)

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ
## సోమవారం, తేది.23 మార్చి, 2015

* * *

(సభ ఉదయం 9.00 గంటలకు ప్రారంభమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

**MR.SPEAKER: Question Hour.**

**ప్రశ్న నెం. 908 (81)**

**శ్రీ బి.సి. జనార్థన రెడ్డి ఎం.ఎల్.ఏ.**

**గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య విద్యా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?**

అ) బనగానపల్లి నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, నర్సులు మరియు ఇతర సిబ్బంది పదవులు అనేకం ఖాళీగా ఉన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, రోగులు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్న విషయం కూడా వాస్తవమేనా?

ఇ) నిర్ణీత సిబ్బందిని ఎప్పటిలోగా నియమించడమవుతుంది?

**గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య విద్యాశాఖ మంత్రి (డా. కామినేని శ్రీనివాస్, కైకలూరు):**

అ) లేదండి.

ఆ) లేదండి.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు

శ్రీ బి.సి. జనార్థన రెడ్డి (బనగానపల్లి) : అధ్యక్షా, నా నియోజకవర్గంలో దాదాపు 12 పీహెచ్‌సీలు ఉన్నాయి. అందులో డాక్టర్ పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయి. తమరు (సభాపతిని ఉద్దేశించి) కర్నూలు జిల్లాకు వచ్చినపుడు ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో అన్ని వివరాలతో లేఖ

కూడా సమర్పించాం. పీహెచ్‌సీలలో డాక్టర్ పోస్టులు ఖాళీలుండడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులుపడుతున్నారు. ఆ పీహెచ్‌సీలలో డాక్టర్లు సరైన సమయానికి రాకపోవడం వల్ల చుట్టు ప్రక్కన ఉన్న గ్రామ ప్రజలు ఇబ్బందిపడే విషయాన్ని తమరి దృష్టికి తీసుకొచ్చాను. పీహెచ్‌సీలలో డాక్టర్ల ఖాళీలతోపాటు నర్సుల పోస్టులు కూడా ఖాళీలు ఉన్నాయి. బనగానపల్లి నియోజకవర్గం అవుకు మండలంలో దాదాపు రెండు సంవత్సరాల క్రిందట 30 పడకల హాస్పిటల్ కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించారు. దురదృష్టవశాత్తు ఆ హాస్పిటల్‌లో ఒక్క బెడ్ కూడా లేదు. ఆ హాస్పిటల్‌లో డాక్టర్లు లేరు మరియు సరైన వసతులు కూడా లేవు. ఆ హాస్పిటల్‌ను ఎప్పటిలోగా ప్రారంభిస్తారు? పీహెచ్‌సీ సెంటర్లలో, సబ్ సెంటర్లలో డాక్టర్లను ఎప్పటిలోగా నియమిస్తారు? ఆ ప్రాంతంలో తండావాసులు, పేదవారు చాలా మంది నివసిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినపుడు 40, 50కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. డాక్టర్లు ఫలానా గ్రామానికి క్యాంప్‌కు వెళుతున్నామని చెబుతారు. వాస్తవంగా అలా జరగడం లేదు. వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. 30పడకల హాస్పిటల్‌లో డాక్టర్లను త్వరగా నియమించి మీ (సభాపతిని ఉద్దేశించి) చేతుల మీదుగా ప్రారంభించాలని కోరుతున్నాను.

డా.కామినేని శ్రీనివాస్ (కైకలూరు) ః అధ్యక్షా, బనగానపల్లి నియోజకవర్గంలో మూడు సీహెచ్‌సీలు, ఎనిమిది పీహెచ్‌సీ సెంటర్లు ఉన్నాయి. అందులో ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ క్రింద ఉన్న 50 పడకల సీహెచ్‌సీ ఒకటి బనగానపల్లిలో ఉంది. అందులో ఐదు డాక్టర్ల పోస్టులు ఉన్నాయి. మూడు ఎంసీహెచ్ టీం గైనకాలజిస్ట్, పీడియాట్రిస్ట్, అనెస్తీషియా డాక్టర్లు ఉన్నారు. ఇద్దరు డాక్టర్లను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకున్నాము. మొత్తం ఐదు మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ క్రింద ఉన్న రెండు సీహెచ్‌సీలు, ఎనిమిది పీహెచ్‌సీలు మొత్తం కలిపి మంజూరైన పోస్టులు 19 అయితే 15 మంది ఉన్నారు. ముగ్గురు పీజీ డాక్టర్లు లీవ్‌లో ఉన్నారు, ఒక పోస్టు ఖాళీ ఉంది.

(ఈ సందర్భంలో సభ్యులు జనార్ధన రెడ్డి గారు తన సీటులో నుంచి లేచి నిలబడ్డారు)

మిస్టర్ స్పీకర్ ః జనార్ధన రెడ్డి గారు కూర్చోండి.

డా.కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః డాక్టర్ల హాజరు పర్యవేక్షణ కోసం బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని అనుకుంటున్నాం. పారామెడికల్ స్టాఫ్ ఎంపికను కూడా త్వరలోనే చేపడుతామని గౌరవసభ్యులకు మీ ద్వారా తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః జనార్ధనరెడ్డిగారూ.

శ్రీ బి.సి.జనార్థన్ రెడ్డి (బనగానపల్లి) : అలాగే కోయిలకుంట్లలో కూడా 4 డాక్టరు పోస్టులు గైనకాలజిస్టు, అనెస్తీషియా, పీడియాట్రిస్ట్, డ్యూటీ డాక్టరు పోస్టులు ఖాళీలున్నాయి. బనగానపల్లిలో కూడా రెండు ఖాళీలున్నాయి. లాస్ట్ టైం కూడా మీకు (సభాపతిని ఉద్దేశించి) చాలా సమాచారం ఇచ్చాను. మిగిలిన సమాచారం కూడా మీద్వారా మంత్రి గారికి సమర్పిస్తాను. థాంక్యూ సర్.

శ్రీ కె.ఎస్.జవహర్ (కొవ్వూరు): అధ్యక్షా, మొదటి సమావేశం నుంచీ కూడా మా ఏరియా ఆసుపత్రి గురించి అనేకసార్లు సభద్వారా గౌరవ మంత్రిగారికి తెలియజేసినప్పటికీ సరైన వసతులు, సదుపాయాలు ఈనాటికీ కూడా కల్పించలేకపోతున్నారు. అంతేకాకుండా దాదాపు నాలుగు నియోజకవర్గాలలో గాని, హైవేలో గాని కొవ్వూరు నియోజకవర్గాన్ని క్రాస్ చేసుకుంటూ వెళ్తున్నప్పుడు ప్రమాదాలు జరిగిన సందర్భాలలో మా ఆసుపత్రిలో కనీసం అంబులెన్స్ సదుపాయం కూడా లేని పరిస్థితి ఉంది. అంతేకాకుండా గైనకాలజిస్ట్ పోస్టు, ఏరియా ఆసుపత్రి స్టేటస్ గాని ఈరోజు వరకు కూడా కల్పించకపోవడం వలన ప్రజలు చాలా ఇబ్బందిపడుతున్నారు. అదేవిధంగా పి.హెచ్.సి.లో కూడా వైద్యాధికారులు లేని పరిస్థితి నా నియోజకవర్గంలో ఉంది. దీనిపై గౌరవ మంత్రిగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తగిన చర్యలు తీసుకోవల్సిందిగా కోరుతున్నాను. ఎందుకంటే గోదావరి పుష్కరాలు కూడా త్వరలో రాబోతున్నాయి. దానితోపాటు, ఐసియు గురించి కూడా గౌరవ ముఖ్యమంత్రిగారికి విన్నవించడం జరిగింది. అలాగే పర్మినెంటుగా అంబులెన్స్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని మీ ద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

శ్రీ పి.గోవింద సత్యనారాయణ (అనకాపల్లి): అధ్యక్షా, నమస్కారం. మాది పేదలు నివసించే నియోజకవర్గం. ఈరోజు ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ ఆసుపత్రి ఉండాలని నిధులను ప్రభుత్వం తరపున మంజూరు చేస్తున్నారు, కానీ అక్కడ వసతులు, డాక్టర్లు లేని పరిస్థితి ఉంది. ఇద్దరు డాక్టర్లు ఉంటే ఒక డాక్టర్‌ను డెప్యూటేషన్‌పై వేరే ప్రాంతాలకు పంపిస్తున్నారు. నా అనకాపల్లి నియోజకవర్గంలో ఎన్టీఆర్ ప్రభుత్వ వైద్యశాల ఉంది. ఆ వైద్యశాలకు ఓపీ క్రింద ప్రతి రోజూ 1100 మంది వస్తారు. తమరు (సభాపతిని ఉద్దేశించి) కూడా వైద్య వృత్తిలో చాలా నిపుణులు. 1100 ఓపీల్లో నెలకు 350 నుంచి 400 గైనకాలజీ కొరకు వస్తున్నారు. గైనిక్ డాక్టర్లు ఇద్దరే ఉన్నారు. రెండు పీహెచ్‌సీలు కొత్తగా కట్టారు. రూ.42 లక్షలతో భవనాలను నిర్మించారు. విశాఖపట్నంలో కెజీహెచ్‌లో ప్రతి నెల 400 నుంచి 500 వరకు డెలివరీలు అవుతాయి. అక్కడ 28 మంది గైనిక్ డాక్టర్లు ఉన్నారు. గత ప్రభుత్వ పాలనలో పొలిటికల్ లాబియింగ్‌తో ప్రతి వైద్యుడు విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో పనిచేయడానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ఏ హాస్పిటల్స్‌లో ఎక్కువ డాక్టర్లు ఉన్నారో, డాక్టర్లు లేని హాస్పిటల్స్‌కు డిప్యూటేషన్‌పై పంపిస్తే బాగుంటుందని, స్టాఫ్ ప్యాట్రన్‌ను స్ట్రీం లైన్ చేస్తే బాగుంటుందని మనవిచేస్తున్నాను. ఐదు నియోజకవర్గాలయిన యలమంచిలి, మాడుగుల,

పెందుర్తి, పాయకరావుపేట నుంచి ప్రజలు అనకాపల్లిలో ఉండే ఏరియా హాస్పిటల్‌కు తరచు వస్తుంటారు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఆగస్టు 8వ తేదీన ఈ హాస్పిటల్‌కు విజిట్ చేసి రూ.11 కోట్లు గ్రాంటు కూడా ఇచ్చారు. 100 నుంచి 250 బెడెడ్ హాస్పిటల్‌ను కూడా మంజూరు చేశారు. వైద్యులను డిప్యూటేషన్‌పైన గాని, పోస్టులు భర్తీ చేసైనా గాని డాక్టర్లను నియమించాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

...

శ్రీ పి.విష్ణుకుమార్‌రాజు(విశాఖపట్నం-నార్త్)ః అధ్యక్షా, విశాఖపట్నంలో పేరు, ప్రఖ్యాతులున్న హాస్పిటల్స్ ఉన్నాయి. విక్టోరియా, గోషా హాస్పిటల్, ఇ.ఎన్.టి హాస్పిటల్, టీచింగ్ హాస్పిటల్, మెంటల్ కేర్ హాస్పిటల్, చెస్ట్ ఐడి హాస్పిటల్, ఆర్.ఇ. హెచ్, ఆర్.సి.డి ఉంది. తరువాత కె.జి.హెచ్ టీచింగ్ హాస్పిటల్ ఉంది. అలాగే మా మంత్రివర్యులు కామినేని శ్రీనివాస్ గారు కూడా హాస్పిటల్స్ విజిట్ చెయ్యడం జరిగింది. విజిట్‌లు అయితే ఉంటున్నాయి కానీ యాక్షన్స్ అయితే ఉండడం లేదు. విశాఖపట్నంలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌కి Existing Nursing Staff Vs As per G.O M.S.No.885 27-08-1977 తో compare చేస్తే నర్సింగ్ స్టాఫ్, స్టాఫ్ నర్సులు 325 మంది ఉన్నారు. జీ.వో.నెం 885 ప్రకారం అయితే 187 మంది తక్కువ ఉన్నారు. అట్లాగే హెడ్ నర్సులు 105 మంది ఉన్నారు. ఐదుగురు తక్కువ ఉన్నారు. ముఖ్యంగా స్టాఫ్ నర్సస్ 710 మంది షార్ట్‌ఫాల్ ఉంది. ఇప్పుడు మన గవర్నమెంటు రూల్స్ ప్రకారం మన జీ.వో.నెం.885, 1977 ఫాలో అయితే ఇది షార్ట్‌ఫాల్. అదే కనుక ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రకారం ఫాలో అయితే చాలా తక్కువమంది ఉన్నారు. స్టాఫ్ నర్సస్ అయితే 418 మంది తక్కువ ఉన్నారు. హెడ్‌నర్సస్ 30మంది తక్కువ ఉన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 అయితే 25 మంది తక్కువ ఉన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 13మంది తక్కువ ఉన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రకారం ముగ్గురు పేషంట్స్‌కి ఒక స్టాఫ్ నర్స్ ఉండాలి. ఐదుగురు స్టాఫ్‌నర్స్‌లకి 1 హెడ్‌నర్స్ ఉండాలి. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రకారం 50మంది పేషంట్స్‌కి ఒక నర్సింగ్ స్టాఫ్ గ్రేడ్-2 ఉండాలి. అలాగే, 100 పేషంట్స్‌కి ఒక నర్సింగ్ స్టాఫ్ గ్రేడ్-1 ఉండాలి. 500 పేషంట్స్‌కి ఒక చీఫ్ నర్స్ ఉండాలి. నేను మా మంత్రివర్యులని సూటిగా ప్రశ్నిస్తున్నాను. మీరు జీ.వో.నెం 885 ప్రకారం ఫాలో అవుతున్నారా, లేకపోతే ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రకారం ఫాలో అవుతున్నారా? ఈ రెండింటిలో ఏది ఫాలో అవుతున్నారు? లేక రెండూ ఫాలో అవట్లేదా? ఈ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పాలి. మేము చూస్తాము, చేస్తాము అని చెబుతున్నారు. కానీ 8నెలలు అయిపోయింది. దయచేసి మంత్రివర్యులు దీని మీద స్పందించి, స్పష్టత ఇచ్చి నర్సింగ్ స్టాఫ్‌ని ఎప్పుడు రిక్రూట్ చేస్తారో క్రిస్టల్ క్లియర్‌గా క్లారిటీతో చెప్పవలసిందిగా మా మంత్రివర్యులని కోరుతున్నాను. ఆయన మీద అమితమైన ప్రేమ, అభిమానం మాకు వ్యక్తిగతంగా కూడా ఉంది. అయినప్పటికీ కూడా ఈ ప్రశ్నలను సూటిగా అడుగుతున్నానని మీరు ఏమీ అనుకోవద్దు. వాస్తవాలు మాత్రం చెప్పి తీరవలసిందే. అపోజిషన్‌లో నేను ఒక్కడినే ఉన్నాను. ఇకనుంచి అన్నీ సూటిగానే అడుగుతాను.

మిస్టర్ స్పీకర్ః ఓకే.ఓకే.

మిస్టర్ స్పీకర్: లలితకుమారి గారూ.

శ్రీమతి కె.లలితకుమారి (శృంగవరపుకోట): ధన్యవాదాలు అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రివర్యులు పేదవాళ్ల ఆరోగ్యం కోసం పెద్దపీట వేస్తూ వైద్యరంగానికి అధిక నిధులు కేటాయించిన విషయంలో గౌరవమంత్రివర్యులని తమ ద్వారా నేను కోరేది ఒకటే. రాష్ట్రంలో ఉన్న జిల్లాలలో ఉన్న హాస్పిటల్స్ కానీ, నియోజక వర్గంలో ఉన్న పి.హెచ్.సి, సి.హెచ్.సిలలో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్‌తోబాటు డాక్టర్లు కూడా చాలా ఖాళీలు ఉన్నాయి. వాటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారు, లేకపోతే ఆ ఖాళీలను భర్తీ చేయడం కోసం జిల్లాలకు అవకాశం ఇస్తారా అన్న విషయాన్ని గౌరవమంత్రిగారిని కోరుతూ, చాలా పురాతన హాస్పిటల్స్‌తో పాటు కొన్ని పి.హెచ్.సిలు కూడా బిల్డింగ్‌లు లేక గతం నుంచి ఉన్నాయి. వాటిని కూడా మంజూరు చేసి వైద్యరంగాన్ని ముందుకు తీసుకువెళ్లాలని తమ ద్వారా మంత్రిగారిని కోరుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: రామానాయుడు గారూ.

శ్రీ ఎస్. రామానాయుడు(పాలకొల్లు) : అధ్యక్షా, మన రాష్ట్ర విభజన వల్ల ప్రత్యేకించి విద్యారంగం కానీ, వైద్యరంగం కానీ బాగా నష్టపోయాయి అన్న విషయం మనందరికీ తెలుసు. ఎందుకంటే టాప్ 10 ఇనిస్టిట్యూషన్స్ హైదారాబాద్‌లో ఉండిపోయాయి. అదేవిధంగా మంచి కార్పోరేట్ వైద్యం కావాలంటే హైదారాబాద్‌కు తప్పనిరిగా రావలసిన పరిస్థితి. ఇటువంటి స్థితిలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు వైద్య రంగానికి నిధులు అధికమొత్తంలో కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ ప్రత్యేకించి మా పాలకొల్లు నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రి అయితే ఉంది కానీ దానికి వైద్యుల కొరత ఉంది. అలాగే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా సరిగ్గా లేని పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాకి అభివృద్ధి విషయంలో ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబునాయుడు గారు కూడా పదే పదే చెబుతున్నారు. ప్రత్యేకించి ముఖ్యమంత్రిగారిని కూడా గతంలో కోరాము. ఆయన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గం వచ్చినపుడు నవంబరు 1వ తేదీన పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి పరుస్తామని ఎస్యూరెన్స్ ఇవ్వడం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఏ ప్రభుత్వ ఆసుపత్రికి లేని 14 ఎకరాల ల్యాండ్ ఈ ప్రభుత్వ ఆసుపత్రికి ఉంది. ఇక్కడ రెండు హైవేలు 'టూ వన్ ఫోర్' , 'టూ వన్ ఫోర్-ఎ' రెండు హైవేలు క్రాస్ చేసుకుంటూ వెళుతున్నాయి. అదే విధంగా ఈ ప్రాంతంలో ఇటు నర్సాపురం, పాలకొల్లు, అటు ఆచంట, రాజోలు కానీ ఈ రకంగా దగ్గర దగ్గర 12 నుంచి 15 లక్షల మంది ప్రజలకు సెంటర్ పాయింట్‌గా ఆసుపత్రి ఉంది. అయితే ఇంత ఉన్నప్పటికీ కూడా ఏదైనా వైద్యానికి సంబంధించి అత్యవసర పరిస్థితి వస్తే ఇక్కడ నుంచి కాకినాడ కానీ, గుంటూరు కానీ రిఫర్ చేస్తూ ఉంటే అక్కడికి వెళ్లడానికి 3 గంటల నుంచి 5 గంటల సమయం పడుతుంటే ఆ సమయంలో రోగి

పరిస్థితి గాలిలో కలిసిపోయే పరిస్థితిగా ఉంది. అలా కాదని, ఏదైనా ప్రైవేటు హాస్పిటల్‌కి వెడితే 3 నుంచి 5 లక్షల రూపాయలను భరించే స్థితి అక్కడ పేద ప్రజలకు లేదు. వీటన్నింటిని దొడ్డిపట్ల జన్మభూమి కార్యక్రమంలో గౌరవముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువస్తే వాటిని అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారు.  కానీ ఆ విషయం మీద గౌరవ మంత్రివర్యులు ఇప్పటివరకు నాబార్డ్ నిధులు దగ్గర దగ్గర రూ.200 కోట్లు వచ్చాయని అన్నారు. కానీ మా పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి ప్రయారిటీ ఇస్తామని చెప్పి, ఎస్యూరెన్స్ ఇస్తామని చెప్పినప్పటికీ కూడా దానికి ఒక్క రూపాయి కూడా మంజూరు కాకపోవడం దురదృష్టమని మా ప్రజలందరూ భావిస్తున్నారు. అందుచేత దయయుంచి గౌరవ మంత్రిగారిని ఈ విషయంపై దృష్టి పెట్టి ముఖ్యమంత్రిగారి హామిని నిలబెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః వర్మ గారూ.

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ(పిఠాపురం)ః అధ్యక్షా, పిఠాపురంలో స్వైన్‌ఫ్లూ కేసు ఒకటి ఐడెంటిఫై అయ్యింది. కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేస్తే స్వైన్‌ఫ్లూ అని తెలిసిన వెంటనే డిస్చార్జ్ చేసేశారు. అందుచేత గౌరవమంత్రిగారిని కోరుకునేది ఏమిటంటే ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఇటువంటి కేసులు వచ్చినపుడు వాళ్లు చేర్చుకునే విధంగా కఠినచర్యలు ఉండాలి, ఇటువంటి వ్యాధులకు సెపరేట్ వార్డ్ ఉండే విధంగా ప్రపోజల్స్ కానీ, గవర్నమెంటు నుంచి ఆర్డర్స్ రూపేణా చెయ్యకపోతే అందరూ అప్పటికప్పుడు గవర్నమెంటు హాస్పిటల్‌కి వెళ్లాలన్నా ఇబ్బందికర పరిస్థితులు వస్తాయి. దగ్గర్లో ఉండే ప్రైవేటు హాస్పిటల్స్‌కి వెళతారు కాబట్టి ఇటువంటి స్వైన్‌ఫ్లూ వ్యాధులు వచ్చినపుడు ప్రైవేటు హాస్పిటల్స్‌లో సెపరేట్ వార్డ్ ఉంచే విధంగానూ, లేదంటే వారి లైసెన్సు రద్దుచేసే విధంగానూ  చర్యలు తీసుకోవాలని మీ ద్వారా గౌరవమంత్రివర్యులను అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః సత్యప్రభ గారూ.

శ్రీమతి డి.ఎ.సత్యప్రభ(చిత్తూరు)ః నమస్తే అధ్యక్షా, మా చిత్తూరు నియోజకవర్గం తిరుమలకు, బెంగుళూరుకి మధ్యలో ఉంటుంది. తిరుమల, బెంగుళూరుకు వెళ్లే ప్రయాణీకులు ప్రతిఒక్కరు చిత్తూరు రోడ్డు ఎన్.హెచ్.-4 క్రాస్ చెయ్యవలసి వస్తుంది. మా చిత్తూరులో ఉన్న హాస్పిటల్‌కి రోజుకి 1000 మంది పేషెంట్‌లు వస్తుంటారు. దాంట్లో 350 పడకగదులు ఉన్నాయి. గతంలో అక్కడ ట్రామాకేర్ కూడా ఉండేది. గత ప్రభుత్వం వచ్చిన తరువాత ట్రామాకేర్‌ను నెల్లూరుకి తరలించేశారు. చిత్తూరుకి బెంగుళూరు, తిరుమల నుండి వచ్చే భక్తులరద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. ఎప్పుడూ 3,4 యాక్సిండెట్స్ జరుగుతుంటాయి. . వాళ్లు మా చిత్తూరు హాస్పిటల్‌కే రావలసి వస్తుంది, heavy bleeding తో వచ్చిన వాళ్లకి

bleeding కంట్రోల్ చెయ్యడానికి తగిన ఏర్పాట్లు, వసతులు ఆ హాస్పిటల్‌లో ఉండవు. ఫ్రాక్చర్ పేషంట్స్‌ని ట్రీట్ చెయ్యడానికి కూడా ఒకే ఒక ఆర్తోపెడిక్ సర్జన్ ఉంటారు. వాళ్లు వెళ్లాలి అనుకుంటే వేలూరుకి వెళ్లాలి. వేలూరుకు వెళితే వాళ్లకు చిత్తూరులో ఉన్న వాళ్లకి కూడా ఎన్.టి.ఆర్. ఆరోగ్య కార్డ్స్ పనిచెయ్యవు.లేదంటే స్విమ్స్‌కు వెళ్లాలి.

...

స్విమ్స్‌కి వెళ్లాలంటే నాలుగు రైల్వే గేట్లు అడ్డువస్తున్నాయి. ఆ నాలుగు రైల్వే గేట్లు దాటుకుని తిరుపతి వెళ్ళేసరికి బ్లీడింగ్ వల్ల కొంతమంది పేషెంట్స్ చనిపోతున్నారు. ఈ మధ్య మేము కలెక్టర్ గారిని రిక్వెస్ట్ చేస్తే ఆయన రోడ్డు, రోడ్డు షోల్డర్స్ వెడల్పు చేసి, బుషెస్ అనీ తీయించడం అనే చర్యల ఫలితంగా, ప్రమాదాల శాతం 13 నుంచి 9.2 శాతానికి తగ్గింది. చిత్తూరులో ఉన్న చుట్టు ప్రక్కల ప్రాంతాల పేషెంట్స్ అక్కడకు వస్తే వాళ్లకు చాలా ఇబ్బందికర వాతావరణం ఉంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రమాణస్వీకారం అయిన తరువాత ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిని రెండుసార్లు స్వచ్ఛభారత్ క్రింద క్లీన్ చేయించారు. ఒక్కొక్కసారి మా ట్రస్ట్ తరపున 50 ట్రాక్టర్ల లోడ్ చెత్తని ఎత్తించి బయట వేయించాము. మీరు దానిని అర్థం చేసుకోగలరని నేను చెబుతున్నాను. అదేకాకుండా మా చిత్తూరులో బయో మెడికల్ వ్యర్థపదార్థాలను కాల్చడానికి కూడా వసతులు లేవు. తిరుపతికి నెలకి ఒకసారి వచ్చి తీసుకువెడుతున్నారు. ఒక డాక్టర్‌గా బయో మెడికల్ డిస్‌పోజల్ చేయకుండా ఉంటే ఎంత ప్రమాదకరమో మీకు తెలుసు. దయచేసి రిక్వెస్ట్ చేస్తున్నాను. అక్కడి వాతావరణ పరిస్థితుల వలన డ్రైనేజి నీళ్లు పోవడం లేదు. ఆసుపత్రి చుట్టు డ్రైనేజి వాటర్ నిలిచిపోతుంది. కాంపౌండ్‌వాల్ పకడ్బందిగా లేకపోవడం వల్ల చుట్టుపక్కల ఉన్న కుక్కలు, ఆవులు అన్నీ కూడా కాంపౌండ్‌లోనే ఉంటున్నాయి. చాలా పురాతనమైన పాత బిల్డింగ్ మాదిరి అయినది. ఇప్పుడు కొత్తగా ఉమెన్స్ అండ్ చైల్డ్ ఆసుపత్రి కూడా కడుతున్నారు. ఈ ఆసుపత్రి జూన్ 30న ప్రారంభించాలని అన్నారు. కానీ, ఇప్పటివరకు నిధులు లేవని దానిని నిలిపేశామని చెబుతున్నారు. దానికి గురించి చర్య తీసుకుంటే బాగుంటుంది.

అదేకాకుండా 1200 అడుగున ఉన్నటువంటి నీళ్ళు అడుగంటిపోతున్నాయి. ఫ్లోరైడ్ వాటర్ వలన డయాలసిస్ పేషెంట్స్ ఎక్కువైపోతున్నారు. ఎవరు డయాలసిస్‌కి వెళ్లాలన్నా తిరుపతికి వెళ్లాలి. తిరుపతిలో ఉన్న డయాలసిస్‌కి వెళ్లితే రూ.4,000ల నుంచి రూ.5,000ల ఖర్చు అవుతుంది. కొంతమంది తిరుపతిలోని వేరే ఆసుపత్రులకి వెళ్ళి ట్రీట్‌మెంట్ చేయించుకొని వస్తున్నారు. డయాలసిస్ ఆసుపత్రి పెడితే, కొంతమంది కిడ్నీ పేషెంట్స్‌ని మనం ప్రొటెక్ట్ చేసిన వాళ్లమవుతామని విన్నవించుకుంటున్నాను.

(చిరంజీవులు గారు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరసాగారు)

మిస్టర్ స్పీకర్ : చిరంజీవులు గారు దయచేసి ఒక నిమిషం కూర్చోండి.

శ్రీ జి.శంకర్(తంబళ్లపల్లె)ః అధ్యక్షా, చిత్తూరు జిల్లాలోని తంబళ్ళపల్లె నియోజకవర్గం రాష్ట్రంలోనే చాలా వెనుకబడిన ప్రాంతం. తంబళ్ళపల్లె తాలుకా హెడ్‌క్వార్టరును గౌరవ మంత్రిగారు సందర్శించారు. ఆసుపత్రి చాలా అధ్వాన్నమైన పరిస్థితిలో ఉంది. ఎందుకంటే సరైన స్టాఫ్ లేదు. డాక్టర్ కూడా వస్తే ఒక గంట, రెండు గంటలు గానీ,మూడు గంటలు వరకు ఉండి వెళ్లిపోతున్నారు. తాలుకా హెడ్‌క్వార్టర్‌తో పాటు సుమారు ఆ నియోజకవర్గంలో 1200ల గ్రామాలు ఉండే నియోజకవర్గం. తాలుకా హెడ్‌క్వార్టర్‌లో వున్న ఆసుపత్రి యినప్పటికీ ఒక డాక్టరు కనీసం ఇద్దరు ముగ్గురు నర్సులు అయినా ఉండే పరిస్థితి లేదు. చాలా అధ్వాన్నమైన పరిస్థితి ఉంది. గత 40ఏళ్ల చరిత్రలో తంబళ్ళపల్లె నియోజకవర్గం పెత్తందారి వ్యవస్థలో నలిగి అభివృద్ధికి నోచుకోకుండా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. ఈ ఆసుపత్రిని ఏ పాలకులూ పట్టించుకోలేదు. ఈ మధ్యనే గౌరవ ముఖ్యమంత్రిగారు మా నియోజకవర్గానికి వచ్చారు. బి.కొత్తకోట ఆసుపత్రిని అనౌన్స్ చేశారు. దానిని కూడా త్వరగా పూర్తి చెయ్యాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. కురబలకోట మండలం ఉంది. ముదివేడు అనేది ఎక్కువ పల్లెలు ఉండే మండలం. అక్కడ ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కావాలని గౌరవ ముఖ్యమంత్రిగారికి వివరించడం జరిగింది. వాళ్లు ఆ రోజు సానుకులంగా స్పందించారు. మీ ద్వారా దయచేసి ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో మీరు ప్రారంభించాలని గౌరవ మంత్రిగారిని కోరుకుంటున్నాను. బురకాయలకోట మరియు కురబలకోట మండలాలకి కూడా ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇవ్వాలని కోరుకుంటున్నాను. మాది చాలా వెనుకబడిన ప్రాంతం, చిట్ట చివర్లో ఉండే ప్రాంతం, కర్ణాటకకి ఆనుకొని ఉంటుంది. కాబట్టి అక్కడ స్టాఫ్ వచ్చే పరిస్థితి లేదు. కాబట్టి స్ట్రిక్ట్‌గా ఆదేశాలు ఇచ్చి ఎక్కడైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయో అక్కడ పని జరిగేలా గౌరవ మంత్రిగారి ద్వారా ఆదేశాలు ఇవ్వమని కోరుకుంటూ ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదములు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ ః మినిస్టర్ గారూ .

శ్రీ కామినేని శ్రీనివాస్(కైకలూరు)ః అధ్యక్షా, ముందుగా జవహర్ గారు అడిగినట్టు త్వరలోనే అంబులెన్స్‌కి ఆర్డర్స్ ప్లేస్ చేస్తాం, అది వచ్చిన తరువాత తప్పకుండా ఇస్తాం. 120 డాక్టర్స్‌ని కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకోవడానికి ఫైనాన్స్ శాఖ కూడా పర్మిషన్ ఇచ్చింది. ఇంకా 541 డాక్టర్స్‌ని తీసుకోవడం గూర్చి ప్రాసెస్‌లో ఉంది. ఇంకా షార్టేజ్ ఉంది. అలాగే నర్సింగ్ స్టాఫ్ ఖాళీలు చాలా ఎక్కువగా ఉన్నాయి. Floor leaderగారు అడిగినట్టు సూటిగా Nursing Council of India గైడ్‌లైన్స్ ప్రకారం తీసుకోవడానికి ప్రయత్నం చేస్తాము. ఇవాళ మన ఆర్థిక పరిస్థితి బాగోకపోయినప్పటికీ ముఖ్యమంత్రిగారు, ఫైనాన్స్ మినిస్టర్ గారూ వైద్యానికి చాలా కృషి చేశారు. ఇవాళ ఇక్కడ చేయవలసిన అవసరం ఉంది. ఇవాళ ఎంత అవసరం ఉందో ఈ రోజు సభ్యులు మాట్లాడుతున్నది చూస్తే ఒక short discussion లాగా ఉంది. నేను గౌరవ సభ్యులకు

చెబుతున్నాను. ఇవాళ పరిస్థితి ఎలా వుందంటే సాధారణంగా చేతిలో ఏ రూపాయి లేని నాడే ప్రభుత్వ ఆసుపత్రికి వెడతాం. చాలామంది concern చూపిస్తున్నారు. నేను గౌరవ సభ్యులందరికి ఒక్కటే కోరుతున్నాను. గతంలో డాక్టర్లని దేవుడుతో సమానంగా చూసే వాళ్లు రెండు చేతులతో దణ్ణం పెట్టేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. ఇవాళ పరిస్థితులు చెబుతాను. ఒక ఊరు వెళ్లితే 15మంది డాక్టర్లుంటే 9మందికి సొంత నర్సింగ్ హోమ్‌లు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డాక్టర్లు అక్కడ చేస్తున్నారు. ఇక్కడ ఫ్రీ మెడిసన్స్ ఇచ్చి, ఫ్రీ మందులు ఇచ్చినా ప్రభుత్వ ఆసుపత్రి కాకుండా ప్రైవేట్ ఆసుపత్రికి పేషెంట్స్ వెడుతున్నారు. అలాగే విశాఖపట్నంలో ఒక్క డాక్టర్ కొరత కూడా లేదు. మెంటల్ ఆసుపత్రిలో 8మంది, మరో ముగ్గురు గైనాకాలజిస్ట్‌లు రేడియాలజి డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నారు. మొత్తం 11మంది డాకర్లు, 11ఏరియా ఆసుపత్రులున్నాయి. దీని వలన మోర్టాలిటీ రేటు తగ్గించవచ్చు. డాక్టర్లకు సొసైటీలో ఇన్‌ఫ్ల్యుయన్స్ ఉంది. కాబట్టి, మన సభ్యులే ఎవరిని ట్రాన్స్‌ఫర్ చేసినా ఒప్పుకోరు. అక్కడే కావాలంటారు. అక్కడ ఏదైనా alternative arrangement చేయమని అంటారు. నిజంగా చాలా ఇబ్బందిగా ఉంది. అందుకని, నేను కోరేది ఏమిటంటే పాలిటిక్స్‌లో ఉన్నపుడు ఇన్‌ఫ్ల్యుయన్సెస్ ఉంటాయి. కానీ, ఇక్కడ ఉన్న సమస్య ఏమిటంటే this is the only sector in public life. మిగిలిన వాళ్లు IPS, IAS, Panchayatraj ఎక్కడకైనా ట్రాన్స్‌ఫర్స్ ఉంటాయి. ఇందులో కొంతమందికి join నైన దగ్గర నుంచి రిటైర్ అయ్యే దాకా ఒకే ఊరిలో ఉండాలి. అది ఒక criteria. రెండవ criteria సొంత నర్సింగ్ హోమ్. నిజంగా చాలా ఇబ్బందికరంగా ఉంది. తప్పకుండా ఈ వ్యవస్థను మార్చడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను. (చప్పట్లు)

మీ అందరి concern చూసిన తరువాత, మీ అందరి సహకారం ఉంటే తప్పకుండా కొంత resistance వచ్చినా, ఇవాళ ప్రభుత్వం వైద్యుల యొక్క ఇమేజ్ పబ్లిక్‌లో పెరగవలసి ఉంది. దానికి నేను చర్యలు తీసుకుంటాను. మిమ్మల్ని కూడా సహకరించమని కోరుతూ సె లవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : సభ్యులకు ప్రాధాన్యత తప్పకుండా ఉంటుంది. కానీ, అందరి కంటే ముఖ్యం పేషెంట్స్. వాళ్ల సంగతి ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఎవరి గౌరవం వాళ్లకు ఇవ్వాలి. వాళ్లు చెప్పినట్లుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, ఎక్విప్‌మెంట్స్, మెడిసిన్స్ ఇచ్చాము. కానీ డాక్టర్లు లేరు. కాబట్టి ఎక్కడో ఒక ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. గవర్నమెంట్ బాధ్యత ప్రైమరీ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్. అది సఫర్ అవుతోంది కాబట్టి, కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు తీసుకోవాలి.

**Now Question No.82 (995) is deemed to have been answered.**

LAQ No. 995 (82)

Smt.R.K.Roja,
Smt.Uppuleti Kalpana,
Smt.Gowru Charitha Reddy,
Smt. Eswari Giddi,
Ms.Bhuma Akhila Priya, MLAs.

Will the Minister for Price Monitoring, Consumer Affairs, Food & Civil Supplies be pleased to state:

a) whether the Government has allocated any funds in the stabilization of prices; if so, the amount of funds allocated;
b) the measures taken by the Government to control prices of the essential commodities?

Minister for Price Monitoring, Consumer Affairs, Food & Civil Supplies (Smt.Paritala Sunitha):

a) No Sir.
b) Measures taken to control the prices of the essential commodities:

(i) Millers and traders in paddy, rice, pulses, edible oilseeds and edible oils have been brought under the licensing system and stock limits.
(ii) Intensive inspections of mills and traders' premises are being conducted by Enforcement officials to unearth the hoarded stocks of essential commodities which are held in contravention of stock limits prescribed and to seize them and release on interim disposal for its availability in the open market within the State at affordable prices.
(iii) Preferred varieties rice is allowed for sale within the State and outside State in 2:1 ratio, without any levy.
(iv) Regular and surprise checks are being conducted on the rice millers and traders' premises in the essential commodities to unearth the hoarded stocks.
(v) Besides the regular authorized enforcement officials, task forces with the officials of the Civil Supplies/ Revenue, Commercial Taxes, Legal Metrology and Vigilance & Enforcement have been constituted to verify the business premises of millers and dealers to undertake de-hoarding operations and book the cases for violation of the provisions or the Control Orders.
(vi) Toll free Telephone No.1967 has been provided in the Commissionerate of Civil Supplies to receive the complaints and to send them through online to the Collectors for enquiry and redressal of the grievance.

(vii) A Price Monitoring Committee under the Chairmanship of the Chief Secretary has been constituted to review the price situation of ECs, its availability and measures to take from Government side to control the price rise, through market intervention and make them at affordable prices.

(viii) A high level Coordination Committee headed by the Chief Secretary with Commissioners of Agriculture, Marketing, Civil Supplies, Horticulture and M.D., MARKFED and Oilfed and Director, Economics & Statistics as members, has also been constituted to assess the availability and prices of essential commodities as well as Nutritional content of the cereals and to plan the cropping pattern well in advance, and if required an appropriate MSP system be put in place so that the foodgrains which are in greater demand are produced and make them available in the open market for general public at affordable prices.

(ix) For better monitoring prices of key agricultural commodities and to take preventive measures as and when required to safeguard both farmer and consumer interests, the services of M/s. Agriwatch, which is the largest online Agri commodities consulting and market Intelligence Company are utilized.

(x) Collectors have also been instructed to invoke the provisions of the Prevention of Black Marketing and Maintenance of Supplies of Essential Commodities Act to detain the dealers, millers and others who act in a manner prejudicial to the maintenance of supplies of essential commodities to the community.

(xi) Collectors are ensuring that the rice millers sell superfine preferred varieties like the BPT, Sonamasuri etc. at Rs.30 per kg. in Rythu Bazars and at the centres indicated by the Collectors. 35,717 quintals rice was sold through 364 centres.

(xii) A revolving fund or Rs.15.00 lakhs was provided to each Joint Collector and they were instructed to monitor the vegetable prices and arrange for purchase and distribution of vegetables in coordination with Agricultural Marketing Department under Market Intervention operations.

(xiii) In July, 2014 rates of onions, potatoes and tomatoes were abnormally increased in the open market. The Civil Supplies Department with the coordination of Agricultural Marketing Department took steps to control the prices through Market Intervention.

As a result of the above measures taken by the State Government, the price rise of essential commodities have been contained and made available at reasonable prices.

Now, Question No. 83(907), Minister for Health and Medical Education

**Given notice of by Sri Gorantla Butchaiah Chowdary**

**Will the Minister for Health and Medical Education be please to state:**

(a) Whether it is a fact that proper facilities are not provided in Sri Allu Ramalingayya Homeopathy Medical College in Rajahmundry;
(b) Whether it is also a fact that several medical and paramedical posts are vacant; and
(c) If so, the steps being taken in this regard.

MINISTER FOR HEALTH, MEDICAL AND FAMILY WELFARE( DR. KAMINENI SRINIVAS):

(a) No Sir.
(b)&(c): Yes Sir.

A general ban on promotion to the State Cadre Posts has been imposed in view of the A.P.Reorganization Act, 2014.

For filling up of Lecturers (Medical) and Lab Assistant (Paramedical) posts, the matter is under examination.

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి(రాజమండ్రి రూరల్) ః అధ్యక్షా, రాజమండ్రిలోని అల్లు రామలింగయ్య హోమియోపతి మెడికల్ కాలేజి 1969లో కొంతమంది ఔత్సాహికులు హోమియోని ప్రోత్సాహించాలన్న విధానంలో ప్రారంభించి మూసివేశారు. 1983లో నేను ఎమ్.ఎల్.ఏ. అయిన తరువాత దానిని మరలా ఔత్సాహికులతో తెరిపించి ప్రభుత్వానికి స్వాధీనం చేశాము. అప్పటినుంచి సరైన సదుపాయాలు లేవు. తమరు ఆరోగ్య శాఖా మంత్రిగా ఉన్నప్పుడు నేను రిక్వెస్ట్ చేస్తే తమరు ఇచ్చిన రూ.70లక్షలతో కొంతవరకు భవనాలు కట్టారు. ఆ తరువాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. మంత్రిగారి సమాధానంలో లేదండి అన్నారు. అంటే సదుపాయాలన్నీ ఉన్నట్టా?

...

బిల్డింగులు కూడా సరిపోయినన్ని లేవు. అందుకే నేను మీ ద్వారా విజ్ఞప్తి చేసేదేమంటే మన రాష్ట్రంలో అలోపతి తరువాత హోమియోపతికి కూడా ప్రాచుర్యం వచ్చింది. గ్రామీణ

ప్రాంతాలలో పిహెచ్‌సీలు లేని చోట్ల ఎక్కువ మంది హోమియోపతి డాక్టర్లే మందులిచ్చే కార్యక్రమం తమరి దృష్టిలో కూడా వుంది. ఇవాళ హోమియోపతికి కూడా డిమాండ్ పెరిగింది. అందువల్ల ఆ కళాశాలలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరముంది. ఇవ్వాళ రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో గుడివాడ,రాజమండ్రి విజయవాడలలో మాత్రమే కళాశాలలున్నాయి. ఆ మూడు తప్ప కొత్తవి రాలేదు. ప్రైవేటు రంగంలో విజయనగరంలో ఒకటి వచ్చింది. ఇవ్వాళ ఎమ్‌బిబిఎస్ స్థాయిలో డొనేషన్లు కట్టి సీట్లు సంపాదించుకునేంత డిమాండు దానికుంది. చాలా మంది డాక్టర్లు చాలా చోట్ల ప్రాక్టీస్ చేస్తున్నారు. ఫ్లరిష్ అవుతున్నారు. సేవ కూడా చేస్తున్నారు. రాజమండ్రిలో మొన్న మంత్రి గారు కూడా చూశారు కాబట్టి నేను వారికి మనవి చేస్తున్నదేమంటే అక్కడ మేం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ఇచ్చాము. దానిలో ఇంకా కొంత స్థలం అడిగాము. కాని కాలేజీ వాళ్లు అటానమస్ కాలేజీ అంటూ ఆపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్ కింద 2014-15వ సంవతరంలో దాదాపు పది వేల కోట్ల రూపాయలు కేటాయిస్తూ ఆల్ ఆండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి అండ్ అల్లైడ్ రెఫరెన్సెస్‌కు న్యూ కాంపోనెంట్ అండర్ ది స్కీమ్ కింద రూ.250 కోట్లు మంజూరు చేయడం జరిగింది. రాజమండ్రిలో అన్‌సీజన్డ్ వుడ్‌ను సీజన్డ్ వుడ్‌గా చేయడానికి గాను ఒక సామిల్ వుండేది. అది ఇప్పుడు మూత పడింది. దానిని ఎత్తేశారు. ఇప్పుడు దాదాపు ఐదున్నర పైచిలుకు ఎకరాల ఆ స్థలం ఖాళీగా పడివుంది. అది ప్రస్తుతం ఆక్రమణలకు గురవుతున్నది. అందువలన దానిని కేటాయించుకొని మనం కేంద్రానికి పర్స్యూ చేసి రాజమండ్రిలోని ఆ స్థలంలో అలాంటి ఒక రెఫరల్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పడానికి తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుంది. అలాగే అక్కడ బెడ్స్‌ను కూడా వందకు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే అక్కడ పీజీ కోర్సు లేదు. కాబట్టి పీజీ కోర్సును కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటే అక్కడ అందరికీ ఉపయోగకరంగా వుంటుంది. అందువలన మనం కేంద్ర ప్రాయోజిత పథకాన్ని రాజమండ్రిలో తెచ్చుకోగలిగితే అక్కడ రెఫరల్ గానూ మరియు అనేక అభివృద్ధి కార్యక్రమాల అభివృద్ధికి దోహదపడే ఇతర కార్యక్రమాలను కూడా తీసుకొచ్చేందుకు అవకాశమున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నేను ప్రస్తావించిన అంశాలపై అక్కడ తీసుకోబోయే చర్యల గురించి తెలియజెయ్యాలని నేను గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

డా. కామినేని శ్రీనివాస్(కైకలూరు)ః అధ్యక్షా, మొన్ననే నేను గౌరవ శాసన సభ్యులతో కలిసి అక్కడి హాస్పిటల్‌కు వెళ్లాను. అక్కడ బిల్డింగులు కొన్ని వున్నాయి. వాటిని ఎక్స్‌ప్యాండ్ చేయాల్సిన అవసరముంది. అయితే అక్కడ స్థలం లేదు. అక్కడ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ వున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 15మందికి గాను 13మంది వున్నారు. ప్రొఫెసర్స్ 13మందికి గాను ఇద్దరే వున్నారు. రీఆర్గనైజేషన్ కారణంగా కేడర్ డివిజన్ కానిదే ప్రమోషన్స్ కుదరదన్నారు. ఎపిపిఎస్‌సీకి రిక్రూట్‌మెంటు కోసం రాసినప్పటికీ ఎగ్జాక్ట్ డెఫిషియన్సీ ఎంతో తెలిస్తే కాని మనం తీసుకోలేమన్నారు. తప్పకుండా తీసుకుంటాం. తప్పకుండా గౌరవ శాసనసభ్యులతోనూ

మరియు సంబంధిత అధికారులతోనూ త్వరలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని విషయాలు చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటాం.

శ్రీ జి.బుచ్చయ్య చౌదరి(రాజమండ్రి రూరల్)ః అధ్యక్షా, ఏదైతే కేంద్ర ప్రాయోజిత పథకం వుందో దానికి కేంద్ర ప్లానింగ్ కమీషన్ కూడా అప్పట్లో రూ.250 కోట్లకు అప్రూవల్ ఇచ్చింది. దానికి మనం సత్వరం భూమిని అలోకేట్ చేస్తూ ఒక ప్రాజెక్ట్ రిపోర్టును కేంద్రానికి పంపించగలిగితే దానికి శాంక్షన్ వచ్చే అవకాశముంది. అందువల్ల అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి ఎంతో ఉపయోగపడే అవకాశముంది. భూమి కేటాయించి దానివైపు దృష్టి సారించాల్సిన అవసరముంది. ఫారెస్టు మినిస్టర్ గారు కూడా ఇక్కడే వున్నారు. అలాగే గౌ. ముఖ్యమంత్రి గారి దృష్టిలో కూడా మేం పెట్టాం. దానికి సంబంధించి సత్వరమే పర్మిషన్ ఇవ్వాల్సిన అవసరముంది, లేకపోతే ఆ ప్రాజెక్టు వేరే రాష్ట్రాలకు వెళ్లే అవకాశాలుంటాయి.

డా. కామినేని శ్రీనివాస్(కైకలూరు)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన సూచనలు తప్పకుండా దృష్టిలో పెట్టుకొని పరిశీలించడం జరుగుతుంది.

MR.SPEAKER: Question No.989 is deemed to have been answered.

L.A.Q.No.989 (Starred) (84)

Smt.Uppuleti Kalpana, MLA
Sri Kona Raghupathi, MLA
Sri Alla Rama Krishna Reddy,MLA

Will the Minister for Agriculture be pleased to state:

a. Whether there is any proposal with the Government to make applicable the loan waiver to Horticulture and Commercial Crops;

b. If so, the time by which the said waiver will be made applicable;

c. Whether it is a fact that the Government has announced financial assistance to those who are growing such crops; if so, the number of such Ryots to whom the financial assistance has been extended till now and the number of ryots to whom the same is yet to be extended;

d. If not, the reasons there for?

<u>MINISTER FOR AGRICULTURE AND COOPERATION HORTICULTURE & SERICULTURE) DEPARTMENT (SRI PRATHIPATI PULLA RAO):</u>

a) Yes, Sir. Government is framing guidelines to implement " Debt Redemption" in Horticultural Crops also. Commercial crops like Cotton, Chillies, Groundnut and Sugarcane have already been covered in Ist Phase of Agriculture Redemption Scheme – 2014.

b) As early as possible Government will take steps to implement Debt Redemption Scheme in Horticultural Crops.

c) Not applicable.

d) Does not arise.

**ప్రశ్న నెంబర్ 954(85)**

డాక్టర్ అప్పలనాయుడు కొండపల్లి ఎమ్ఎల్ఏ.,

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః

అ. గజపతినగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదన ఏదైనా ఉందా?

ఆ. అయితే ఆ వివరాలేమిటి?

ఇ. ఈ ప్రతిపాదన ఎప్పటిలోగా కార్యరూపంలోకి తేవడమవుతుంది?

**మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ గంటా శ్రీనివాస రావు) ః**

అ. అవునండీ.

ఆ. హైదరాబాదులోని ఆంధ్ర ప్రదేశ్ కళాశాల విద్యాశాఖ కమీషనర్ విజయనగరం జిల్లా, గజపతినగరంలో కొత్త డిగ్రీ కళాశాల మంజూరు కోసం సాధ్యాసాధ్యతల నివేదికతో పాటు ప్రతిపాదన సమర్పించారు.

ఇ. ఈ ప్రతిపాదన ప్రభుత్వ స్థాయిలో పరిశీలనలో ఉంది.

డాక్టర్ కె.అప్పలనాయుడు(గజపతినగరం)ః అధ్యక్షా, మన రాష్ట్రంలో ఎడ్యుకేషన్ ఎలా వుందో ఒకసారి చూసినట్లయితే మన ప్రియతమ నాయకులు, గౌరవ ముఖ్యమంత్రి గారు గతంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్నపుడు భారతదేశంలోనే నాలుగవ స్థానంలో వుండేది. తరువాత రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు 22వ స్థానంలోకి వెళ్లిపోయింది. ఎందుకంటే ఆయన ముఖ్యమంత్రిగా వున్నప్పుడు విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేశారు. మన ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంస్థలు ఎలా వున్నాయో ఎన్‌సిఆర్‌టి సర్వే చేసి ఒక నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులు చదువుకునేందుకు అనువైన వాతావరణం లేదని,

విద్యార్థులు సౌకర్యాల లేమితో బాధపడుతున్నారని తెలియజేయడం జరిగింది. విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలలలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద వుంటే రాజశేఖర రెడ్డి గారు ఆ విషయాన్ని విస్మరించి విద్యావ్యవస్థను నాశనం చేశారు. మా విజయనగరం జిల్లాలో ప్రతిఏటా 23 వేల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్నారు. అందులో సరాసరి 15 వేల నుంచి 16 వేల మంది విద్యార్థులే పాస్ అవుతున్నారు. వాళ్లు డిగ్రీకి వెళ్లాలంటే మా జిల్లాలో వున్నది నాలుగే నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు. 16 వేల మంది విద్యార్థులు పాస్ అయితే వాళ్లకు కేవలం నాలుగే డిగ్రీ కళాశాలలున్నాయంటే అక్కడి పేద విద్యార్థుల పరిస్థితి ఎలా వుంటుందో ఒకసారి గమనించాల్సిన అవసరముంది. నా నియోజకవర్గంలో ప్రతి ఏటా 16 వేల మంది విద్యార్థులు డిగ్రీ చదువుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాళ్లు డిగ్రీ చదువుకోవాలంటే 30 కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకోవలసివస్తుంది. దానితో పేద విద్యార్థులు అంత దూరం వెళ్లి చదువుకోలేకపోతున్నారు. ఎందుకంటే మా జిల్లా ఆర్థికంగా వెనుకబడిన జిల్లా మరియు పేద జిల్లా. కాబట్టి మా గజపతినగరం నియోజకవర్గానికి ఒక డిగ్రీ కళాశాలనిప్పించి పేద విద్యార్థులు చదువుకోవడానికి అవకాశాలు కల్పించాలని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః స్పీకర్ సర్, డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాల మాదిరిగానే నూతన రాష్ట్రంలో సంగీత విద్వాంసులను కూడా దృష్టిలో పెట్టుకొని సంగీత కళాశాలలను కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని నేను మంత్రి గారి దృష్టికి తీసుకొస్తున్నాను. ఎందుకంటే సంగీతానికి సంబంధించి తెలుగు జాతికి ప్రపంచస్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన వారు ఎంతో మంది వున్నారు. వారిలో డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారు కూడా ఉన్నారు. వారు పుట్టిన ప్రాంతం నా నియోజకవర్గంలో వుంది. సుమారు 2500 సంగీత కచేరీలు చేసిన గొప్ప సంగీత విద్వాంసులు వారు.400 కొత్త రాగాలను సృష్టించిన వారు. మన నూతన రాష్ట్రంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి పేరు మీద సంగీత పాఠశాలలను కానీ సంగీత కళాశాలలను కానీ ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి వుందా అని మీ ద్వారా అడుగుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు(భీమిలి)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు అప్పలనాయుడు గారు చెప్పినట్లుగా రాష్ట్రంలో విద్యావ్యవస్థ గత పది సంవత్సరాల కాలంలో ఏ స్థాయికి దిగజారిందన్నది వాస్తవం. ముఖ్యంగా కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు విద్యకు అత్యంత ప్రాధాన్యతనివ్వడం, గతంలో వివిధ శాఖల కింద అనగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, సాంకేతిక శాఖల కింద వున్న వాటన్నిటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి మానవ వనరుల శాఖ పేరు పెట్టడమే కాకుండా దానికి గత బడ్జెట్‌లోనే కాదు ఈ బడ్జెట్‌లో కూడా దాదాపు 15/16 శాతం కేటాయించడం జరిగింది. ఈ రాష్ట్రాన్ని ఒక నాలెడ్జ్ స్టేట్‌గా, ఒక ఎడ్యుకేషనల్ హబ్‌గా చేయడానికి అవసరమైన సిఫార్సులు చేయడం కోసం ఎక్స్‌పర్ట్స్ కమిటీని నియమించి

సంస్కరణలను ఎలా తీసుకురావాలన్న దాని గురించి ఆలోచిస్తున్నాం. ప్రత్యేకించి ఫ్యాకల్టీకి సంబంధించి రిక్రూట్‌మెంట్ కోసం మనం నోటిఫికేషన్ కూడా ఇచ్చుకున్నాం.

...

ఇవన్నీ కూడా రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో విద్యలో మనం తీసుకొంటున్న ప్రాధాన్యతకు గుర్తుగా ఉండాలని చర్యలు తీసుకుంటున్నాం. మొన్ననే విశాఖపట్నంలో ఐఐఎంకు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ నెల 28వ తేదీన తిరుపతిలో ఐఐటి, ఐఐఎస్ఈఆర్‌కు శంకుస్థాపన చేస్తున్నాం. అయితే గౌరవసభ్యులు అప్పలనాయుడుగారు చెప్పినట్లు గజపతినగరంలో డిగ్రీ కళాశాల గురించి అప్పటి ముఖ్యమంత్రిగారు వాగ్దానం చేశారు. అయితే రకరకాల కారణాల వల్ల ఇప్పటిదాకా ఆ వాగ్దానం ఆచరణలోకి రాలేదు. దానిమీద ఇప్పటికే ఫీజిబిలిటీ రిపోర్టు కూడా తెప్పించాను. కాలేజియేట్ ఎడ్యుకేషన్ నుంచి నివేదిక సరైన ఫార్మేట్‌లో రాకపోతే మరలా తిప్పి పంపించి మరలా పంపించమని కోరగా ఇపుడు ఫార్మేట్‌లో వచ్చింది. ఆ రిపోర్టు పాజిటివ్‌గా వచ్చింది కాబట్టి వచ్చే విద్యా సంవత్సరానికి కళాశాల ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం. గౌరవసభ్యులు సోదరులు సూర్యారావు గారు మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి పేరు మీద సంగీత కళాశాల లేదా పాఠశాల స్థాపన గురించి సూచించారు. వారు ఈ విషయంలో మంచి సలహా ఇచ్చారు. తప్పకుండా దానిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్(తెనాలి)ః అధ్యక్షా, మంత్రిగారు మాట్లాడుతూ ఐఐటి, ఐఐఎంలు వైజాగ్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాల వల్ల ప్రారంభించబడుతున్నాయని చెప్పడం చాలా సంతోషం. అయితే మీద్వారా మంత్రిగారిని అడిగేది ఐఐఎం, ఐఐటి వలన గానీ లేదా కేంద్ర ప్రభుత్వ సహాయసహకారాలతో మన రాష్ట్రంలో ప్రారంభించబడుతున్న విద్యా సంస్థలలో మన రాష్ట్రంలో చదువుకొన్న విద్యార్థినీ విద్యార్థులకు ఎంత ప్రాధాన్యత ఇవ్వబోతున్నారని అడుగుతున్నాను. రెండోది, పెద్దలు గజపతినగరం శాసనసభ్యులు చెప్పినట్లుగా ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థుల శాతం రానురాను తగ్గిపోతున్నది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చూసినా కూడా మన దేశంలోని ఐఐటీ, ఐఐఎంలకు అంతర్జాతీయ స్థాయిలో చూస్తే మనం 200 ర్యాంకులోపు ఉంటున్నాం. మనం మన రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించబోతున్నాం కాబట్టి మానవవనరుల అభివృద్ధి శాఖామాత్యులు ఆలోచించాలని, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నాను. ఈ విషయంలో ముందుగా ఏమి చర్యలు తీసుకోబోతున్నారో కూడా ఆలోచించాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బెందాళం అశోక్(ఇచ్ఛాపురం)ః అధ్యక్షా, ప్రభుత్వం విద్య, వైద్య రంగాలలో చాలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నది. ప్రత్యేకంగా పాఠశాలలో డ్రాపవుట్స్ తగ్గించడానికి "బడి పిలుస్తోంది" అనే కార్యక్రమం పెట్టాం. కాకపోతే ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యంగా పాఠశాలల్లో

టాయిలెట్స్ లేకపోవడంతో బాలికలు చాలా ఇబ్బందులుపడుతున్నారు. ముఖ్యంగా మా నియోజకవర్గంలో ప్రతి పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం చాలా ఉంది. ఈ విషయంలో గౌరవమంత్రివర్యులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ కె.ఎస్.జవహర్(కొవ్వూర్)ః అధ్యక్షా, వాస్తవంగా మన రాష్ట్రంలోని 13 జిల్లాలలో ఉపాధ్యాయులకు సంబంధించిన తీవ్రమైన సమస్యను గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకొచ్చాను. అదేమంటే 610 జీవోకు విరుద్ధంగా మన రాష్ట్రంలో సుమారు 8వేల మందికి పైగా పనిచేస్తున్నారు. వారందరూ కోర్టు నుంచి, ట్రైబ్యునల్ నుంచి స్టే తెచ్చుకొని విధుల్లో కొనసాగుతున్నారు. కానీ వసుంధర అనే ఉపాధ్యాయురాలు ట్రైబున్యల్ నుంచి స్టే తెచ్చుకొన్నప్పటికీ ఆమె విషయంలో రాజమండ్రిలో పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆమెను పలు ఇబ్బందులు పెడుతున్నారు. ఆ ఉపాధ్యాయురాలిపై అధికారులిద్దరూ కక్షగట్టి ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 371డి ఆర్టికల్ ప్రకారం బదిలీ చేయలేపోతున్నారని చెబుతున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాలలో దాదాపు 8 వేల మందికి పైగా ఆ జాబితా కింద ఉన్నారు. వారందరూ కూడా స్టేమీద కొనసాగుతుండగా ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయురాలిమీద కక్షగట్టి ఇబ్బంది పెడుతున్నందున ఆ విషయంలో ఏమి చర్యలు తీసుకున్నారని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బొబ్బిలి చిరంజీవులు(పార్వతీపురం)ః అధ్యక్షా, మీకు, గౌరవముఖ్యమంత్రిగారికి ముందుగా ధన్యవాదాలు. మా నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల స్థాపన గురించి ముఖ్యమంత్రిగారికి, విద్యాశాఖమంత్రిగారికి విన్నవించగా డిగ్రీ కళాశాల మంజూరుచేస్తూ ఉత్తర్వులిచ్చారు. కానీ అందుకు అవసరమైన విధంగా వివిధ ఫార్మేట్లలో జిల్లా నుంచి సమాచారమంతా సమర్పించడం జరిగింది. అయితే మా పార్వతీపురం నియోజకవర్గంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలు చాలా ఉన్నాయి. కానీ తప్పనిసరిగా వచ్చే విద్యాసంవత్సరంలో అయినా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభమయ్యేలా ఏర్పాటు చేయవలసిందిగా, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ తలారి ఆదిత్య(సత్యవేడు)ః అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకొని చిత్తూరు జిల్లాలో ఐఐటి, ఐఐఎస్ఈఆర్ సంస్థలు తీసుకొచ్చారు. గౌరవ మంత్రిగారు అక్కడకు వచ్చి పరిశీలించారు గానీ, ఎపుడు ప్రారంభిస్తున్నారో, శంకుస్థాపన ఎపుడు చేస్తున్నారో, ఇప్పటివరకు తెలియలేదు. ఇంకొక ముఖ్యమైన విషయం. సత్యవేడు నియోజకవర్గంలో ఐఐఐటి స్థాపిస్తామని దాదాపు రెండున్నర సంవత్సరాల నుంచి చెబుతున్నారు. అందుకోసం అవసరమైన భూసేకరణతోబాటు అవసరమైన ప్రాసెస్ అంతా కూడా పూర్తి అయింది. కానీ చిన్న చిన్న కారణాలతో ఐఐఐటి ఇప్పటివరకు సత్యవేడు నియోజకవర్గంలో ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా

మంత్రిగారు కొంత చొరవ తీసుకొని ఐఐఐటి ప్రారంభోత్సవం చేయాలని మీద్వారా మంత్రిగారికి మనవి చేస్తున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు(భీమిలి)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చాలా మంది మన రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల స్థాపన గురించి అడిగారు. కొత్త డిగ్రీ కళాశాలలకు సంబంధించి కొన్ని నార్మ్స్ ఉన్నాయి. కొత్త డిగ్రీ కళాశాల స్థాపనకు కనీసం ఐదెకరాల స్థలం, 27 లెక్చరర్ల పోస్టులు, 14 బోధనేతర సిబ్బంది పోస్టులు, రికరింగ్ ఖర్చుల కింద సంవత్సరానికి రూ.1.35కోట్లు, మౌలికవసతుల కింద 11 తరగతి గదులు, నాలుగు లేబరేటరీలు, ఒక పరిపాలనా భవనం, ఫర్నిచర్, కంప్యూటర్, సైన్స్ లేబరేటరీకి రూ.12.93 కోట్లు కావాలి. వీటికి సంబంధించి ఇప్పటివరకు నోటిఫికేషన్ ఇవ్వగా ఫీజిబిలిటీ రిపోర్టు తొమ్మిది కళాశాలల విషయంలో వచ్చింది. శ్రీకాకుళం జిల్లా బుర్జలో, విజయనగరం జిల్లా గజపతినగరంలో, విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లిలో, తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో మహిళా డిగ్రీ కళాశాల, అనంతపురం జిల్లాలో హిందూపురం, గుత్తి, నార్పలలో, చిత్తూరు జిల్లాలో బి.కొత్తకోట, నెల్లూరు జిల్లాలో బుచ్చిరెడ్డిపాలెంలలో స్థాపించబోయే డిగ్రీ కళాశాలల గురించి రిపోర్టులు వచ్చాయి. అవి కాకుండా మరో 17 ప్రాంతాలలో డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని విన్నపాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి విషయంలో ఫీజిబిలిటీ రిపోర్టు రావలసి ఉంది. ఆ రిపోర్టు వచ్చిన తరవాత పాజిటివ్‌గా ఉంటే తప్పకుండా కళాశాలలు ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకొంటామని తెలియజేస్తున్నాను.

జాతీయ సంస్థలైన ఐఐటి, ఐఐఎంలలో ప్రవేశాల గురించి గౌరవసభ్యులు అడిగారు. అవి జాతీయస్థాయి సంస్థలు కాబట్టి వాటిలో స్థానిక విద్యార్థులకు కోటా ఏమీ లేదు. కానీ ఎన్ఐటి ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్ర విద్యార్థులకు అందులో 50శాతం కోటా ఉంటుంది. మన రాష్ట్రంలో ఎన్ఐటి పశ్చిమగోదావరి జిల్లాలో స్థాపించబోతున్నాం. మిగతా సంస్థలలో ప్రవేశాలు జాతీయస్థాయిలో నిర్వహించే పోటీపరీక్షలలో మెరిట్ మరియు రిజర్వేషన్లను బట్టి ఉంటుంది. ఆ సంస్థలలో మన రాష్ట్ర విద్యార్థులకు కోటా లేకపోయినా మన రాష్ట్రంలో అటువంటి జాతీయస్థాయి సంస్థలు స్థాపించినచో విద్యార్థులలో కలిగే ఇన్‌స్పిరేషన్ చాలా బాగుంటుంది. మన రాష్ట్రంలో ఐఐటి, ఐఐఎస్ఈఆర్, ఐఐఎంలను 28వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ కేంద్ర మంత్రి శ్రీ వెంకయ్య నాయుడు, కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా చిత్తూరు జిల్లా ఏర్పేడులో ప్రారంభించబోతున్నాం. సత్యవేడులోని శ్రీసిటీ సెజ్‌లో స్థాపించబోతున్న ఐఐఐటిని కూడా ప్రారంభించబోతున్నాం. గౌరవసభ్యులు అశోక్‌గారు పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్ల గురించి అడిగారు. బాలికలకు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది. సిఎస్ఆర్ కింద పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్, గెయిల్, టిసిఎస్ 10,000 టాయిలెట్లు నిర్మిస్తామన్నారు. వాటి నిర్మాణానికి టెండర్లు పిలిచి అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. 610 జీవో

గురించి, వసుంధర అనే ఉపాధ్యాయురాలి గురించి గౌరవసభ్యులు ఇంతకు ముందు కూడా నా దృష్టికి తీసుకువచ్చారు, ఇపుడు కూడా తెలియజేశారు. ఆ విషయంలో అధికారులతో మాట్లాడిన తరవాత వారికి న్యాయం చేస్తామని తెలియజేస్తున్నాను. దానితోబాటు మిగతా చోట్ల డిగ్రీ కళాశాలలకు సంబంధించి కూడా తప్పకుండా ప్రాధాన్యత ఇచ్చి వచ్చే విద్యాసంవత్సరానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

MR SPEAKER: Question No. 86 (1044) is deemed to have been answered.

L.A.Q.No.1044 (Starred) (86) Sri Audimulapu Suresh, MLA
Sri Pothula Rama Rao, MLA
Sri Gottpati Ravi Kumar, MLA

WILL THE MINISTER FOR WOMEN DEVELOPMENT & CHILD WELFARE, MINES & GEOLOGY BE PLEASED TO STATE:

a. Whether there is any proposal pending with the Government to change the mining Policy? If so, the details thereof;

b. The number of mining lessees yet to start the mining actively under major and minor minerals and District wise details thereof?

c. The list of Granite Mining Leases in Prakasam District yet to Commence mining despite Granite permissions allottee wise and year wise details of allotment in Prakasam District?

d. The amount of Seigniorage collected through sand Mining till Feb'2015? And District wise details thereof?

**MINISTER FOR WOMEN DEVELOPMENT & CHILD WELFARE, MINES & GEOLOGY (SMT PEETHALA SUJATHA):**

a) Yes, Sir.

b) 548 Mining Leases for Major Minerals and 923 Quarry Leases for Minor Minerals are categorized as non working in the State as on date. The District wise details of the non-working Mining Leases and Quarry Leases are enclosed as Annexure-I.

c) 52 Granite quarry leases in Prakasam District are categorized as non-working. The List of non-working Granite leases of Prakasam District, allottee wise and year wise, is enclosed as Annexure-II.

d) A Seigniorage fee of Rs.15.97 Corres collected on 39,93,508.70 Cu.mt. of sand sold upto Feb'2015. The District wise details is enclosed as Annexure – III.

**Question No. 958 (87)      Minister for Endowments......**

ప్రశ్న నెం. **958 (87)**      **శ్రీ గొల్లపల్లి సూర్యారావు,ఎమ్మెల్యే**

గౌరవనీయులైన దేవాదాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు కోట్లాది రూపాయలు విలువ కలిగిన బంగారం, వజ్రాల ఆభరణాలను కలిగి ఉన్న విషయం వాస్తవమేనా;

ఆ) తూర్పు గోదావరి జిల్లాలోని అంతర్వేది వద్ద గల లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయం మరియు ఆభరణాల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలేమిటి;

ఇ) సదరు దేవాలయంలో అధునాతన భద్రతా ఏర్పాట్లు చేయడమయిందా;

ఈ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

**<u>దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ పైడికొండల మాణిక్యాలరావు):</u>**

అ) దేవతా విగ్రహాల అలంకరణ కోసం అనేక పెద్ద దేవాలయాలు కొంత బంగారాన్ని, నగలను కలిగి ఉన్నాయి.

ఆ) అంతర్వేదిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయం యొక్క బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను గుర్తింపు పొందిన బీమా కంపెనీలో బీమా చేయడమయింది. దేవాలయంలో వినియోగం కోసం రెగ్యులర్‌గా అవసరమైన కొన్ని నగలను స్థానిక ట్రెజరీ కార్యాలయాలు, బ్యాంకు లాకర్లలో ఉంచడమయింది. రాత్రి సమయంలో దేవాలయ ప్రాంగణాన్ని కాపలాకాయడానికి స్థానిక కాపలాదారుని కూడా ఏర్పాటు చేయడమయింది.

ఇ) అవునండి.

ఈ) దేవస్థానం రేయింబవళ్లు ఎలక్ట్రానిక్ నిఘాలో ఉంటున్నది.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు): స్పీకర్ సార్, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లోని విగ్రహాలకు ప్రభుత్వం భద్రతను ఏర్పాటు చేస్తోందనే మాటలను మనం వింటున్నాం. కానీ, ఎక్కడో ఒకచోట దేవతా విగ్రహాలు అపహరణకు గురౌతూనే ఉన్నాయనేది వాస్తవం. దేవాలయాల్లోని గర్భగుడిలో దేవతల ఒంటిపైన ఉన్న బంగారు నగల కోసం, ఆభరణాల కోసం దోపిడిదొంగలు ఎంతటి సాహసానికైన ప్రయత్నాలు చేసి అలంకరించిన బంగారు వస్తువులను, ఆభరణాలను దొంగిలించుకుపోతున్నారనే మాట సర్వసాధారణంగా ప్రజానీకంలో ఉంది. బంగారు వస్తువులను బీమా కంపెనీలో భద్రపరిచినప్పటికి గానీ, ట్రెజరీ కార్యాలయాల్లో గానీ, బ్యాంకు లాకర్లలో గానీ భద్రపరిచినప్పటికి కూడా ఇంకా కొంత భాగం దేవాలయాల్లోనే ఉండిపోవడం కారణంగా మానవత్వ విలువలు నశించిపోయి దేవాలయాల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. ఆ పరిస్థితుల నుండి దేవాలయాలను కాపాడుటకు గాను దేవాలయాల వద్ద భద్రత నిమిత్తం పోలీస్ కానిస్టేబుల్స్‌ను గానీ, హోం గార్డ్సును గానీ పగటి పూట, రాత్రి పూటల్లో షిఫ్ట్ సిస్టమ్ ప్రకారం నియమించినట్లైతే ప్రయోజనం చేకూరుతుంది. అటువంటి ఆలోచన ఏమైనా ప్రభుత్వం దగ్గర ఉందా అని నేను గౌరవ మంత్రి గారిని తమరి ద్వారా కోరుతున్నాను.

అధ్యక్షా, (ఇ) ప్రశ్నకు సంబంధించిన సమాధానం విషయంలో గౌరవ మంత్రి గారు "అవునండి" అని సమాధానం చెప్పడం జరిగింది.

అధ్యక్షా, అంతర్వేది దేవాలయం అనతికాలంలోనే ఎంతో అభివృద్ధి చెందినటువంటి దేవాలయంగా విలసిల్లుతున్నది. ఆ దేవాలయానికి భక్తుల రద్దీ కూడా ఎక్కువౌతోంది. తద్వారా అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి భక్తులు ఇచ్చే విరాళాలు కూడా ఎక్కువౌతున్నాయి. భద్రత విషయమై నేను ఈమధ్యే స్థానికంగా ఉండే పోలీస్ సిబ్బందిని అడిగాను. స్థానిక డి.ఎస్.పి. గారిని కూడా అడిగాను. ఆ సందర్భంగా సిబ్బంది కొరత కారణంగా అంతర్వేది దేవాలయానికి భద్రత కల్పించలేకపోతున్నామని, అవసరమని భావిస్తే హోంగార్డ్సను భద్రత నిమిత్తం ఏర్పాటు చేయడం జరుగుతుందనే విషయాన్ని పోలీస్ అధికారి చెప్పడం జరిగింది. కానీ, దేవాలయ నిధులతో గానీ, ప్రభుత్వం గానీ స్వయంగా దృష్టిసారించి భద్రత విషయంలో పోలీస్ కానిస్టేబుల్స్‌ను ఏర్పాటుచేసే ఆలోచన ఏమైనా ప్రభుత్వం దృష్టిలో ఉన్నట్లైతే తెలుపవల్సిందిగా నేను తమరిద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) (భీమవరం): అధ్యక్షా, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం నందలి దేవతా దేవాలయాల్లో ఎక్కువగా భక్తులు కొలిచే దేవాలయం శ్రీ శ్రీ శ్రీ మావుళ్లమ్మ దేవాలయంగా పేరొందింది. నేను మొదటి పర్యాయం భీమవరం నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత

"అమ్మవారికి బంగారు వస్త్ర నిధి" అనే నామకరణం చేసి 60 కేజీల బంగారంతో అమ్మవారికి తొడుగు చేయించడం జరిగింది. నిన్నటి ఉగాది పర్వదినాన కూడా అమ్మవారికి బంగారు పాదం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆ బంగారు నగలన్నీ కూడా 364 రోజులు అమ్మవారి విగ్రహం పైనే ఉంటాయి. 364 రోజులు దేవత పైన బంగారం ఉండే దేవాలయం భీమవరం నందలి మావుళ్లమ్మ దేవాలయమే. దేశంలో మరెక్కడ కూడా సంవత్సరం పొడువునా బంగారు నగలు ధరించే ఆలయాలు లేవు. ఆ దేవాలయ దర్శనానికి తమరు కూడా ఒక పర్యాయం రావాలని కోరుతున్నాను. ఆ దేవతను దర్శించి కోరిక కోరుకుంటే తప్పనిసరిగా మీరు స్పీకరే కాదు, రాష్ట్రపతి హోదా కూడా తమరికి దక్కుతుంది.

(సభలో చప్పట్లు)

అధ్యక్షా, అత్యంత పవిత్ర కల్గిన దేవాలయం శ్రీ శ్రీ శ్రీ మావుళ్లమ్మ దేవాలయం. ఆ విషయం గౌరవ మంత్రి గారికి కూడా తెలుసు. ఆ దేవాలయానికి భద్రతను అధునాతన పోలీస్ ఆయుధాలతో ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఎందుకంటే, సుమారు వంద కేజీల బంగారు ఆభరణాలు నిత్యం 364 రోజులు అమ్మవారి ఒంటి మీద ఉంటే, భద్రత విషయంలో అత్యంత జాగ్రత వహించాల్సిన అవసరం ప్రభుత్వానికుంది. పగలు, రాత్రిల్లు 24 గంటలు షిఫ్ట్ పద్ధతిన పోలీస్ సిబ్బందిని ఆ దేవాలయానికి అధునాతన పోలీస్ ఆయుధాలతో ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దేవాలయానికి నిత్యం భక్తులు తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ దేవాలయ ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కోటి రూపాయల వ్యయంతో ఒక స్కూల్‌ను ఏర్పాటుచేసి అందులో చేరే పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పాలనే ఆలోచన దిశగా ప్రయత్నాలు చురుకుగా జరుగుతున్నాయి. అంత గొప్పటి దేవాలయం మా నియోజకవర్గంలో ఉండటాన్ని మేమంతా గొప్పగా, అదృష్టంగా భావిస్తున్నాం. తమరు కూడా ఒకసారి భీమవరం వచ్చి శ్రీ శ్రీ శ్రీ మావుళ్లమ్మ దేవాలయాన్ని సందర్శించాలని కోరుతున్నాను. అదే విధంగా దేవాలయానికి భద్రతను పెంచే విషయంలో కూడా గౌరవ మంత్రి గారు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కూడా తమరి ద్వారా విజ్ఞప్తిచేస్తున్నాను.

శ్రీ పైడికొండల మాణిక్యాలరావు (తాడేపల్లిగుడేం): అధ్యక్షా, తప్పనిసరిగా గౌరవ సభ్యులు, మిత్రులు శ్రీ గొల్లపల్లి సూర్యారావు గారు చెప్పిన సూచనేదైతే ఉందో, పోలీస్ సిబ్బందితో గానీ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌తో గానీ అంతర్వేదిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయానికి భద్రత కల్పించేందుకు గాను చర్చించి తప్పనిసరిగా సత్వరమే భద్రతను కల్పించడం జరుగుతుంది.

అలాగే, పెద్దలు రామాంజనేయులు గారు భీమవరం నందలి శ్రీ మావుళ్లమ్మ దేవాలయానికున్న ప్రతిష్టతను గూర్చి, ప్రత్యేకతను గూర్చి చెప్పడం జరిగింది. వారు చెప్పినట్టుగానే 364 రోజులు బంగారు ఆభరణాలతో దేవాలయంలోని దేవతా విగ్రహం

అలంకరించుకుని ఉంటుంది. దేశంలోని మరే ఇతర దేవాలయాల్లో అటువంటి విధానం ఉండదు. గతంలో నాలుగైదు మాసాల క్రితం దేవాలయం ఉన్న రోడ్డులోనే బీహార్ రాష్ట్రానికి చెందిన దోపిడి దొంగలు ఆయుధాలతో సంచరించిన సంఘటన కూడా జరిగింది. కాబట్టి, ప్రస్తుతమున్న భద్రతను అత్యాధునిక పోలీస్ ఆయుధాలతో పెంచేందుకుగాను ఆలోచన జరుగుతోంది. తప్పనిసరిగా దేవాలయానికి  అటు సెక్యూరిటీతో పాటు, ఇటు బంగారు ఆభరణాల విషయంలో బీమాకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.  దేవాలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. సత్వరమే భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దేవాలయాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. థ్యాంక్యూ.

మిస్టర్ స్పీకర్:  రామాంజనేయులు గారు  తమరు దేవాలయ సందర్శనకు రావాలని నన్ను కోరారు.  అందుకు ధన్యవాదాలు. కానీ, మీరు  చెప్పినట్టుగా ఇప్పుడు దేవాలయ దర్శనానికి వస్తే  అందుకే వచ్చారని కొందరనుకుంటారు.

**(సభలో నవ్వులు)**

MR.SPEAKER: Question No. 88 (707) is deemed to have been answered.

L.A.Q.No.707 (88) Sri Bhuma Nagi Reddy

Will the Minister for Transport, Roads and Buildings be pleased to state:

a) whether it is a fact that the roads of Roads & Buildings Department are being subjected to encroachments in Municipalities in the State;
b) the number of such roads that are subjected to encroachments till now; and
c) the action taken by the Government in this regard?

MINISTER FOR TRANSPORT, ROADS AND BUILDINGS (Sri Siddha Raghava Rao):

a) Yes Sir,
b) Road Margins in many Municipalities and other urban areas are being encroached.
c) State Government, during 04.02.2015 and 09.02.2015 in PR&RD, MA&UD, Home and TR&B Departments directed all the District

Collectors, Superintendents of Police and other public authorities to remove statues, cut-outs, flexis, and photos on public roads, pavements, sideways and other public utility places; on 09.03.2015, TR&B Department, directed to evict the encroachments on R&B roads / unauthorized persons from the shops beneath flyover bridges in the State; and the same is reviewed and monitored through video conference from time to time.

**Question No. 921 (89) Minister for Agriculture...........**

ప్రశ్న నెం. **921 (89)** **శ్రీ పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి,ఎమ్మెల్యే**

గౌరవనీయులైన వ్యవసాయ, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) చేపల వేటపై ఆధారపడిన సముద్ర తీర ప్రాంతంలోని అనేక వందల మంది మత్స్యకారుల కుటుంబాలు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం ఓడరేవు నిర్మాణం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం వాస్తవమేనా;

ఆ) కృష్ణపట్నం ఓడరేవు సమీపాన ఉన్న మత్స్యకార గ్రామాలలో సదరు ఓడరేవు నిర్మాణం కారణంగా ఏర్పడిన ఇసుకమేట వల్ల వారు సముద్రంలోనికి తమ పడవలను తీసుకువెళ్లలేక మత్స్యకారులు ఆందోళన పడుతున్నారన్న విషయం ప్రభుత్వం దృష్టికి తేవడమయిందా;

ఇ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్య ఏమిటి?

**వ్యవసాయ, పశుసంవర్ధన, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు) :**

అ) అవునండి.

ఆ) అవునండి.

ఇ) ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా, బొగోల్ మండలం, జువ్వలదిన్నె గ్రామం వద్ద మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పరిశీలనలో ఉంది.

శ్రీ పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (కోవూర్): అధ్యక్షా, మొట్టమొదట తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే, కొన్ని వాస్తవ

పరిస్థితులను తమరిద్వారా సభ దృష్టికి తీసుకురాదలిచాను. కృష్ణపట్నం పోర్టు నిర్మాణం జరిగిన తరువాత నెల్లూరు జిల్లాలోని దాదాపు ఐదు నియోజకవర్గాల్లో మత్స్య కారులు నివసిస్తున్నారు. ఐదు నియోజకవర్గాలంటే కొవ్వూరు, కావలి, సర్వేపల్లి, గూడూరు మరియు సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో ఎక్కువ మంది మత్స్యకారులు నివసిస్తున్నారు. సముద్ర తీరప్రాంతానికి సంబంధించిన ఐదు నియోజకవర్గాలున్నాయి. వేలాది మత్స్యకారుల కుటుంబాలు నివసిస్తున్న పరిస్థితుల్లో కృష్ణపట్నం పోర్టు నిర్మాణం జరగకముందు అక్కడ ఒక జట్టి ఉండేడిది. ఆ జట్టి ఐదు నియోజకవర్గాలకు సెంటర్ పాయింట్‌గా ఉండి మత్స్యకారులందరు చేపల వేటకు వెళ్లే పరిస్థితి ఉండేడిది. అయితే, కృష్ణపట్నం పోర్టు నిర్మాణం జరిగిన తరువాత ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన మత్స్యకారుల గ్రామాల్లోని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లాలంటే సముద్రంలో ఏర్పడిన ఇసుకమేట వల్ల వారు సముద్రంలోనికి తమ పడవలను తీసుకువెళ్లలేక మత్స్యకారులు ఆందోళన, ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. కృష్ణపట్నం పోర్టు అధికారులు జిల్లాలోని బాగోల్ మండలంలోని జువ్వలదిన్నె ప్రాంతంలోనైతే జట్టిని ఏర్పాటు చేసినట్లైతే ప్రయోజనం ఉంటుందనే ఆలోచనచేసి ఆ ప్రాంతాన్ని సెలెక్ట్ చేసి అక్కడే మినీ షిప్పింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన చేసినట్టుగా గౌరవ మంత్రి గారు ఇందాక తెలియజేశారు. ఈ సందర్భంగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి ఒక విషయాన్ని మనవి చేయదలిచాను. జువ్వలదిన్నె ప్రాంతం ప్రకాశం జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉంటుంది. అయితే అది కూడా తీర ప్రాంతమే. అయినప్పటికి జువ్వలదిన్నె ప్రాంతంలో మినీ షిప్పింగ్ హార్బర్‌ను నిర్మించడం వల్ల మా జిల్లాలోని మత్స్యకారులకు ఎటువంటి ప్రయోజనం చేకూరదు. ఎందుకంటే జువ్వలదిన్నె ప్రాంతంలో మినీ షిప్పింగ్ హార్బర్‌ను ఏర్పాటుచేసినట్లైతే జిల్లాలోని మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటారు. కాబట్టి ఆ దిశగా గౌరవ మంత్రి గారు ఆలోచన చేయాలని కోరుతున్నాను. కోవూరు నియోజకవర్గ పరిధిలో జట్టి గానీ, మినీ షిప్పింగ్ హార్బర్‌ను గానీ ఏర్పాటు చేసినట్లైతే దాదాపు ఐదారు మండలాలోని మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలియజేస్తున్నాను. తద్వారా మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోనికి వెళ్లడానికి అనుకూలంగా ఉంటుందనే విషయాన్ని కూడా తమరిద్వారా గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను. కచ్చితంగా ఆ దిశగా ఆలోచనచేయాల్సిన అవసరం ప్రభుత్వానికెంతైనా ఉంది.

...

దీని మీద ఖచ్చితంగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా దీనికి సంబంధించిన అయిదారు మండలాలు ఉన్నాయి. ఈ మండలాలలతోబాటు మిగిలిన మత్స్య కారుల కుటుంబాల సమస్యల మీద ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈరోజు మత్స్యకారులకు వేరే వృత్తుల పట్ల పెద్దగా అవగాహన లేదు. వారు వేరే వృత్తిని చేసే పరిస్థితి లేదు. కేవలం సముద్రపు వేటనే వారు వృత్తిగా స్వీకరించిన పరిస్థితుల్లో, కల్లుగీత కార్మికులకు ఏ విధంగానైతే 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారో, దానిని మంత్రి గారు అదే విధంగా ముఖ్యమంత్రి గారు గతంలో కూడా ముఖ్యమంత్రిగా తొమ్మిది

సంవత్సరాలు పరిపాలించిన పరిస్థితుల్లో, వారు అనేకసార్లు మత్స్యకారుల గురించి మత్స్యకారుల సంక్షేమం గురించి మత్స్యకారుల యొక్క భవిష్యత్తు గురించి మత్స్యకారుల కుటుంబాల్లో ఉన్న విద్యార్థుల ప్రగతి పట్ల అనేక అద్భుతమైన కార్యక్రమాలను చేపట్టిన పరిస్థితుల్లో, విశాఖపట్నం ప్రాంతంలో హుదూద్ తుఫాన్ వచ్చిన సందర్భంలో కూడా మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున గౌరవ ముఖ్యమంత్రి గారు దగ్గరుండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి మత్స్యకారులను కాపాడే ప్రయత్నం చేసినందుకు ఈ సందర్భంలో గౌరవ ముఖ్యమంత్రి గారికి నేను ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

మత్స్యకారుల పట్ల మనం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఏప్రిల్ మే మాసాల్లో మత్స్యకారులకు వేట నిషేధం విధించడం జరుగుతుంది. దాదాపు 40రోజుల పైన మత్స్యకారులు వేటకు వెళ్లలేని పరిస్థితుల్లో వారి బ్రతుకులు అగమ్యగోచరంగా ఉండే పరిస్థితిని మన ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి గారు గమనించాల్సిందిగా కోరుతున్నాను. తమిళనాడులో వేట నిషేధం ఉన్న సమయంలో రూ.3000 లను ప్రతి కుటుంబానికి చెల్లించి 31 కిలోల బియ్యాని ఇస్తున్నారు. కానీ మన రాష్ట్రంలో గత 10 సంవత్సరాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వం యొక్క నిర్వాకం వల్ల, మత్స్యకారులు దారుణంగా నష్టపోతున్న విషయాన్ని తమరి ద్వారా గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకొస్తున్నాను. ఖచ్చితంగా ప్రక్క రాష్ట్రాల్లో ఏ విధంగానైతే మత్స్య కారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తున్నారో అదే విధంగా ప్రాధాన్యతను ఇచ్చి మన రాష్ట్రంలో ఉన్న మత్స్యకారుల కుటుంబాలను కూడా ఆదుకోవాల్సిందిగా కోరుతున్నాను.

ఈరోజు ఫైబర్ బోట్లకు సబ్సిడీ మీద డీజిల్ని సరఫరా చేయడంలేదు, కేవలం మర బోట్లకు మాత్రమే సబ్సిడీ మీద డీజిల్ను సరఫరా చేస్తున్నాము. ఈరోజు మర బోట్లకు స్వస్తి చెప్పి చాలా గ్రామాల్లో ఫైబర్ బోట్లను ఉపయోగిస్తూ తద్వారా జీవనాన్ని సాగిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధను తీసుకొని ఫైబర్ బోట్లకు కూడా డీజిల్ను సబ్సిడీ మీద సరఫరా చేసే కార్యక్రమాన్ని తప్పకుండా ఆలోచన చేయాలి. అదేవిధంగా మర పడవలకు ఇంజన్ను సబ్సిడీ మీద సరఫరా చేస్తున్నారు. మర పడవలకే కాకుండా ఫైబర్ బోట్లకు కూడా సబ్సిడీ మీద ఇంజన్ను ప్రభుత్వం తరఫున సరఫరా చేసే కార్యక్రమాన్ని గౌరవ మంత్రి గారు ఆలోచన చేయాల్సిందిగా కోరుతున్నాను.

ఈ సంవత్సరం ఆరు యూనిట్లను సబ్సిడీ మీద (మర పడవలను) మా దగ్గర సబ్సిడీగా ఇవ్వడం జరిగింది. ఆరు యూనిట్లను కాదు దీనిని పెంచాల్సిన అవసరం ఉంది. ఒక్కొక్క యూనిట్ కాస్ట్ రూ.4 లక్షలు అవుతుంటే రూ.2 లక్షలను బ్యాంకు రుణంగా ఇప్పించి, మిగిలిన రూ.2లక్షలను సబ్సిడీ మీద ఇచ్చే విధంగా చూసినట్లయితే మత్స్యకారుల కుటుంబాలకు ఉపయోగకరంగా ఉంటుందనే విషయాన్ని గమనించాలి, మత్స్యకారుల కుటుంబాలను

ఆదుకునే విషయంలో ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి గారు అదేవిధంగా గౌరవ మంత్రివర్యులు శ్రీ ప్రతిపాటి పుల్లారావు గారికి అపారమైన అనుభవం ఉంది, ఎందుకంటే వారి నియోజకవర్గం కూడా మత్స్యకారులు ఉన్న తీర ప్రాంతంలో ఉంది. కాబట్టి ఖచ్చితంగా మత్స్యకారుల జీవన స్థితిగతుల పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా వారికి నేను మనవి చేస్తున్నాను. ఖచ్చితంగా మత్స్యకారుల సంక్షేమం కోసం మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవడం కోసం, ముఖ్యమంత్రి గారి ఆలోచన మేరకు మంత్రి గారు మంచి నిర్ణయాన్ని ప్రకటించాల్సిందిగా సవినయంగా తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు): అధ్యక్షా, సముద్ర తీరంలో ఉన్న అంతర్వేది అనే మత్స్యకార గ్రామంలో గవర్నమెంటు ఆఫ్ ఇండియా వారు మినీ జట్టీ అనే మినీ హార్బర్‌లాగా ఒక రూ.20 కోట్లతో ఓడ రేవును శాంక్షన్ చేయడం జరిగింది. ఇది అక్కడ సుమారు అల్లవరం మండలంలో ఉన్న ఓరల్‌రేవు గానీ, కరవాక గానీ, రామేశ్వరం, అంతర్వేది. రోజు ఒక 15 వేల కుటుంబాలు ఈ సముద్రం మీద ఆధారపడి మర పడవల మీద, పడవల మీద, బోట్ల మీద, ప్రతి రోజు ఫిషింగ్ చేసి, వాటిని సముద్రంలోనే ఆ యొక్క మర బోట్లను గానీ, పడవలను గానీ, లేకపోతే ఇతరత్రా వాటిని సముద్రం మధ్యలో ఆపేసి, చిన్న పడవల మీద అక్కడకు వెళ్లి ఆ చేపలను తీసుకొని ఒడ్డుకు తెచ్చి అమ్ముకునే ప్రక్రియ ఇప్పుడు జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు ఈ నాలుగు గ్రామాలకు కూడలిగా ఉన్న అంతర్వేదిలో ఒక మినీహార్బర్‌ను రూ.20 కోట్లతో మంజూరు చేయడం జరిగింది. దానికి సంబంధించి 20 ఎకరాల భూమిని కూడా మొన్ననే తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ గారు ఎక్వైర్ చేయడం, ఆ భూములను డిపార్ట్‌మెంటుకు హ్యాండోవర్ చేయడం కూడా జరిగింది. అదేవిధంగా మన రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన షేర్ క్యాపిటల్ రూ.2 కోట్లను కూడా ఫైనాన్స్ మినిస్టర్ గారు రిలీజ్ చేయడం జరిగింది. ఇప్పుడు ఆ పనిని ప్రారంభించాలనుకునేసరికి, ఈ వర్కును సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటులో ఉన్న ఇంజనీరింగ్ వింగ్ వారు – ఇలాంటి పనులకు మాకు ఎక్స్‌పీరియన్స్ లేదు, దీనిని మేము చేయలేమనే మాటను చెప్పడంతో, కలెక్టర్ గారు కలుగజేసుకొని ఆ పనిని హెడ్‌వర్క్స్ డిపార్ట్‌మెంటుకు అలాట్ చేశారు. నేను గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను, మీరు దయచేసి ఆ సంబంధిత అధికారులైన ఫిషరీస్ వారితో సంబంధిత కలెక్టర్ గారితో ఎప్పటికప్పుడు దీని గురించి చర్చించి, త్వరలోనే, ఎంత వీలైతే అంత త్వరగా ఎందుకంటే ఇది మంచి సీజన్ వారికి. మార్చి, ఏప్రిల్, మే, జూన్ వర్షాలు వచ్చే లోపుగా ఈ వర్కును ప్రారంభించినట్లయితే సుమారు 15 వేల మంది మత్స్యకారుల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 50 వేల మంది ఈ మత్స్య సంపద మీద వ్యాపారం చేసుకొని బ్రతికే అవకాశం ఉంటుంది. దీని వల్ల అనేక రకాలైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా డెవలప్ అవుతుంది. వ్యాపార కూడలిగా తయారవుతుంది.

అందుచేత ఇది బహుశా కోస్టల్ బెల్ట్‌గా ఉన్న మాకు, విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి, తూర్పు గోదావరిలో మొట్టమొదటిగా ఈ మినీహార్బర్‌ను అంతర్వేదిలో మంజూరు చేసిన విషయాన్ని తమరి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాను. అందుచేత మంత్రి గారు స్పెషల్‌గా దీని మీద ఇంట్రస్ట్‌గా తీసుకొని, వీలైనంత త్వరగా ఈ వర్కును ప్రారంభిస్తే అంత త్వరగా మత్స్యకార కుటుంబాల జీవన విధానంలో గొప్ప మార్పును తీసుకురావడమే కాకుండా, ఒక వ్యాపార సంస్థలుగా కూడా వారిని తయారు చేయడానికి ఆస్కారం ఉంటుంది గనుక గౌరవ మంత్రి గారు సీరియస్‌గా దీన మీద ఇన్వాల్వ్ అయి ఈ కార్యక్రమాన్ని చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఎ.ఆనందరావు (అమలాపురం): నమస్కారం అధ్యక్షా, ఈ మత్స్యకారుల విషయంలో మా జిల్లాలో మేము పరిశీలన చేస్తే, మా జిల్లాలో ఉన్న సమస్యలే రాష్ట్ర మొత్తం ఉన్నాయి. మా జిల్లాలో చూసినప్పుడు, మత్స్యకారులు సముద్రంలో వేట ద్వారా సంవత్సరానికి సుమారు 15 వేల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు. అలాగే సుమారు 80 వేల టన్నుల చేపలను వారు వేట ద్వారా సేకరిస్తున్నారు. ఈవిధంగా విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకురావడానికి అమోఘంగా కృషి చేస్తున్నారు. కానీ గత పది సంవత్సరాల కాలంలో పని చేసిన పాలకులు మత్స్యకారుల సమస్యలను, మత్సకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వలన, అనేక మంచి విషయాలు అనేక ముఖ్యమైన విషయాలు, మత్స్యకారులకు సంబంధించినవి మరుగున పడిపోయాయి. ముఖ్యంగా ఇంతకు ముందు మాట్లాడిన సభ్యులు చెప్పినట్లు వేట నిషేధ కాలంలో, అది కేవలం సేవింగ్ అండ్ రిలీఫ్ అనే పథకం ద్వారా రూ.600 లను కేంద్ర ప్రభుత్వం రూ.600 లను రాష్ట్ర ప్రభుత్వం, అలాగే మ్యాచింగ్ గ్రాంటుగా నెలకు రూ.60 చొప్పున మత్స్యకారులు చెల్లిస్తే మరో రూ.600 ఆ విధంగా వేట నిషేధం ఉన్న ఆ మూడు నెలల కాలంలో రూ.1800 ఇస్తున్నారు. ఈరోజుల్లో 45 రోజులకు రూ.1800 అంటే మత్స్యకారుల యొక్క కుటుంబ పోషణకు ఇది ఏ మాత్రం సరిపోదు. మరి మా ప్రక్కనే ఉన్న పాండిచ్చేరి రాష్ట్రంలో ఇది సుమారు రూ.4వేలు ఇస్తున్నారు. అలాగే బియ్యం కూడా 45 రోజులకు గాను కేవలం 31 కేజీలనే ఇస్తున్నారు.

...

45రోజులకు గానూ, మత్యకారులకు అందించే బియ్యం కేవలం 31 కేజీలు ఇస్తున్నారు. మా జిల్లాకు ప్రక్కనే ఉన్న ప్రభుత్వం 100కేజీలు ఇస్తున్నారు. వీటన్నింటినీ పెంచాలనీ తమద్వారా గౌరవమంత్రి గారిని కోరుతున్నాను. గతపాలకుల నిర్లక్ష్యానికి మరో ఉదాహరణ ఏమంటే వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు. మత్స్యకార్లు సముద్రంలో వేటకు వెళ్లిన సందర్భంలో తుఫాన్‌లు సంభవించి ప్రమాదంలో చనిపోవడం జరుగుతోంది. కేవలం లక్షరూపాయలు కేంద్రప్రభుత్వం నుండి మరోలక్షరూపాయలు రాష్ట్రప్రభుత్వం కలిపి మొత్తం రూ.2.00లక్షలుగా ఇస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితి చూసినట్లైతే, ఇతరత్ర వృత్తుల వారికి ఇస్తున్న ఎక్స్‌గ్రేషియాలతో సరిపోల్చి

చూసినట్లైతే వీరికిచ్చే ఎక్స్‌గ్రేషియా చాలా తక్కువగా ఉంది కాబట్టి దీనిని కూడా పెంచాల్సిందిగా తమద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మాజిల్లాలో 2002వ సంవత్సరం మార్చి31వతేదీన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయాలని ఏదైతే బోట్స్ రిజిస్ట్రేషన్స్ పెట్టారో, ఆనాడు మాజిల్లాలో రిజిష్ట్రేషన్ చేసుకున్న పెద్దబోట్స్ సంఖ్య 500 ఉన్నాయి. రిజిష్టర్ కాబడిన బోట్స్‌కు మాత్రమే లీటరు డీజల్‌ధరపై రూ.6.03పైసలు చొప్పున రాయితీ ఇవ్వడం జరుగుతోంది. కానీ ఆనాడు డీజిల్ ధర లీటరు రూ.30-35గా ఉన్నప్పుడు నిర్ణయించిన రాయితీని ఈరోజు లీటరు డీజల్ ధర రూ.60/- కు పైబడినా కూడా అదే రాయితీని కొనసాగిస్తున్నారు. ఈనాటి డీజిల్ ధరకు అనుగుణంగా రాయితీని పెంచాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

2002వ సంవత్సరం తరువాత ఏర్పడిన ప్రభుత్వాలు మత్యకారుల బోట్స్ రిజిష్ట్రేషన్ పద్ధతిని అమలులో పెట్టలేదు. ఈరోజు మాజిల్లాలో ఫైబర్‌బోట్స్ ఉన్నాయి. సుమారు రెండువేలమంది చిన్న, మధ్యతరగతి మత్యకారులు పైబర్‌బోట్స్‌తో వేటకు వెళుతున్నారు. వారిబోట్స్‌కు రిజిస్ట్రేషన్ లేదు. ఎందుకంటే రిజిస్ట్రేషన్ చెయ్యాలి, మత్స్యకారులకు మేలు చేయాలన్న ధ్యాస గతప్రభుత్వాలకు లేకపోయింది. ఆ కారణంచే సుమారు రెండువేల మంది మత్స్యకారులు ఈనాడు డీజిల్ రాయితీని పొందలేకపోతున్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లి మత్స్య సంపదను తీసుకువస్తుంటారు. వారి భార్యలు ఆ చేపలను విక్రయిస్తుంటారు. ఈరోజు కాయగూరల ధరలు కన్నా గ్రామాల్లో చేపల ధరలు చౌకగా ఉన్నాయి. చేపలు కూడా మంచి పౌష్టికాహారమే. కాబట్టి మేజర్ గ్రామపంచాయితీలలో మత్స్యకారు కుటుంబాల మహిళలతో చేపల మార్కెటింగ్ జరగాలంటే, చేపల మార్కెట్స్ ఏర్పాటు చేసినట్లైతే, తద్వారా మార్కెట్ సదుపాయం పటిష్టంకాగలదని తమద్వారా మంత్రిగారికి విజ్ఞప్తి చేసుకుంటున్నాను.

ఎప్పుడైతే చేపలు అమ్ముడు పోకుండా ఉంటాయో ఆ సమయాల్లో చేపలను ఎండపెడుతుంటారు. మేజర్ గ్రామాల్లో డ్రైఫిష్ ప్లాట్‌ఫామ్స్‌ను మంజూరు చేయాల్సిందిగా తమద్వారా కోరుతున్నాను. దానితోపాటు, చేపలు నిలువ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాల్సిందిగా తమద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. మాజిల్లాలో 99మత్స్యకారుల గ్రామాలున్నాయి. మెరైన్, ఇన్‌లాండ్ పథకంలో కేవలం అయిదు కమ్యూనిటీ కేంద్రాలు మాత్రమే ఇవ్వడం జరిగింది. కమ్యూనిటీ కేంద్రాల సంఖ్యను కూడా పెంచాల్సిందిగా గౌరవ మంత్రిగారిని కోరుకుంటున్నాను.

శ్రీ పి.శ్రీనివాసరావు (గాజువాక) : మా గాజువాక నియోజకవర్గంలో గంగవరం పోర్ట్ లిమిటెడ్ అని ప్రైవేట్ పోర్ట్ ఇండస్ట్రీ పెట్టారు. గంగవరం పోర్ట్ వారు సీఎస్ఆర్ ఫండ్స్ కింద నిధుల ఇవ్వాల్సిందిగా కోరుతూ చుట్టుప్రక్క గ్రామల ప్రజలు అపోజ్ చేస్తున్నారు. అందుకు

ప్రధాన కారణాలేమంటే ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద ప్రభుత్వం ఇవ్వాలా, గంగవరం పోర్టు వారు ఇస్తారా అన్న సందేహం ఉంది. మేము కూడా ఎన్నికల్లో మత్స్యకార గ్రామాలన్నీ తిరిగి మేము గెలిస్తే పెండింగ్ ఉన్నటువంటి ఆర్‌ఆర్ ప్యాకేజీలను గంగవరం పోర్ట్ వారి దగ్గరనుండి ఇప్పిస్తామనీ వాగ్ధానాలు కూడా చేశాం. ఈమధ్య జరిగిన పీఏసీ సుమావేశానికి స్థానిక శాసనసభ్యునిగా నేను హాజరయ్యాను. ఆ సమావేశంలో గంగవరం పోర్టు వారితో మీరు ఎందుకు ఆర్‌ఆర్ ప్యాకేజీ పెండింగ్ ఉంచుకున్నారని ప్రశ్నిస్తే, మీరు బిల్డ్, ఆపరేట్, అండ్ ట్రాన్స్‌ఫర్ విధంగా పబ్లిక్ మరియు ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టామనీ ఇందులో ఆర్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి ఏదైనాసరే ప్రభుత్వం ఇవ్వాలి, గంగవరం పోర్ట్‌కు సంబంధించింది కాదని స్పష్టం చేయడం జరిగింది. కనుక ఏదైతే, గంగవరం పోర్ట్ ఏర్పాటు సమయంలో ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన ప్యాకేజీ పెండెన్సీ ఉన్నాయో అవన్నీ ప్రభుత్వం తక్షణమే ఇవ్వాల్సిందిగా తమద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మత్స్యకార గ్రామాల్లో పోర్ట్స్ నిర్మాణ సమయంలో జెట్టీల నిర్మాణం చేస్తామని వాగ్ధానం చేశారు. కాబట్టి ముఖ్యంగా జెట్టి నిర్మాణం చేయాల్సిందిగా కోరుతున్నాను. గతంలో యారాడా అనే గ్రామంలో జెట్టీ నిర్మాణం చేస్తామని చెప్పి చెప్పడం, తరువాత విశాఖపట్నం పోర్ట్ వారు వచ్చి ఇది 5 nautical miles దగ్గరలో ఉంటే మేము పర్మిషన్ ఇవ్వమంటూ వారు అడ్డుతగలడం వంటి అనేకానేక సాంకేతిక కారణాల వల్ల జెట్టీల నిర్మాణం చేయలేదు. అయితే ఇప్పుడు దూరంగా వెళ్లే ప్రాంతంలో జెట్టీ నిర్మాణం చేస్తారనే ఆలోచనకు వచ్చారు. అది దూరంగా ఉంటుంది కనుక జెట్టీ నిర్మాణం చేసిన తరువాత అక్కడ వారి పునరావాసం కల్పించే బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను. అలాగే వారిజీవన భృతికింద ఇస్తామన్న ఆర్థిక ప్యాకేజీని తక్షణమే అమలుచేయాలి. ప్యాకేజీ విషయంలో ప్రజాప్రతినిధులుగా ప్యాకేజీ ఇవ్వాల్సిందిగా వత్తిడి తీసుకొస్తే, ఇండస్ట్రీని గట్టిగా నిలదీస్తే మీరు ఇండస్ట్రీ రాకుండా అడ్డుపడుతున్నారని వారి అపోహపడతారు. మత్స్యకారులందరూ మీరు ఇండస్ట్రీకి అనుకూలంగా మాట్లాడితే, మీరు ఇండస్ట్రీతో కుమ్మక్కయ్యారన్న అపోహపడతారు. ఇలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులున్నాయి. ఈవిషయాన్ని కూడా తమద్వారా సంబంధిత మంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లాల్సిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ : రామకృష్ణగారు..

శ్రీ వి.రామకృష్ణబాబు (విశాఖపట్నం ఈస్ట్) : అధ్యక్షా, విశాఖనగరం మొన్నటి హుద్‌హుద్ తుఫాన్ సందర్భంలో మత్యకారుల పడవలు, వలలు కొట్టుకుపోయాయి. అందుకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించడం జరిగింది. కానీ చాలామందికి ఇప్పటివరకు నష్టపరిహారాలు అందలేదు. ఈ విషయాన్ని తమద్వారా మంత్రిగారికి తెలియజేసుకుంటున్నాను. అదేవిధంగా సహచర శాసనసభ్యులు ఆనంద్ గారు, పల్లా శ్రీనివాస్ గారు చెప్పినట్లు

మత్స్యకారుల విషయంలో చాలా సమస్యలున్నాయి. ఆ సమస్యలు కూడా పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతప్రభుత్వాలు మత్స్యకారులను విస్మరించిన మాట వాస్తవం. మన ప్రభుత్వంలో వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మత్స్యకారులకు డ్రైఫిష్ ప్లాట్‌ఫామ్స్ కానీ, ఫిష్ మార్కెట్స్ కానీ, ముఖ్యంగా చాపలు నిలువ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు కానీ, ఏర్పాట్లు చేయవల్సిన అవసరం ఎంతైనాఉంది.

విశాఖ తూర్పు నియోజకవర్గం వాసవవానిపాలెంలో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ తరఫున ఒక ప్రైమరీస్కూల్ ఉంది. ఆ డిపార్ట్‌మెంట్ వారు సరిగా ఆస్కూల్‌ను మెయింటెనెన్స్ చేయడం లేదు. దయచేసి ఆ స్కూల్‌ను వెంటనే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పోరేషన్‌కు స్వాధీనపరిస్తే బాగుంటుందని తమద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. అదేవిధంగా మత్స్యకారులు వేటను నిలిపివేసిన సమయంలో కేవలం 31కేజీల బియ్యం మాత్రమే ఇస్తున్నారు. 45రోజులపాటు ఆ కుటుంబం బ్రతకాలంటే కనీసం వారికి రూ.5000లు అయినా ఇస్తే బాగుంటుదని తమద్వారా మంత్రిగారిని కోరుకుంటున్నాను.

ముఖ్యంగా మత్స్యకారులలో ఎస్సీ, ఎస్టీలకన్నా చదువు చాలా తక్కువగా ఉంది. మత్స్యకారులకు అక్షరాస్యత కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలనీ, అంతేకాదు మత్స్యకారుల గృహనిర్మాణాల విషయంలో కూడా తగిన చర్యలు తీసుకోవాలని తమద్వారా మంత్రిగారిని కోరుకుంటున్నాను.

మిస్టర్‌స్పీకర్ : మినిస్టర్ గారు..

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట): అధ్యక్షా గౌరవ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి గారు చెప్పినట్లు జువ్వలదిన్నె ప్రాంతమే కాకుండా గ్రేట్‌ప్రాంతంలో కూడా జెట్టీల నిర్మాణం కావాలని అడిగారు. స్థానిక మత్స్యకారుల ప్రయోజనం నిమిత్తం సీఐసీఈఎఫ్ వారు తీరప్రాంతంలో వారికి అవసరమైన సముద్ర ప్రాంతంలో వేటకొరకు రాకపోకల నిమిత్తం సౌకర్యాలను నిర్మించేందుకు ప్రతిపాదించడం జరిగింది. జువ్వలదిన్నె మినీ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పరిచేందుకు సీఐసీఈఎఫ్ వారు రూ.133కోట్లు అంచనా వ్యయం ప్రతిపాదించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ అభ్యర్థన మేరకు భారతప్రభుత్వం ఇంజనీరింగ్ సర్వే, సాంకేతిక మరియు ఆర్థికపరమైన నివేదికను తయారు చేయవల్సిందిగా సీఐసీఈఎఫ్ వారికి సూచనలివ్వడం కూడా జరిగింది. సెప్టెంబర్ 2014లో సీఐసీఈఎఫ్ వారు ఇంజనీరింగ్ టీమ్ పూర్తిస్థాయి ఇంజనీరింగ్ ఇన్వెస్టిగేషన్ నిర్వహించడం జరిగింది, వారి నివేదిక రావల్సి ఉంది.

మత్స్యశాఖ వారి సూచనలను అనుసరించి ప్రతిపాదిత జువ్వలదిన్నె మినీ ఫిషింగ్ హార్బర్‌లో1000 ఎఫ్ఆర్‌పీ పడవలు, 50 పడవలు 12మీటర్ల పొడవు తోను, 100పడవలు

14మీటర్ల పొడవుతోనూ, కలిగిన పడవలను నిలుపుదల చేయడానికి సీఐసీఈఎఫ్ వారు ప్రతిపాదించారు. సీఐసీఈఎఫ్ వారి పూర్తి నివేదిక వచ్చిన తరువాత భూసేకరణ చేయడానికి, పర్యావరణ మరియు అటవీ అనుమతులు పొందడానికి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణా మండలి నుండి అనుమతులు పొందడానికి అవసరమైన చర్యలు తీసుకొని భారత ప్రభుత్వం వారికి సీఎస్ఎస్ కింద ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపబడుతున్నాయి.

...

భారత ప్రభుత్వం వారికి, CSS కింద ప్రాజెక్టును చేపట్టడానికి ప్రతిపాదనలు కూడా పంపబడుతున్నాయి. అదేవిధంగా సభ్యులు శ్రీ శ్రీనివాస్‌రెడ్డిగారు చెప్పినట్టు అక్కడ ఒక జెట్టీ ఉంటే ఐదారు మండలాలకు సౌకర్యంగా ఉంటుందని ఈ సభ దృష్టికి తీసుకురావడం జరిగింది. తప్పకుండా దాని గురించి కూడా పరిశీలన చేయటం జరుగుతుంది. మత్స్యకారులకు వేట నిషేదం సమయంలో పెన్షన్ గురించి అందరు సభ్యులు అడగటం జరిగింది. గౌరవ సభ్యులు శ్రీ సూర్యారావుగారు, శ్రీ ఆనందరావుగారు, శ్రీ శ్రీనివాసరావుగారు, శ్రీ కృష్ణబాబుగారు అందరూ కూడా వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకిచ్చే వేతనాన్ని మరికొంత పెంచితే బాగుంటుందని చెప్పడం జరిగింది. ఈరోజు బియ్యం, రూ.2,000 లను మత్స్యకారులకు ఇవ్వడం జరుగుతుంది. తప్పకుండా అవకాశం ఉన్నంతవరకూ వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకిచ్చే వేతనాన్ని పెంచడానికి కూడా ప్రయత్నం చేస్తాం.

అదేవిధంగా పడవుల మోటర్లకు సంబంధించి 50 శాతం రాయితీలిస్తున్నాం. 10,000 మోటర్లకు 2013-14వ సంవత్సరానికి సంబంధించి రూ.3 లక్షలు మంజూరు చేయడమయింది. అదేవిధంగా హుదూద్ తుపానులో నష్టపరిహారం కింద రూ.17 కోట్లు మంజూరయ్యాయి. మత్స్యకారులకు కూడా నష్టపరిహారం కింద విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం మత్స్యకారులకు ఇవ్వడం జరిగింది. ఇంకా కొంతమంది మత్స్యకారులు మాకు కూడా నష్ట పరిహారం అందాలని రిప్రజెంటేషన్స్ కొన్ని వచ్చాయి. వాటిని కూడా పరిశీలించి నష్టపోయినవారికి కూడా న్యాయం చేయడం జరుగుతుంది.

అదేవిధంగా సభ్యులు శ్రీ సూర్యారావుగారు అంతర్వేదిలో రూ.16.97 కోట్లు మంజూరు చేయడం, దాని నిమిత్తం రూ.2 కోట్లు విడుదల చేయడం కూడా జరిగింది. అది జిల్లా కలెక్టరుగారి ద్వారా నీటిపారుదల శాఖవాళ్లు లేదా disaster management ఇంజినీర్లు చూస్తారు. దాని విషయమై కూడా త్వరగా నిర్ణయం తీసుకుంటాం. యుద్ధప్రాతిపదికన ఆ అంతర్వేది పనులను పూర్తి చేసేదానికోసం చర్యలు కూడా తీసుకుంటాం. సభ్యులందరూ కూడా dry fish platform కావాలని అడిగారు. దానికోసం కూడా ఫిజిబిలిటీని ఒకసారి తెప్పించుకుని, dry fish platform ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

అదేవిధంగా సభ్యులు శ్రీ కృష్ణబాబుగారు ప్రైమరీ స్కూల్ ఒకటి మున్సిపల్ కార్పోరేషన్‌కు హ్యాండోవర్ చేయమని అడిగారు. దాని నిమిత్తం కూడా ఫీజిబిలిటీ ఏవిధంగా ఉన్నదో ఒకసారి చూసి డిపార్ట్‌మెంట్ కిందనో లేకపోతే కార్పోరేషన్‌కు హేండోవర్ చేయడమో కూడా యాక్షన్ కూడా తీసుకోవడం జరుగుతుంది.

అదేవిధంగా రిజిస్ట్రేషన్స్ గురించి కూడా సభ్యులు శ్రీ ఆనందరావుగారు అడిగారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఉన్న లోటుపాట్లను, ఏవిధంగా మత్స్యకారులకు అనుకూలంగా చేయాలో వాటికనుగుణంగా కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

***

MR. SPEAKER: Question No. 821 (90) is deemed to have been answered.

MR. SPEAKER: Question No. 821 (90) is deemed to have been answered.

Starred Question No. 821,

Notice given by Sarvasri
Chevireddy Bhaskar Reddy

Will the Minister for Endowments be pleased to state:

**QUESTION**

a) the amount of annual budget of Tirumala Tirupati Devasthanams; the department wise allocation of budget;
b) the details of the amount deposited in various banks by the T.T.D.; the bank wise interest being accrued on the said deposits; and
c) the expenditure incurred annually on devotees; the expenditure being incurred on social and other activities?

**MINISTER FOR REVENUE (Sri K.E. KRISHNA MURTHY)**

**ANSWER**

a) Sir, the annual Budget Estimates of Tirumala Tirupati Devastamans for the year 2014-2015 is Rs. 2,401.70 crores. The Department wise allocation details for the year 2014-15 is furnished as under:

| **Name of the Department** | Amount (Rs. In crores) |
|---|---|
| Sri Tirumala Temple | 58.60 |
| Other TTD Temples | 29.93 |
| Forest | 14.65 |
| Garden | 27.82 |
| Dairy Farm | 21.03 |
| Canteens | 9.03 |
| Choultries | 36.16 |
| Publications | 29.67 |
| Health & Sanitation | 94.21 |
| Kalyana Katta | 25.04 |
| Kalyanamandapams | 12.45 |
| Vigilance | 53.36 |
| Hospitals | 24.45 |
| Engineering | 349.13 |
| Transport | 57.03 |
| Procurement | 285.87 |
| Head Office | 1,194.44 |
| Education Department | 76.26 |
| Museums | 2.57 |
| **Total Rs.** | **2,401.70** |

b) The details of the amounts deposited by TTD is various banks and the interest accrued thereon on 31.03.2014 are furnished hereunder:

(Rupees in Crores)

| S.No. | Bank Name | Amount of Deposit as on 31.03.2014 | Accrued interest as on 31.03.2014 |
|---|---|---|---|
| 1 | Vijaya Bank | 2,142.31 | 5.91 |
| 2 | Indian Overseas Bank | 1,178.24 | 46.44 |
| 3 | Andhra Bank | 1,082.59 | 82.13 |
| 4 | State Bank of Hyderabad | 777.42 | 54.83 |

| | | | |
|---|---|---|---|
| 5 | Syndicate Bank | 736.66 | 37.90 |
| 6 | Sapthagiri Grameena Bank | 91.62 | 4.14 |
| 7 | Indian Bank | 87.69 | 6.00 |
| 8 | United Bank of India | 61.85 | 3.27 |
| 9 | Canara Bank | 49.15 | 0.81 |
| 10 | State Bank of India | 44.30 | 2.67 |
| 11 | Others | 147.26 | 11.74 |
| | **TOTAL RS.** | **6,399.09** | **255.84** |

c) The expenditure incurred on devotees for the financial year 2013-14 is Rs. 988.11 Crores. The expenditure incurred on social and other activities for the financial year 2013-14 is Rs. 393.82 Crores.

All the papers included in the Agenda are deemed to have been laid on the table of the House.

**<u>Papers laid on the Table:</u>**

"A copy of Annual Report of Andhra Pradesh Power Finance Corporation Limited for the year 2013-2014 as required under Section 619-a (3) of the Companies act, 1956."

**MR. SPEAKER** : Now a special mention by Smt. Anita.

శ్రీమతి వి. అనిత (పాయకరావుపేట)ః అధ్యక్షా, ధన్యవాదాలు. ఓవరాల్‌గా కొంచెం బాధగానే ఉంది. పర్టిక్యులర్‌గా, పదే పదే ఒక గౌరవ సభ్యురాలు గురించే మాట్లాడటమన్నది తప్పు. ఒక లేడీగా ఆ విషయం గురించి మాట్లాడటం కొంచెం నాకు బాధాకరంగా ఉంది. మొన్న 18వ తేదీన జరిగిన సభాపర్వాన్ని మనమంతా చూశాం. మనతోపాటు సుమారు ఐదు కోట్ల ప్రజలు కూడా చూశారు. ఆరోజు సభలో వ్యవహరించిన ప్రతిపక్ష సభ్యుల తీరును, పర్టిక్యులర్‌గా మహిళా సభ్యురాలు, ఒక గౌరవ పొజిషన్‌లో ఉన్న మహిళా సభ్యురాలు శ్రీమతి ఆర్.కె.రోజాగారు చేసిన హావభావాలు గాని, ఆవిడ సభలో వ్యవహరించిన తీరును, పర్టిక్యులర్‌గా అందరూ చూశారు. గౌరవ ముఖ్యమంత్రిగారు సభలో ఉన్నారన్న భయం కూడా లేకుండా, కనీసం గౌరవం కూడా లేకుండా ఆవిడ వ్యవహరించిన తీరును మనందరం చూశాము. ఒక

దళితమంత్రి మీద ఆవిడ చేసే వ్యాఖ్యలు నిజంగా చాలా బాధాకరం. ఈరోజు ఒక ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక ఎక్కడున్నామన్న ప్రశ్న కూడా ఏర్పడుతుంది. ఓవరాల్‌గా ఆవిడ చేసిన వ్యాఖ్యలను మనం చూస్తే, శారీరకంగా గాని, at the same time ఆవిడ వ్యక్తిగత విషయాలలో కూడా, పదే పదే ఆవిడ కాలును చూపిస్తున్న వ్యవహారశైలిని గాని, ఆవిడ మాట్లాడే తీరును గాని చూస్తే నిజంగా ఈరోజు మేం మహిళా సభ్యులుగా తలదించుకొంటున్నాం. ఇలాంటి మహిళలు చట్ట సభలలోకి వస్తే, రేపొద్దున్న మహిళలు చట్ట సభలలోకి రావడానికి చాలా ఇబ్బందిపడతారు. ప్రతిపక్ష నేత వాళ్ల సభ్యులకి నీతి నియమాలు చెప్పడంలో కూడా ఫెయిల్యూర్ అయ్యారన్న విషయం పర్టిక్యులర్‌గా నాకు ఈరోజు అర్థమవుతుంది. మహాభారతంలో శిఖండిని ముందు పెట్టుకుని యుద్ధం చేసినట్టుగా శ్రీమతి రోజాని ముందుపెట్టుకుని ప్రతిపక్షనేత మాగ్జిమమ్ సభలో నడుచుకుంటున్నారు. ఈ విషయంలో ఒకసారి మీరు పర్టిక్యులర్‌గా ఒక దళిత మంత్రిని అలా వ్యాఖ్యానించడమే కాకుండా సభా ప్రాంగణంలో ఒక మీడియాతో మాట్లాడుతూ "మహా అయితే ఏం చేస్తారు ఒక అట్రాసిటీకేసు పెడతారు అంతే కదా" అన్న వ్యవహారతీరులో మాట్లాడటం జరిగింది. ఆల్‌రెడీ అట్రాసిటీ కేసు ఆవిడకు అలవాటే. గతంలో కూడా శ్రీమతి ఆర్.కె.రోజా మీద అట్రాసిటీ కేసు నమోదయ్యింది. కానీ, "అప్పుడు ఏమీ జరగలేదు" అన్న భావన కూడా ఆవిడకు ఉంది. ఈ విషయంలో ఒక దళితమంత్రిమీద చేసిన వ్యాఖ్యలపైన ఆవిడ క్షమాపణ చెప్పాలి. At the same time ఈ సభాముఖంగా నేను తెలియజేసేదేమంటే, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును ఆవిడమీద పెట్టడానికి మీ అనుమతిని కోరుతున్నాం.

ఇంకోరకంగా చెప్పాలంటే, సభలో ఆవిడ వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే, సభలో దుశ్శాసన పాత్రను పెడదామని చెప్పి ఎక్కువ ఆలోచన చేస్తున్నట్టున్నారు. కానీ మీద్వారా ఈ సభాముఖంగా ఆవిడను ఒకటే కోరుతున్నాను. నగరి నియోజకవర్గ ప్రజలు ఏం చేస్తున్నారు, ఎలా ఉన్నారో అన్న ఆలోచన లేకుండా, ఈరోజు ప్రతిపక్షనేత దగ్గర ఆవిడ మార్కులు కొట్టేయాలనే ఏకైక ఉద్దేశంతో ఆవిడ చేసిన వ్యవహారం గాని, ఒక మహిళాలోకం సిగ్గుపడేవిధంగా ఆవిడ వ్యవహరించిన తీరును గానీ చూస్తే మనందరికీ చాలా బాధాకరం. నగరి నియోజకవర్గ ప్రజల ముందుకు రేపు పొద్దున్న ఇదే హావభావాలతో ఎలా వెళ్తుందో మాకైతే అర్థం కావడం లేదు. ఆవిడ ఆ నియోజకవర్గ ప్రజలకు ఏం సమాధానం చెబుతారో కూడా మాకు అర్థం కావడం లేదు. ఓవరాల్‌గా ప్రజలు మనల్ని ఎన్నుకున్నారు. జగన్‌గారు ఒక్కరే ఆవిడను గెలిపించలేదు. ప్రజలు గెలిపించారు. ఏ మహిళా సభ్యురాలైనా, ఏ ఎమ్మెల్యే అయినా ప్రజలకు సమాధానం చెప్పాలి. మనం ప్రజలకు జవాబుదారీతనం. కాబట్టి ఆ ప్రజలదగ్గర ఆవిడ సిగ్గుచేటుగా వ్యవహరించిన తీరును ఆవిడ విజ్ఞతకే వదిలివేస్తున్నాను. ఈ విషయంలో నేను ప్రివిలైజ్ మోషన్‌ను మూవ్ చేయటం ఇది మూడవసారి. ఈ విషయంలో తప్పనిసరిగా మీరు ఆవిడమీద చర్య తీసుకోవాలి. At the same time ఆవిడ మీద అట్రాసిటీ కేసును పెట్టడానికి కూడా మీరు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరుతున్నాం.

I would like to move the notice of Privilege Motion against Smt R. K. Roja, MLA, Nagari Constituency, for showing her chappal to the Minister Smt. Peetala Sujatha and also commenting her as fat person. She also alleged that TDP MLAs behaved like rowdies on Wednesday, 18th March, 2015. She also commented Hon'ble Chief Minister in a filthy language. She always uses unparliamentary language abusing legislators in the Floor of the House.

She described the TDP Legislators including Hon'ble Deputy Chief Minister as Rowdies. She has also commented in the premises of Assembly against SC/ST atrocities case. She carelessly commented on Chair that nobody can take action against her or otherwise they may file SC/ST Atrocities case. Recently she had taken unknown persons along with her into the August House and taken photographs with them.

This kind of attitude and behaviour of MLA, Nagari Constituency, clearly shows her indecency and carelessness towards Legislative Bodies and fellow Legislators. Hence, I request the Hon'ble Speaker to kindly examine and take necessary action against her. Thank you sir.

(ఈ సందర్భంలో గౌరవ ఉప సభాపతి అధ్యక్షస్థానం వహించారు.)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: రూల్స్ ప్రకారం తగు చర్య తీసుకుంటాం.

**జీరో అవర్**

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: విష్ణుకుమార్ రాజుగారు.

శ్రీ పి. విష్ణు కుమార్ రాజు(విశాఖపట్నం-నార్త్)፡ అధ్యక్షా, మన రాష్ట్రం విడిపోయిన తర్వాత, ప్రభుత్వం ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ వయసును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు extend చేయడం జరిగింది. దీని విషయంలో రెండు విషయాలను తమరి దృష్టికి, అలాగే ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువద్దామని నా ఉద్దేశం.

(1) 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ప్రకారం, Greater Visakha Municipal Corporation (GVMC), Vijayawada Municipal Corporation, ఈ రెండింటికీ కూడా 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా శాలరీస్‌ను చెల్లించటం లేదు. దాని మూలంగా, ప్రత్యేకంగా చూస్తే, విశాఖపట్టణంలో చాలా అమౌంట్ సేలరీస్‌కు వెళ్లిపోవటం వలన, అక్కడ అభివృద్ధి పనులు జరగటం చాలా తక్కువగా ఉంది. మా నియోజకవర్గంలో చూస్తే సుమారు 185 పనులను గుర్తించడం జరిగింది. కానీ డబ్బులు లేక ఆ పనులన్నీ ప్రారంభించడం జరగటం లేదు. కనీసం 1, 2 పనులు చేస్తున్నారు. మిగిలిన పనులన్నీ చాలా గందరగోళ పరిస్థితిలో ఉన్నాయి. ఒక్క వర్కుకి కూడా... శాంక్షన్ చేస్తున్నారు. తర్వాత టెండర్లు వేస్తున్నారు, పనులను ప్రారంభించటం లేదు. కారణం ఏమంటే అమౌంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. దయచేసి మేము ప్రభుత్వాన్ని కోరేదేమంటే, Greater Visakha Municipal Corporation, అలాగే Vijayawada Municipal Corporation కు 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ప్రకారం శాలరీస్‌ని చెల్లించవలసిందిగా కోరుతున్నాం.

...

అధ్యక్షా, రెండవ విషయం. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సును 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంచింది. దురదృష్టవశాత్తు జి.వి.ఎం.సి.లో క్లాస్-3 ఎంప్లాయీస్, 600 మంది దాకా ఉన్నారు. వారికి ఈ రిటైర్మెంట్ వయస్సు పెంపు వర్తించడంలేదు. వీరికి కూడా ఈ రిటైర్మెంట్ వయస్సు పెంపును వర్తింపజేయవలసిందిగా కోరుతున్నాను. జి.వి.ఎం.సి.లో పనిచేస్తున్న మునిసిపల్ టీచర్స్, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్స్, టౌన్‌ప్లానింగ్ ఎంప్లాయీస్, మిగిలిన మునిసిపల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న అధికారులందరికీ కూడా ఈ రిటైర్మెంట్ వయస్సు పెంపు వర్తిస్తోంది. కానీ, జి.వి.ఎం.సి.లో మొట్టమొదటి నుండి సర్వీసు స్టార్ట్ చేసినవాళ్ళకు మాత్రం ఈ రిటైర్మెంట్ వయస్సు పెంపు వర్తించడంలేదని తెలిసింది. వీరి సంఖ్య తక్కువగా, అంటే 600 మాత్రమే ఉంది కాబట్టి, వీరికి కూడా ఈ రిటైర్మెంట్ వయస్సు పెంపును వర్తింపజేయవలసిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కొన్ని వేల మందికి వర్తించిన ఈ వయస్సు పెంపును, ఇంత చిన్న సంఖ్యలో ఉన్న ఈ ఉద్యోగులకు కూడా వర్తింపజేస్తే, వారికి కూడా న్యాయం చేసినట్లవుతుందని కోరుతున్నాను. దయచేసి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు మరియు సంబంధిత మంత్రివర్యులు కూడా ఈ విషయమై సానుకూల వైఖరిని కలిగి, వీరికి న్యాయం చేయవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్፡ మినిస్టర్ గారూ.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(టెక్కలి): అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ విష్ణుకుమార్ రాజు గారు తెలిపిన విషయాలను నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి దృష్టిలో ఈ విషయాన్ని ఉంచి, దానికి వీలైనంత తొందరగా పరిష్కారం చేసి, వారికి సమాచారాన్ని అందిస్తాం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: చిరంజీవులు గారూ.

శ్రీ బి.చిరంజీవులు(పార్వతీపురం): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు, గౌరవ వైద్య శాఖామాత్యులు వారు మా యందు దయయుంచి, మా నియోజకవర్గంలోని మా ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు చేసినందుకు వారికి నా ధన్యవాదాలు తెలియజే సుకుంటున్నాను. అయితే మా విజయనగరం జిల్లాలో పార్వతీపురం నియోజకవర్గమనేది పూర్తిగా గిరిజన ప్రాంతాలతో కూడుకున్నటువంటిది. మా ప్రాంతీయ ఏరియా ఆసుపత్రి వంద పడకలతో ఏర్పాటు కాబడియున్నది. అయితే, విశాఖపట్నంలోని కే.జి.హెచ్. ఆసుపత్రి కంటే కూడా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలనుండి ప్రజలందరూ కూడా మా ప్రాంతంలోని ఏరియా ఆసుపత్రికే రావలసియుంది. కాబట్టి, దాన్ని వంద పడకల నుండి రెండు వందల పడక లకు పెంచమని గౌరవ మంత్రిగారికి నివేదించడం జరిగింది. కావున వెనుక బడిన ప్రాంతమైన మా పార్వతీపురం నియోజకవర్గ అభివృద్ధికొరకు మా ఈ ఏరియా ఆసుపత్రిని 100 పడకల నుండి 200ల పడకలకు పెంచవలసిందిగా మీ ద్వారా గౌరవ మంత్రిగా రికి విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: మినిస్టర్ గారూ.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(టెక్కలి): అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రివర్యుల దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలించడం జరుగుతుంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: రామానాయుడు గారూ.

డా. నిమ్మల రామానాయుడు (పాలకొల్లు): అధ్యక్షా, వ్యవసాయంలో, ప్రత్యేకించి వరిని పండించే జిల్లాల్లో భారతదేశంలోనే ఎక్కువగా పండించే జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా. అయితే, గత పది సంవత్సరాలుగా సాగు ఖర్చులు ఏ ఏటికా యేడు అధికంగా పెరిగిపోతున్నాయి. పెరిగి పోతున్నటువంటి సాగు ఖర్చులకు అనుగుణంగా గిట్టుబాటుధర లభించని కారణంలోగా, గ్రామాలలోని రైతులెవ్వరూ కూడా వ్యవసాయం చేయడానికి ముందుకు రానటువంటి పరిస్థితిని నేను ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఇటువంటి పరిస్థితుల్లో గౌరవ ముఖ్య

మంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు, పెట్టుబడులను తగ్గించి, దిగుబడులను పెంచడం ద్వారా రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో, 'పొలం పిలిచింది' కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిద్వారా రెండు మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో ఒకటి, భూసార పరీక్షలు నిర్వహించి, ఆ సాయిల్‌లో ఉన్నటువంటి ఫెర్టిలైజర్స్, మైక్రో యూనిట్స్ మొద లైనవన్నీ కూడా హెల్త్‌కార్డుల ద్వారా ఇవ్వడమనేది ఒక ప్రక్రియగా పెట్టారు. దీనివలన నిజంగా పెట్టుబడులు కూడా చాలా తగ్గుతాయి. ఎందుకంటే, అనవసరమైన ఎరువులు వేయము. అయితే, భూసార పరీక్షా కేంద్రాలు డివిజన్‌లో ఒక్క కేంద్రం ఉంటుంది. దానివల్ల గ్రామాల్లో ఉండేటటువంటి రైతులకు భూసార పరీక్షా కేంద్రాలు అందుబాటులో లేనటువంటి పరిస్థితి ఉంది. కాబట్టి  భూసార పరీక్షా కేంద్రాలను నియోజకవర్గస్థాయిలో ఒకటి ఏర్పాటు చేస్తూ అవ సరమైన పక్షంలో గ్రామాల్లో మొబైల్ సాయిల్ టెస్టింగ్ లేబొరేటరీస్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

అదేవిధంగా, పెట్టుబడులను తగ్గించాలన్న ఉద్దేశంతో యాంత్రీకరణ కూడా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. వ్యవసాయక జిల్లా కావడం వల్ల మా పశ్చిమగోదావరి జిల్లాలో ఈ యాంత్రీకరణ విషయంలో కూడా చాలా డిమాండ్ ఉంది. వ్యవసాయక యంత్రాలపై గౌరవనీయులు చంద్రబాబునాయుడు గారు 50 శాతం నుండి75 శాతం వరకూ కూడా సబ్సిడీ ఇస్తున్నారు. ఆ కారణంగా రైతులు కూడా ఎక్కువ మొత్తంలో ఈ యంత్రాలను తీసుకోవడానికి ముందుకు వస్తున్నారు. అయితే, వారి డిమాండ్‌కు తగినంత స్థాయిలో వారికి యంత్రాలను సరఫరా చేయలేకపోతున్నాం. ఉదాహరణకు మా పాలకొల్లు నియోజకవర్గంలో సుమారుగా 280 దాకా పవర్ డీలర్స్ అప్లికేషన్లు పెట్టుకుంటే, కేవలం 26 అప్లికేషన్లు మాత్రమే శాంక్షన్ చేయబడ్డాయి. కంబైన్డ్ హార్వెస్టర్స్ అప్లికేషన్లు మా నియోజకవర్గం నుండి 7, 8 అప్లికేషన్లు ఉంటే, కేవలం ఒక్కటి మాత్రమే శాంక్షన్ చేశారు. గతంలో శ్రీ చంద్రబాబునాయుడు గారు మా జిల్లాకు వచ్చినప్పుడు  వారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తే  ఈ జిల్లాలో వ్యవసాయం ముఖ్యమైనది  కాబట్టి  ఇక్కడి రైతులకు ఎంత అవసరమైతే అంత ఇవ్వమని ఆరోజే అక్కడి కమీషనర్ గారికీ, మా జిల్లా కలెక్టరు గారికీ కూడా చెప్పియున్నారు. కానీ, ఆచర ణకు మాత్రం నోచుకోలేదు. ప్రతీ విషయంలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమం, ప్రథమం అంటున్నారు కానీ, ఏదైనా ఇండస్ట్రీ గానీ, ఇన్‌స్టిట్యూషన్ గానీ అడిగితే మాత్రం అక్కడ ల్యాండ్ లేదు, మరొకటి లేదు అంటున్నారు. మరి, వ్యవసాయకంగా మా జిల్లా ముందు ఉన్నప్పుడు, దానికైనా సహాయం అందించవలసిన అవసరం ప్రభుత్వానికి ఉంది. కాబట్టి, తప్పనిసరిగా ఈ విషయంలో గౌరవ వ్యవసాయ శాఖామత్యులు ఈ విషయంలో శ్రద్ధ తీసుకుని, ప్రత్యేకించి పశ్చి మగోదావరి జిల్లా రైతాంగాన్ని ఆదుకునే విధంగా, అక్కడి డిమాండ్‌కు అనుగుణంగా వ్యవ సాయ యంత్రాలను సరఫరా చేయాలని మీద్వారా గౌరవ వ్యవసాయ మంత్రివర్యులను కోరుతు న్నాను.

మిస్టర్ డిప్యూటి స్పీకర్ః మినిస్టర్ గారూ.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు రామానాయుడు గారు మాట్లాడుతూ, రైతులకు సంబంధించిన పలు అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. శ్రీ చంద్రబాబునాయుడిగారి నాయకత్వంలోని ప్రభుత్వం దృష్టిలో ఈ అంశాలన్నీ పరిగణనలో ఉన్నాయి. ఇప్పటికే మొబైల్ టెస్టింగ్ లేబొరేటరీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. వీలైనంతవరకు రైతులకు చేరువగా సాయిల్ టెస్టింగ్ లేబొరేటరీస్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుంది. అదేమాదిరిగా ఆధునిక యంత్రాలను కూడా అందుబాటులో ఉంచాము. వారు ఇంకా అదనంగా కావాలని రిప్రజెంట్ చేస్తున్నారు. కాబట్టి తదనుగుణమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుంది. చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వంలోనే రైతులు అధిక దిగుబడి సాధించడం జరిగింది. ధాన్యానికి మద్దతు ధరను కూడా అత్యధిక పర్సెంటేజ్‌తో కొనుగోలు చేసి మా తెలుగుదేశం ప్రభుత్వం రైతులను ఆదుకోవడం కూడా జరుగుతుంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః పి.శ్రీనివాసులు రెడ్డి గారూ.

శ్రీ పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (కోవూర్)ః అధ్యక్షా, మా నెల్లూరు జిల్లా, కోవూరు నియోజకవర్గం పూర్తిగా నూటికి నూరు పాళ్ళు డెల్టా ప్రాంతం. మా నియోజకవర్గంలో పశు సంపద చాలా ఎక్కువగా ఉంది. సన్నకారు, చిన్నకారు రైతు కుటుంబాలు, చిన్న, చిన్న కుటుంబాలు కూడా పూర్తిగా పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మా నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో పశువైద్యశాలలు లేక, పాడిపరిశ్రమ మీద ఆధారప డిన చిన్న, చిన్న కుటుంబాలు, రైతులు చాలా ఇబ్బందులుపడుతున్నారు. కాబట్టి, గౌరవ మంత్రివర్యులు మా కోవూరు నియోజకవర్గంలో ఎక్కడైతే, పశువైద్యశాలలు లేవో, అక్కడ వాటిని నెలకొల్పి, ఇప్పటికే పశువైద్యశాలలు ఉండి కూడా వాటి భవనాలు ఏవైతే శిథిలావస్థలో ఉన్నాయో, వాటిని కూడా పునర్ధరించేందుకు తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతూ, తద్వారా పాడిపరిశ్రమను ప్రోత్సహించడమే కాకుండా, చిన్న, సన్నకారు రైతులను, పాడిపరిశ్రమ మీద ఆధారపడిన చిన్న చిన్న కుటుంబాలను ఆదుకోవలసిందిగా కోరుతున్నాను

...

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ ః మినిస్టర్ గారు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలన్నీ నోట్ చేసుకున్నాం. వాటిపై తగు చర్యలు తీసుకుంటాం. ఎక్కడైతే పశుసంపద ఉందో అవసరాన్ని బట్టి పశువైద్యశాలలను, శిథిలావస్థలోనున్న పశువైద్యశాలల భవనాలను తొలగించి కొత్త భవనాలు మంజూరు చేయడానికి అనుమతులు ఇస్తున్నాం.

శ్రీ కొత్తపల్లి సామ్యూల్ జవహర్ (కొవ్వూర్): అధ్యక్షా, 1998వ సంవత్సరం అర్హత పొందిన డీఎస్సీ ఉపాధ్యాయులు మన రాష్ట్రంలో దాదాపు 1500 మంది మిగిలిపోయారు. వారు దాదాపు 50 సంవత్సరాల వయస్సు ఉండి కేవలం 9 లేదా 10 సంవత్సరాల లోపు రిటైర్ అయ్యే వయస్సులోనున్నారు. వారికి సానుభూతితో, మానవతా ధృక్పథంతో పోస్టింగ్స్ ఇవ్వాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను. తెలంగాణ రాష్ట్రంలో 1998వ సంవత్సరంలో అర్హత పొందిన డీఎస్సీ వారందరికీ పోస్టింగ్స్ ఇచ్చారు. అలాగే మన రాష్ట్రంలో కూడా అర్హత పొందిన డీఎస్సీ ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఇస్తే బాగుంటుందని భావిస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : మినిస్టర్ గారు.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి(పుట్టపర్తి) : అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలను నోట్ చేసుకున్నాం. సంబంధిత శాఖామంత్రి గారికి తెలియజేస్తాం.

డా.బి.జయనాగేశ్వర రెడ్డి (ఎమ్మిగనూరు): అధ్యక్షా, నమస్కారం. ఈ రోజు నేను ప్రస్తావించబోయే సమస్య నా నియోజకవర్గం ఎమ్మిగనూరు అత్యంత కీలకమైన సాగునీరు, త్రాగునీరుకు సంబంధించిన 'పులికనుమ' 3 టీఎంసీ సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు సమస్య. రాష్ట్ర విభజన జరగకముందు ఎమ్మిగనూరు ప్రాంతంలోనున్న ఈ ప్రాజెక్టు మంత్రాలయం నియోజకవర్గంలోనున్నా కూడా దాదాపు పది సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు పనులు నత్తనడకగా నడుస్తున్నాయి. దీనికి సంబంధించిన అటవీ అనుమతులు గాని, రైల్వే అనుమతులు గాని ఇవ్వకపోవడం, గత ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు మంజూరు చేసి కనీసం వందల ఎకరాలకు నీరు ఇవ్వలేకపోయాయి. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుగారు త్రాగునీటికి, సాగునీటికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిలో పూర్తి చేయాలని ఒక జీవో కూడా విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుకు వేగవంతంగా అనుమతులు ఇచ్చి మా ప్రాంతానికి త్రాగునీరు, సాగునీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి(పుట్టపర్తి) : అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు జయనాగేశ్వర రెడ్డి గారు చెప్పిన విషయాలను నోట్ చేసుకున్నాం. సంబంధిత శాఖామంత్రి గారికి తెలియజేస్తాం.

శ్రీ పి.నారాయణ మూర్తి (పి.గన్నవరం): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, సభలోనున్న సభ్యులందరికీ శ్రీశ్రీ మన్మథనామ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. నా నియోజకవర్గంలో పీఎంపీ, ఆర్ఎంపీ డాక్టర్లు చాలా ఎక్కువమంది ఉన్నారు. గతంలో వారిలో కొద్దిమందికి మాత్రమే పారామెడికల్ ట్రైనింగ్ ఇచ్చాం. మిగిలిన వారి కూడా ట్రైనింగ్ ఇప్పిస్తే బాగుంటుంది. హాస్పిటల్స్‌కు వెళ్ళాలంటే 20 కిలోమీటర్ల దూరం వెళ్లాలి.

మాకు పీఎంపీ, ఆర్ఎంపీ డాక్టర్లు మాత్రమే అందుబాటులో ఉంటారు. ప్రథమ చికిత్స కోసం వీరిని పిలిచి వైద్యం చేయించుకుంటున్నాం. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాకినాడలో, అమలాపురంలో కొద్దిమందికి పారామెడికల్ ట్రైనింగ్ ఇచ్చాం. మా జిల్లాలలోనే కాదు రాష్ట్రంలో చాలా మంది పీఎంపీ, ఆర్ఎంపీ డాక్టర్లు ఉన్నారు. పేదలకు, దళితులకు అందుబాటులో ఉన్న పీఎంపీ, ఆర్ఎంపీ డాక్టర్లకు పారామెడికల్ ట్రైనింగ్ ఇస్తే బాగుంటుందని, వారికి జీవనభృతిగా కొంత జీతభత్యాలు కూడా కల్పిస్తే బాగుంటుందని తెలియజేస్తున్నాను.

ఇంకొక విషయం ఏమంటే ఇసుక రీచులను చాలామంది డ్వాక్రా మహిళలకు ఇచ్చాం. పశ్చిమ గోదావరి జిల్లా, గన్నవరం నియోజకవర్గంలో 500 అడుగుల దూరంలోనున్న అక్వాడెక్ట్‌కు జీవో అమెండ్‌మెంట్ ఇచ్చారు. పేదవారు ఇళ్లు కట్టుకోవాలనుకుంటే 20, 30 కిలోమీటర్ల దూరం వెళ్ళి ఇసుక తెచ్చుకోవల్సిన అగత్యం పట్టింది. ఇసుక రేటు ఎక్కువగా ఉంటే, లారీ, ట్రాక్టర్ల రేట్లు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. ల్యాట్రిన్ కట్టుకోడానికి ఒక్క ట్రాక్టర్ ఇసుకకు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఖర్చు అవుతుంది. ల్యాట్రిన్ మంజూరు చేసినా కట్టుకోలేని పరిస్థితిలో ప్రజలున్నారు. మా నియోజకవర్గం హెడ్‌క్వార్టర్‌కి ఇసుక రీచులు ఇవ్వకుండా సాకులు చెప్పి, కొన్ని ఆంక్షలు పెడుతున్నారు. గన్నవరం హెడ్‌క్వార్టర్‌కి ఇసుక రీచులను ఏర్పాటుజేయాలని తమరి ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీమతి పీతల సుజాత (చింతలపూడి): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాం. వాటిపై తగు చర్యలు తీసుకుంటాం.

శ్రీ బండారు మాధవనాయుడు (నరసాపురం): అధ్యక్షా, పశ్చిమ గోదావరి జిల్లాలో నర్సాపురం నియోజకవర్గం చివరి నియోజకవర్గం. నా నియోజకవర్గమంతా కూడా సముద్ర ప్రాంతం కనుక మత్స్యకారులు అధికంగా ఉంటారు. మత్స్యకారులు నివసిస్తున్న గ్రామాలకు ఆనుకొని నల్లీక్రీక్, అది బాగా పూడుకుపోయి ఉంది. వరదలు వచ్చినపుడు ఆ క్రీక్ ద్వారా కొన్ని గ్రామాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. నల్లీక్రీక్‌కు పూడిక తీయించడం ద్వారా ఆ గ్రామాలు ముంపు నివారణ కావడమే కాకుండా, మత్స్యసంపద పెరగడానికి ఆస్కారం ఉంటుంది. తద్వారా అక్కడ ఉన్న మత్స్యకారులకు కూడా జీవనోపాధి కల్పించినట్లు అవుతుంది. నల్లీక్రీక్ పూడిక తీయించే విధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మొగల్తూరు మండలంలో వి.ఫీడర్ (విఎఫ్) చానల్‌కు సంబంధించి నాలుగు, ఐదు గ్రామాలకు సంబంధించి పేరుపాలెం, పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్, మోడి గ్రామాలకు ఉపయోగపడే విధంగా 2002వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఐదు వేల ఎకరాలు మంజూరు చేయడం జరిగింది. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ఆ పని పూర్తి కాలేదు. ఎప్పుడు పూర్తి

అవుతుందోనని రైతులు, ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. దాన్ని అతిత్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట)ః అధ్యక్షా, గౌరవసభ్యులు మాధవ నాయుడు గారు సభ దృష్టికి తీసుకొచ్చిన విషయాలను నోట్ చేసుకోవడం జరిగింది. వాటిపై తగు చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ బగ్గు రమణమూర్తి (పాతపట్నం)ః అధ్యక్షా, నా నియోజకవర్గంలో ఓపెన్‌హెడ్ చానల్స్ ఆధునీకరణ జరుగుతున్నాయి. అవి ఒక ప్రక్క సాగునీరు అందిస్తాయి, అలాగే మురుగునీరు కలిసి బయటికి వెళ్ళిపోతాయి. దానికి సమాంతరంగా డిస్ట్రిబ్యూటింగ్ చానల్స్ ఉన్నాయి. చానల్స్ ఆధునీకరణ చేసేటప్పుడు డిస్ట్రిబ్యూటింగ్ చానల్స్ చేయకపోతే పొలాలకు నీరు అందే పరిస్థితి ఉండదు. నీటిపారుదల శాఖా మంత్రి గారు కూడా దీనిని పరిశీలించడం జరిగింది. సమాంతరంగా చేయమని మంత్రి గారు అధికారులకు ఆదేశాలు జారీచేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి ప్రక్రియ ప్రారంభం కాలేదు. చానల్స్ ఆధునీకరణతోపాటు డిస్ట్రిబ్యూటింగ్ చానల్స్ పనులు కూడా తక్షణమే జరిగేటట్లు చర్యలు తీసుకోవలసిందిగా మీ ద్వారా గౌరవమంత్రి గారిని తెలియజేస్తున్నాను.

శ్రీ కె.అచ్చెన్నాయుడు(టెక్కలి)ః అధ్యక్షా, నర్సన్నపేట శాసనసభ్యులు బొగ్గ రమణమూర్తిగారు చెప్పిన విషయాన్ని ఇరిగేషన్ మినిస్టర్‌గారి దృష్టిలో పెట్టి వెంటనే చర్యలు తీసుకుంటాం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ ః జి.శంకర్ గారూ.

శ్రీ జి.శంకర్(తంబళ్లపల్లె)ః ధన్యవాదాలు అధ్యక్షా, చిత్తూరు జిల్లా తంబళ్ళపల్లె రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం. గౌరవ వ్యవసాయ శాఖ మంత్రిగారు సభలోనే ఉన్నారు. గౌరవ ముఖ్యమంత్రిగారు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణమాఫీ కార్యక్రమంలో బ్యాంకుల నిర్లక్ష్యం వల్ల మా నియోజకవర్గంలో 25శాతం ఎలిజిబుల్ అయినవారికి కూడా మాఫీ రాని పరిస్థితి. కారణం ఏమిటంటే వారు లోన్ తీసుకున్నప్పుడు ఖాళీ పేపరు పైన వాళ్ళతో సిగ్నేచర్ చేయించారు. కొన్ని బ్యాంకులు సక్రమంగా వాళ్లు ఫిలప్ చేసుకున్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఇండియన్ బ్యాంకులు ఖాళీ పేపరుపైన సిగ్నేచర్ చేయించుకుని, Crop not declared అని ప్రతి ఒక్కదాంట్లోను చెబుతూ వచ్చారు. ఎలిజిబుల్ ఉన్నవారికి కూడా చాలా అన్యాయం జరుగుతోంది. గౌరవమంత్రిగారి దృష్టికి తీసుకచ్చేదేమంటే తంబళ్ళపల్లె నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతం. ఎక్కువ రైతులు ఉండే ప్రాంతం. ఇప్పటికే రైతులు బాగా చతికిలబడ్డారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి చాలామంది వలసపోయారు.

కాబట్టి రెండవ విడత కార్యక్రమం వచ్చినపుడు గౌరవమంత్రిగారు బ్యాంకులతో అవగాహనకి వచ్చి సక్రమంగా లోన్‌ల రుణమాఫీ కార్యక్రమం చేపట్టాలని మీ ద్వారా కోరుతున్నాను. అదేవిధంగా రెండో అంశం ఈ మధ్యనే గౌరవముఖ్యమంత్రిగారు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి నీరు–చెట్టు కార్యక్రమం మా నియోజకవర్గంలోనే ప్రారంభించారు. మా నియోజకవర్గాన్ని ఒక ఆదర్శ నియోజకవర్గంగా చేయాలని, కార్యక్రమం బాగా చెయ్యాలని ముందుకు వెడుతుంటే అక్కడ ఉన్న సాయిల్‌ని టెస్టింగ్‌కి పంపించినపుడు, అక్కడ ఉన్న సాయిల్ పనికిరాదని రిజల్ట్‌లో వస్తోంది. ఈ తరుణంలో రైతులు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనికి మంత్రిగారు ఏవైనా సూచనలు చెబుతారా? ఈ ప్రాబ్లమ్‌ని సాల్వ్ చేసేందుకు ఏవిధంగా ముందుకు పోవాలన్నది దయచేసి చెప్పమని మీ ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను. ఎందుకంటే అది బాగా కరువు ప్రాంతం. గౌరవముఖ్యమంత్రిగారు మా ప్రాంతానికి వచ్చి ఈ కార్యక్రమం చేయిస్తే చాలా సంతోషపడ్డాం. కానీ తీరా చూస్తే వర్షాలు లేక 20 సంవత్సరాల నుంచి మట్టి బాగా ఎండిపోయిన తరుణంలో మట్టిని టెస్ట్‌కి పంపిస్తే పనికిరాదని చెప్పినపుడు రైతులు ఎవరూ ముందుకు రావడంలేదు. దీనికి గౌరవమంత్రిగారు తగు సూచనలు చెయ్యాలని చెప్పి కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : మినిస్టర్ గారూ.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట): అధ్యక్షా, తంబళ్ళపల్లె శాసనసభ్యులు శంకర్‌గారు సభ దృష్టికి తీసుకువచ్చిన విషయాలను నోట్ చేసుకోవడం జరిగింది. వాటి మీద తగు విచారణ చేసి, చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : ప్రభాకర్ చౌదరి గారూ.

శ్రీ వి.ప్రభాకర్ చౌదరి(అనంతపురం): అధ్యక్షా, మా నియోజకవర్గంలో 1919వ సంవత్సరంలో ప్రపంచ వరల్డ్ వార్‌ను ఉద్దేశించి ఎకరా విస్తీర్ణంలో ప్రపంచ శాంతి కోసం పీస్ మెమోరియల్ అని ఒక హాల్‌ను కట్టారు. ఆ హాల్ 1923వ సంవత్సరంలో ప్రారంభించబడింది. అది పురాతనమైనది, అపురూపమైనది. దానికి యజమానులు ఎవరో తెలియని పరిస్థితిలో కొంతమంది సొసైటీలు, ట్రస్ట్‌లు ఏర్పాటు చేసుకుని, దానిని కొద్దిరోజులు పేకాట ఆడే క్లబ్‌గా పెట్టారు. తరువాతి కాలంలో ప్రజలనుంచి వచ్చిన వ్యతిరేకత వలన దానిని స్పోర్ట్స్‌కి, ఇండోర్ గేమ్స్‌కి ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఆర్కియాలజి డిపార్ట్‌మెంట్ వారు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో కొన్ని మ్యూజియమ్స్ పెట్టారు. వారు వాటిని కొత్త భవంతులలో, చిన్న గదులలో పెట్టారు. సందర్శకులకు అందుబాటులో లేని రీతిలో ఆ భవనాలు ఉన్నాయి. అక్కడి టూరిజమ్, ఆర్కియాలజీ చూసి మంత్రిగారిని వెంటనే ఎకరా స్థలంలో అతి ఖరీదైన, విలువైన స్థలంలో ఉన్న ఆ పురాతన భవనాన్ని స్వాధీనం చేసుకుని దాంట్లో పురావస్తు శాఖ ద్వారా వివిధ రకాలైన

శిల్ప కళా సంపదను అక్కడ ప్రదర్శనకు పెడితే, అది ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఈ మధ్య నగరంలో రాజకీయ నాయకులు 10 సంవత్సరాలుగా ఒక అలవాటు చేసుకున్నారు. 'కాదేదీ కవితకు అనర్హం' అన్నట్లుగా అక్రమాస్తులు కాజేయడానికి, చట్టంలో చిన్న లొసుగులని కూడా ఆధారంగా చేసుకుని విలువైన ఆస్తులను కాజేస్తున్నారు. ఈ స్థలం కూడా అన్యాక్రాంతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని నేను అభ్యర్థిస్తున్నాను. వెంటనే సత్వరం చర్యలు తీసుకుని, దానిని పురావస్తు శాఖ అధీనంలోకి తీసుకుంటే ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఆ విశాలమైన భవనాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ ః మినిస్టర్ గారూ.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి(పుట్టపర్తి)ః అధ్యక్షా, గౌరవసభ్యులు ప్రభాకర్ చౌదరిగారు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాం. తగిన చర్యలు తీసుకుంటాం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ ః ఏలూరి సాంబశివరావుగారూ.

శ్రీ ఏలూరి సాంబశివరావు(పర్చూరు)ః థాంక్యూ స్పీకర్ సార్. నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు నూటికి 70 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ రాష్ట్రంలోని రైతాంగానికి, అలాగే వ్యవసాయ రంగానికి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం చేస్తున్న సేవలు ఎన్నో సంవత్సరాలుగా మనం చూస్తున్నాం. వ్యవసాయ విస్తరణ రంగంలో కానీ, వ్యవసాయ పరిశోధనా రంగంలో కానీ, వ్యవసాయ బోధన రంగంలో కానీ ఎన్.జి.రంగా అగ్రికల్చర్ యూనివర్శిటీ సేవలు చాలా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. అయితే మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్.జి.రంగా యూనివర్శిటీ ప్రధాన కార్యాలయం రాజేంద్రనగర్‌లో దాదాపు 3,4 వేల ఎకరాలలో విస్తరించి ఉంది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత మనం ఎన్నో రకాలుగా నష్టపోయిన విషయాలలో ఈ యూనివర్శిటీ ప్రధాన కార్యాలయాన్ని కూడా నష్టపోవడం జరిగింది. అయితే ఎన్.జి.రంగా అగ్రికల్చర్ యూనివర్శిటీ కింద 13 జిల్లాలలో 5 వ్యవసాయ కళాశాలలు, 2 వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలు, 2 వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు అలాగే 2 ఫుడ్ సైన్స్ కళాశాలలు, 1 హోమ్ సైన్స్ కళాశాల, అదేవిధంగా 4 వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు, 2 వ్యవసాయ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలలు, 1 విత్తన శాస్త్ర పాలిటెక్నిక్ కళాశాల, 22 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీటితోపాటుగా ప్రతి జిల్లాలో డాట్ సెంటర్‌లు ఉన్నాయి. అలాగే కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ పరిశోధన స్థానాలు చాలావరకూ ఈ యూనివర్శిటీ కంట్రోల్‌లో ఉంటాయి. దీనికి సంబంధించిన ప్రధాన కార్యాలయాన్ని అన్ని జిల్లాలకు అందుబాటులో ఉండే గుంటూరులోని లాన్‌ఫామ్‌లో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సూచనప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చింది. వెంటనే ఈ కార్యాలయానికి శంకుస్థాపన చెయ్యవలసిందిగా మీద్వారా గౌరవ మంత్రిగారిని రైతాంగం తరపున రిక్వెస్ట్ చేస్తున్నాను. అలాగే ఇప్పటికే చాలా బిల్డింగ్‌లు

లాన్‌ఫామ్‌లో అందుబాటులో ఉన్నాయి. వెంటనే పరిపాలన సౌలభ్యం కోసం పరిశోధన, విస్తరణ రంగాలలో పురోగతి సాధించడం కోసం ప్రధాన కార్యాలయం నిర్మాణం అయ్యే లోపు అక్కడ ఉన్న భవనాలను, సదుపాయాలను ఉపయోగించుకుని ఎన్.జి. రంగా హెడ్ క్వార్టర్‌ని వెంటనే షిఫ్ట్ చెయ్యాలని గౌరవమంత్రిగారిని కోరుతున్నాను. అలాగే ఈ రాష్ట్ర విభజన నేపథ్యంలో వ్యవసాయ రంగంలో నష్టపోయిన విషయంలో ఒక అగ్రికల్చర్ యూనివర్శిటీ ప్రధానకార్యాలయమే కాకుండా, ఇంకా ఎన్నో పరిశోధనా స్థానాలను కోల్పోవడం జరిగింది. మొక్కజొన్న పరిశోధన స్థానం, ఆయిల్ సీడ్ డైరక్టరేట్, మెట్ట పరిశోధనా స్థానంలాంటివి. భారతదేశంలోనే మంచి మెట్ట పరిశోధనా స్థానం హైదారాబాదులో ఉంది. దానిని కూడా మనం కోల్పోయాం. అలాగే ఫార్మా ట్రైనింగ్ సెంటర్, సాయిల్ టెస్టింగ్ ల్యాబరేటరీ ఇవన్నీ మనం కోల్పోయాం. ఇప్పటికే ప్రభుత్వం ఈ డి.ఎన్.ఏ ఫింగర్ ప్రింటింగ్ ల్యాబోరెటరీ నిర్మాణం కొరకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. కాబట్టి కోల్పోయిన పరిశోధనా స్థానాలను ఐ.సి. ఏ.ఆర్. ద్వారా మనం తెచ్చుకోవాలని మరొకసారి గుర్తుచేస్తూ, ఈ వ్యవసాయ బడ్జెట్లో సుమారు రూ.367 కోట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి కేటాయించినందుకుగాను గౌరవ ముఖ్యమంత్రిగారికి మరియు వ్యవసాయ శాఖ మంత్రివర్యులు ప్రత్తిపాటిపుల్లారావుగారికి మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తూ వెంటనే ఆ ప్రధానకార్యాలయాన్ని లాన్‌ఫామ్‌లో ఏర్పాటు చేయవలసిందిగా మరొకసారి కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : మంత్రిగారు

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట): అధ్యక్షా, పరుచూరు శాసనసభ్యులు గౌరవ సాంబశివరావుగారు సభ దృష్టికి పలు అంశాలను తీసుకురావడం జరిగింది. అంశాలన్నీ నోట్ చేసుకున్నాము. వాటిని పరిశీలన చేసి, చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : 10నిమిషాలపాటు తేనీటి విరామం.

(తేనేటి విరామం నిమిత్తం సభ ఉదయం 11.01 గం.లకు వాయిదా పడింది.)

**(తేనీటి విరామానంతరం సభ ఉదయం 11.35 గంటలకు మరల సమావేశమయింది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

మిస్టర్ స్పీకర్: సింగపూర్ మాజీ ప్రధాని శ్రీ లీక్వాన్యీ మృతికి సంతాపం ముఖ్యమంత్రి గారు ప్రతిపాదిస్తారు.

శ్రీ నారా చంద్రబాబునాయుడు (కుప్పం)ః అధ్యక్షా, సింగపూర్ మాజీ ప్రధాని శ్రీ లీక్వాన్యీ మృతికి ఆంధ్రప్రదేశ్ శాసన సభ నివాళి......

ప్రపంచంలోనే గొప్ప దార్శనికుడు, సింగపూర్ మాజీ ప్రధాన మంత్రి శ్రీ లీక్వాన్యీ సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 3.18 గంటలకు కన్నుమూశారు. 92 సంవత్సరాల శ్రీ లీక్వాన్యీ ప్రపంచంలోనే ఆదర్శ నాయకుడు. ఒకనాడు సామాన్య దేశంగా వున్న సింగపూర్ ఇప్పుడు సంపన్న దేశంగా మారిందంటే దానికి ఒకే ఒక కారకుడు శ్రీ లీక్వాన్యీ. ఇష్టం లేని విభజనతో నలిగిపోయిన తన దేశం కోసం శ్రీ లీక్వాన్యీ మరో నూరు సంవత్సరాలకు సరిపడే ఆలోచనలు చేసి దాని ఎదుగుదలకు బాటలు వేశారు. సింగపూర్ అద్వితీయమైన అభివృద్ధికి విజన్ రూపొందించి దానిని అమలు చేసిన శ్రీ లీక్వాన్యీను సింగపూర్ ఫౌండర్ ఫాదర్‌గా అక్కడి ప్రజలు ఆరాధిస్తారు. పీపుల్స్ యాక్షన్ పార్టీకి చెందిన శ్రీ లీక్వాన్యీ 1959 నుంచి 1990 వరకు అంటే మూడు దశాబ్దాల పైబడి సింగపూర్‌కు ప్రధాన మంత్రిగా పని చేశారు. తన అనుపమాన దీక్షాదక్షలతో సింగపూర్ దేశాన్ని భాగ్యసీమగా మార్చేశారు. పట్టుదల, క్రమశిక్షణలతో సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. అవినీతి లేని దేశంగా సింగపూర్‌ను తీర్చిదిద్దారు. 1965లో మలేషియా నుండి విడివడినప్పుడు సింగపూర్ తలసరి ఆదాయం కేవలం 515 డాలర్లు. 2010 నాటికి అది 56 వేల 532 డాలర్లకు పెరిగిందంటే అదంతా శ్రీ లీ సాధించిన ఘనతే. 50 ఏళ్ల క్రితం వరకు నిరుద్యోగ సమస్యతో అల్లాడిన సింగపూర్‌ను సంపూర్ణ ఉపాధి కల్పించిన దేశంగా మార్చిన మహనీయుడు శ్రీ లీ. అంతేకాదు మూడవవంతు జనాభా మురికివాడలలో దుర్భర పేదరికంతో మగ్గిపోయిన దేశాన్ని సంపన్న దేశంగా మార్చిన ఘనత కూడా శ్రీ లీక్వాన్యీదే. వేలాది ఎకరాలు మింగేసే భూబకాసురులు మన దేశంలో వుంటే సాగరాన్ని పూడ్చి, దేశ వైశాల్యాన్ని పెంచి, సౌధాలు నిర్మించిన కర్మజీవులు సింగపూర్‌లో వున్నారు. వారి తెలివితేటలకు, కార్యదక్షతలకు స్ఫూరి ప్రదాత శ్రీ లీక్వాన్యీ. సింగపూర్ ప్రభుత్వానికి విభజన ముందు, తరువాత కూడా మన రాష్ట్రంతో సుహృద్భావ సంబంధాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల సింగపూర్ ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ, ఆసక్తి, చేస్తున్న సహకారం ఎంతైనా ప్రశంసనీయం. శ్రీ లీ మార్గదర్శకత్వంలో ఏపీ అభివృద్ధి, ప్రగతికి సింగపూర్ ప్రభుత్వం చూపిన చొరవను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది. ప్రజల కోసం, ప్రగతి కోసం పని చేసిన ఇటువంటి వారి నుంచి మనం స్ఫూర్తిని పొందాలి. అది అవసరం కూడా.

శ్రీ లీక్వాన్యీ మృతికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ తన విచారాన్ని, సింగపూర్ ప్రజలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తోంది. అలాగే రెండు నిమిషాలు మౌనం పాటించాల్సిందిగా కోరుతున్నాను. అధ్యక్షా, ఒకటి గుర్తు పెట్టుకోవాల్సిన అవసరముంది. మొన్న కూడా నేను ఉగాది సందర్భంగా జపాన్, సింగపూర్, జర్మనీ దేశాల గురించి ఒక స్ఫూర్తినివ్వాలని మెన్షన్ చేశాను. జపాన్ రెండవ ప్రపంచ యుద్ధంలో పూర్తిగా నష్టపోయి 50/60 ఏళ్ల లోనే మళ్లీ

పుంజుకొని అగ్రదేశంగా మారింది. అదేవిధంగా జర్మనీ కూడా రెండవ ప్రపంచ యుద్ధంలో దెబ్బతిని మళ్లీ రికవర్ అయ్యారు. సింగపూర్ కూడా విభజనవల్ల అనేక ఇబ్బందులు పడి ఒక వ్యక్తి యొక్క ఆలోచనతో, దూరదృష్టితో ఆ దేశాన్ని ఏ విధంగా బాగుచేశారో చూశాం. నేను అపోజిషన్‌లో వున్నప్పుడు కాని, రూలింగ్‌లో వున్నప్పుడు కాని సింగపూర్‌లాంటి దేశాలతో సన్నిహిత సంబంధాలు నెరిపినప్పుడు వారు అన్ని విధాలా ముందుకొచ్చి మన రాష్ట్ర అభివృద్ధికి ఎంతో సహకరించారు.

...

ఒకసారి ఇపుడు కూడా చూస్తే నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శ్రీ లీక్వాన్యీ ఫెలోషిప్ పెట్టి ఒక వారం నన్ను ఆహ్వానించి వారు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి, వారు చేపడుతున్న మంచి కార్యక్రమాలను కూడా మనకు వివరించారు. ఇటీవల కాలంలో నూతన రాజధాని రూపకల్పనకు ప్రణాళికలు తయారుచేసేందుకు మన నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా పూర్తిగా ఉచితంగా సింగపూర్ ప్రభుత్వం తమ ప్రభుత్వ ఏజెన్సీతో కోర్ కేపిటల్ మాస్టర్ ప్లాన్ తయారుచేసేందుకు ఒప్పుకున్నది. ఇవన్నీ సుహృద్భావ వాతావరణంలో జరిగాయి. వారి దేశంలో అభివృద్ధికి లీక్వాన్యీ కారణమే కాకుండా వారు మనకు కూడా సహాయసహకారాలు అందించారు. అలాంటి వ్యక్తి ఈరోజు చనిపోయినపుడు మన సానుభూతి, సంతాపాన్ని వారికి తెలియజేస్తే బాగుంటుంది. కాబట్టి వారి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటిస్తే బాగుంటుందని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను

మిస్టర్ స్పీకర్: సింగపూర్ మాజీ ప్రధానమంత్రి శ్రీ లీక్వాన్యీ మృతి పట్ల సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ ఈ సభ రెండు నిమిషాలు మౌనం పాటిస్తుంది.

(సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది)

...

మిస్టర్ స్పీకర్: రుణ ఉపశమన పథకంపై 338న నిబంధన కింద ముఖ్యమంత్రిగారు ప్రకటన చేస్తారు.

## ప్రకటన

శ్రీ నారా చంద్రబాబునాయుడు(కుప్పం): అధ్యక్షా, ఈ రోజు అతి ముఖ్యమైన విషయం మీద రైతులు ఎవరైతే రుణాలు తీసుకున్నారో ఆ రుణ విముక్తిపైన ఈ రోజు ప్రకటించడం నేను సంతోషంగా భావిస్తున్నాను. అదే మాదిరిగా దేనిలో అయినా జాగు చేయవచ్చు గానీ

వ్యవసాయంలో తప్ప అన్న సంగతి మనమొకసారి గుర్తుపెట్టుకోవాలి. రెండేళ్ల కిందట ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికి, అదే విధంగా ప్రజలు పడుతున్న కష్టాలపట్ల సానుభూతిని తెలియజేస్తూ "వస్తున్నా మీకోసం" పాదయాత్ర చేశాను. 16 జిల్లాలలో 208 రోజులపాటు 2817 కి.మీ. కాలినడకన పర్యటించినపుడు నాకు ఆ స్ఫూర్తితో ఒక నినాదం గుర్తుకు వచ్చింది. ఆ పాదయాత్రలో చాలా విషయాలు రైతుల వద్ద గమనించాను. అంతకు ముందు చాలాసార్లు రైతులకోసం పోరాడాను. అపుడు మీరు కూడా ఉన్నారు. 22 జిల్లాలలో పాదయాత్ర చేశాను. అదే విధంగా చాలా ప్రయత్నాలు చేశాను. అయినా కూడా అప్పటి ప్రభుత్వానికి రైతుల ఇబ్బందులు తెలియజేయడానికి పాదయాత్ర చేసి రైతులకు సానుభూతిని తెలియజేయడం జరిగింది. ఆ పరిస్థితులను చూస్తే వ్యవసాయోత్పత్తులకు లాభసాటి ధర లేకపోవడం, విపత్తులు వచ్చినపుడు సరైన టీమ్ మెకానిజం లేకపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేడు. తద్వారా పర్యావరణ సమస్యలు రావడం జరిగింది. ఇలాంటి చాలా సమస్యలు వచ్చినపుడు వాటిని సవాలుగా తీసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలని, అప్పుల్లో కూరుకుపోయిన రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేయాలని, రైతుల ఆత్మహత్యలకు ముగింపు పలకాలని నేను నిర్ణయించుకొన్నాను. అంతే కాకుండా, ఈరోజు మనం చూస్తే ప్రస్తుతం యువత ఎవరూ వ్యవసాయంవైపు ఆకర్షితులు కావడంలేదు, ఆసక్తి చూపడంలేదు. వ్యవసాయాన్ని వదలిపెట్టే పరిస్థితి వస్తున్నది. వ్యవసాయంపట్ల మరలా యువత ఆసక్తి చూపించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని, ఆసక్తి కలగాలంటే వ్యవసాయం లాభసాటిగా ఉంటే తప్ప సాధ్యం కాదనే ఉద్దేశంతో ఆ రోజు నేను దృఢ సంకల్పంతో ఆలోచించాను. అప్పటి ఆలోచనకు రూపకల్పన చేయడం కోసం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల జీవనప్రమాణాలు పెంచాలని, వ్యవసాయం లాభసాటిగా చేసే వాతావరణం కల్పించాలని, రైతులకు జీవన భద్రత పెంచడమే గాకుండా వ్యవసాయాన్ని ఒక ప్రాధాన్యతా క్రమంలో ఇంతకుముందు ఉన్నట్లుగా మొదటి ప్రాధాన్యత వ్యవసాయానికి ఇవ్వాలని నేను నిర్ణయించుకొన్నాను. అందుకోసం నేను అప్పటి పాదయాత్రను అనంతపురం జిల్లా నుంచి ప్రారంభించి వారం రోజులు కరవు బారిన పడిన ఆ జిల్లాలో పర్యటించినపుడు రైతుల కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. వారి కష్టాలను చూసి మనసు చలించి ఎంత ఖర్చు అయినా ఫర్వాలేదు రైతులకు రుణవిముక్తి కల్పించాలని గుత్తి, గుంతకల్లులో అధికారంలోకి వచ్చిన తరవాత రైతులకు రుణమాఫీ వర్తింపచేస్తానని ప్రకటించాను. ఆ రోజు నా జీవితంలో ఎపుడూ మరచిపోలేను. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా సరే ఎట్టి పరిస్థితుల్లోనూ రైతాంగాన్ని ఆదుకోవాలని వ్యవసాయాన్ని తిరిగి లాభసాటిగా తయారు చేయాలని, రైతులు మరలా ఆనందంగా ఉండాలని, వారి ముఖంలో ఆనందం చూడాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్లాను. ఆ మాట నిలబెట్టుకోవడానికి నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతు రుణ ఉపశమన పథకాన్ని ప్రకటించాను. అయితే పాదయాత్ర చేసినపుడు ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు రుణవిముక్తి కల్పిస్తానని ప్రకటించాను. కానీ రాష్ట్ర విభజనవల్ల మన రాష్ట్ర ఆర్థికపరిస్థితులు ఇబ్బందులలో పడడమే కాకుండా మనకు రాజధాని

కూడా లేకపోవడంతో అనేక సమస్యలు వచ్చాయి. ఆ సమస్యల గురించి నేను చాలాసార్లు చెప్పాను. అయితే ఆ రోజు మన రాష్ట్ర ఆర్థికపరిస్థితి చూస్తే మన రాష్ట్రంలోని 9 కోస్తా జిల్లాలలో ప్రతి సంవత్సరం తుపానులు సంభవించడంతోబాటు రాయలసీమ ప్రాంతంలో రాజస్థాన్, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల తరవాత అతి తక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఆ విధంగా ఒకపక్క కరవుపీడిత ప్రాంతంగా ఉండడం, మరొకపక్క తుపానులు రెండింటితో అతలాకుతలం అయ్యే పరిస్థితి వచ్చింది. నేను గతంలో చెప్పినట్లుగా రూ.19.12.2014లో నేషనల్ శాంపిల్ అసోసియేషన్ సర్వే ప్రకారం మన రాష్ట్రంలోని 92.91శాతం రైతులు అప్పుల్లో ఉన్నారని తేలింది. అవన్నీ చూసిన తరవాత రైతులను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలంటే వారిని రుణవిముక్తులను చేయడమే కాకుండా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాను. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రైమరీ మిషన్‌ను క్రియేట్ చేయడం జరిగింది. అందులో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంచాలని, ఉద్యానవన, పట్టుపరిశ్రమ, పాడిపరిశ్రమ, చేపలు, రొయ్యల పెంపకం, అడవులు అభివృద్ధి చేయడం, ఆహారశుద్ధి చేయాలని, మార్కెటింగ్ వసతులు బాగా మెరుగుపరచాలని, పరిశోధన ఎక్కువ జరగాలని, ఉత్పాదకత పెంచాలని ఆలోచించి ప్రైమరీ మిషన్ కూడా ఏర్పాటుచేశాం. ప్రైమరీ మిషన్‌లో మొట్టమొదట మెట్టపంటల పరిశోధనలు చేస్తున్న ఇక్రిశాట్‌ను, వ్యవసాయానికి రుణం అందిస్తున్న నాబార్డులో ఒక వింగ్ ఉంది కాబట్టి నాబార్డును కూడా కన్సల్టెంట్‌గా నియమించుకున్నాం. ఆ విధంగా రెండు మూడు విషయాలలో దేశంలో, విదేశాలలో ఎక్కడ ఉత్తమ విధానాలున్నాయో వాటిని మన రాష్ట్రంలో కూడా వ్యవసాయంలో అమలు చేయాలని, ఉత్పాదకత పెంచాలని, మార్కెటింగ్‌లో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలని నిర్ణయించాం. వ్యవసాయాధార పరిశ్రమలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించాం. మొట్టమొదటిసారి మా ప్రభుత్వం వచ్చిన తరవాత వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టడం జరిగింది. అందుకు నేను గర్వపడుతున్నాను. స్థూలంగా చెప్పాలంటే వ్యవసాయం మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించి మిషన్ అప్రోచ్‌తో ముందుకు వెళుతున్నాం. మన రాష్ట్రంలో ఇబ్బందుల గురించి ఇంతకు ముందు కూడా పలుమార్లు చర్చించాం. ఇటీవల కూడా ఈ సభలో చర్చించుకున్నాం. కేంద్ర ప్రభుత్వం సహాయం కూడా తీసుకొని ముందుకు వెళుతున్నాం. మన రాష్ట్రంలో రైతులను రుణవిముక్తులను చేయాలని నిర్ణయించుకున్నా కేంద్ర ప్రభుత్వం దేశంలో 29 రాష్ట్రాలున్నందున మనకు రుణవిముక్తి కల్పించడంలో ముందుకు రాలేకపోయినా కూడా మన రాష్ట్రంలోని రైతులు సమస్యలలో ఉన్నారు కాబట్టి వారికి ఉపశమనం కల్పించాలని నిర్ణయించాం. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ కూడా పలు సమస్యలు సృష్టించే పరిస్థితి వచ్చింది. రుణవిముక్తి చేయడానికి వీలులేదని చెప్పినపుడు నేను కూడా గట్టిగా చెప్పాను. దేశంలో అందరికంటే మన రాష్ట్రంలో రైతులు చాలా ఇబ్బందులలో ఉన్నారు, నష్టపోతున్నారు కాబట్టి తప్పకుండా చేయాలని అపుడు చెప్పడం జరిగింది. బ్యాంకులు ఒప్పుకోకపోయినా ఈ విషయంలో ముందుకు వెళ్లాం తప్ప వెనక్కి చూడలేదు. దీనికోసం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్లాం. ఆరోజు రుణ ఉపశమన పథకం

సమగ్రంగా రూపొందించడంకోసం నేను ఆరోజు నాబార్డు మాజీ చైర్మన్ పమిడి కోటయ్య గారి అధ్యక్షతన ఒక కమిటీని జీవో ఎమ్మెస్ నం.31 ద్వారా తేది.10.06.2014న జారీ చేశాం.

...

G.O.M.S.NO.31 విడుదల చేశాము. మొత్తం analysis చేసిన తరువాత ఒక నెల పది రోజులు సమయం తీసుకుని 21.7.2014న వారు ఒక రిపోర్టు ఇచ్చారు. ఆ రిపోర్టుని క్యాబినేట్‌లో పెట్టి ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆ రిపోర్టు ప్రకారం ఒక లక్ష రూపాయలు ఆర్థికంగా ఏవరైతే అప్పులు తీసుకున్నారో, ఆ రైతులకు రుణ విముక్తి చేయమని వారు ఆ recommendation ఇచ్చారు. మేము ఒకసారి క్యాబినెట్‌లో కూర్చున్నప్పుడు నేను అన్ని ఆలోచించిన తరువాత మేమందరం సుదీర్ఘంగా చర్చలు చేసిన తరువాత ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. రైతు కూడా చాలా ఇబ్బందులలో ఉన్నాడు. ఏదో ఒకవిధంగా దీనిని పరిష్కరించాల్సి ఉండగా, లక్ష రూపాయలు కాదు, రూ.1,50,000 ఇవ్వాలనీ ఆరోజు క్యాబినేట్ మీటింగ్‌లో నిర్ణయించామని మీకు తెలియచేస్తున్నాను. (అధికారపక్ష సభ్యులు బల్లలు చరచడం ద్వారా తమ హర్షాతిరేకాలను వ్యక్త పరిచారు)

దానికి గైడ్ లైన్స్ కూడా G.O.M.S.NO.174ని 14.08.2014న జారీ చేశామని మీకు తెలియచేస్తున్నాను. అది పెట్టినప్పుడు, ఎలాంటి లోన్స్‌కు ఉపశమనం ఇవ్వాలన్నప్పుడు, పంట ఉత్పాదన కోసం బంగారు తాకట్టు పెట్టిన రుణాలకి కూడా మనము ఇవ్వాలని నిర్ణయం తీసుకుని ముందుకు పోయాము. దీనికి కట్ ఆఫ్ డేట్ చూసినప్పుడు మేము ఆరోజు అలోచించినది ఏమంటే 2014 మే లో ఎన్నికలు జరిగాయి. జూన్ 8వ తారీఖున ప్రమాణ స్వీకారం చేశాము. ఆ రోజు 31-12-2013 నాటికి ఏవరైతే లోన్స్ తీసుకున్నారో ఆ రుణాలన్ని మాఫీ చేస్తామని కట్ ఆఫ్ డేట్‌గా మీకు తెలియచేస్తున్నాను. ఫిర్యాదుల కోసం ఒక సెల్ పెట్టాము. ఒక యంత్రాంగాన్ని పెట్టాము. ఎక్కడ ఫిర్యాదులు వచ్చినా, ఆ ఫిర్యాదులు తీసుకోమని G.O.M.S.NO.184ని 3.09.2014న జారీ చేశాము. రాష్ట్ర ప్రణాళికాభివృద్ధి ఉపాధ్యక్షుడు కుటుంబరావుగారితో ఒక ఐదు మంది సభ్యులతో ఒక కమిటీ కూడా వేశామని మీకు తెలియచేస్తున్నాను. ఇందులో చాలా స్పష్టంగా రైతు సాధికార సంస్థను ఏర్పాటుచేశాము. G.O.M.S.NO.197 తేది 04.10.2014 ప్రకారం ఈ యొక్క సంస్థను ఏర్పాటు చేసి దానికి ప్రత్యేకంగా విధివిధానాలను నిర్ణయించాము. ప్రధమంగా రైతు సంక్షేమం, అభివృద్ధి, సామర్థ్యం పెంపుదల ఇలాంటి కార్యక్రమాలు పెట్టి ఎక్కువ ఉత్పాదక శక్తి రావాలని, వ్యవసాయ ఆధార పరిశ్రమల ద్వారా వారికి ఎక్కువ ఆదాయం రావడమే అబ్జెక్టివ్ క్రింద పెట్టుకున్నాము. ఇంకొక ప్రక్కన చూస్తే సాంకేతిక పరిజ్ఞానం, సాంకేతిక బదిలీ, వ్యవసాయ రుణ ఉపశమనమే కాకుండా వ్యవసాయం ఉద్యానవనరంగాలు, పట్టు పరిశ్రమ, పాడి పరిశ్రమ, చేపల పెంపకం ఇలాంటివి అన్ని పెట్టి ఇంకా ఆదాయం పెంచాలని ఇంకొక ప్రక్క రైతు గ్రూపులని, రైతు సంఘాలని, సహకార సంఘాలని ఇవన్నీ కూడా ఉపయోగించుకుని, రైతు వ్యవస్థని పటిష్ట పరచాలని వారిని అన్ని విధాల కాపాడుకోవాలని ఆలోచించాము. రైతులు కూడా వారి వారి సూచనలు

ఎప్పటికప్పుడు ఇచ్చే విధంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించాము. దీని కోసం అవసరమైతే బడ్జెట్‌లో పెట్టిన డబ్బులే కాకుండా అదనంగా డబ్బులను సమీకరించడం కోసం ఎక్కడ గ్రాంట్ వచ్చినా, సబ్సిడీ వచ్చినా, సెస్ వచ్చినా, లేవీ వేయాల్సి వచ్చినా వేసే అధికారం కూడా ఈ చట్టం ద్వారా తీసుకురావాలని, ఇంకొక ప్రక్కన ఎక్కడ ఉన్న బ్యాంకుల ద్వారా, ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు గానీ, బాండ్స్ గానీ, డిబెంచర్లు గానీ, మానిటరీ వాల్యు సర్టిఫికేట్స్ గానీ ఇచ్చి, ఎక్కువ వనరులు కూడా mobilize చేయాలని, ఒక కార్యక్రమం పెట్టుకున్నాము. అవసరమైతే ఇసుక ద్వారా వచ్చే ఆదాయం 75శాతం రైతుకే ఇవ్వాలని, వ్యవసాయానికే ఇవ్వాలని ఒక కార్యక్రమంగా పెట్టుకున్నాము. ఆ రిపోర్టు వచ్చిన వెంటనే 2014-15బడ్జెట్‌లో రూ.5,000కోట్లు రైతు సాధికార సంస్థకి బలోపేతం చేయడం కోసం డబ్బులు కూడా ఆ సంస్థకి ఇచ్చామని తెలియచేస్తున్నాను. ఈ అకౌంట్స్ అన్ని కూడా సేకరించి 28-08-2014న ప్రారంభించి 22-11-2014నకి పూర్తి చేశాము. ఇది ఒక elaborate exercise. కొన్ని వందల బ్యాంకులు ఉన్నాయి. కొన్ని లక్షల బ్యాంకు అకౌంట్స్ ఉన్నాయి. గ్రామగ్రామంలోను ఉన్నాయి. ఈ అకౌంట్స్ అన్ని కూడా సమీకరించాల్సిన అవసరం ఉంది. దీని కోసం కమిటీ మెంబర్స్ చాలా బాగా పనిచేశారు. బ్యాంకర్లు కూడా చాలా సహకరించారు. రాత్రి పగలు పని చేశారు. మొత్తం exercise అంతా చేసిన తరువాత కూడా ఇవన్నీ క్రోడీకరించి 6-12-2014న తొలి విడత first phase మనం అనౌన్స్ చేయగలిగాము. అప్పటికి కొన్ని రికార్డులు లేకపోతే వారికి కూడా అన్యాయం జరగడానికి వీలు లేదు. ఆ రికార్డు కూడా update చేయాలి. పూర్తిగా ఏరైతు కూడా మన నిబంధనలతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, ఫేజ్-2కి నాంది పలికాము. ఆ ఫేజ్-2ను 10-12-2014న విడుదల చేశాము. వారు అవన్నీ చేసిన తరువాత ఒక టైమ్‌బౌండ్ ఇచ్చాము. దాని ప్రకారం ఒక ఫేజ్-2 అంతా exercise చేసి 18-03-2015న వాళ్లు ఖరారు చేసి రాష్ట్ర క్యాబినెట్‌కు సమర్పించారు. 20వ తారీఖున రాష్ట్ర క్యాబినెట్ మీటింగ్ పెట్టాము. అందులో దీనిపైనా చర్చించామని మీకు తెలియచేస్తున్నాను. మేము ఇన్‌ఫర్మేషన్ కలెక్టు చేసిన తరువాత దానిని వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖాధికారులతో కూడిన జన్మభూమి, మా ఊరు కమిటీలకు పిలుపు ఇవ్వడం జరిగింది. వారు కూడా కొంత exercise చేశారు. ఎక్కడా ఎవ్వరికి ఇబ్బంది లేకుండా వీలైనంతవరకు ఈ exerciseని పూర్తి చేయడం జరిగిందని మీకు తెలియచేస్తున్నాను. రూ.50,000వరకు ఏవరైతే రుణాలు తీసుకున్నారో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ గాని లేకుండా సింగిల్ ఇన్‌స్టాల్‌మెంట్‌తో పూర్తిగా రుణ విముక్తి చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కింది. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశాము. ఒకవేళ ఏవరైనా రూ.50,000 కన్నా ఎక్కువ తీసుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వచ్చి, ఇప్పుడు రూ.50,000 కన్నా తక్కువగా ఉండే అలాంటి వాళ్లకు సింగిల్ ఇన్‌స్టాల్‌మెంట్ ప్రకారం వారికి కూడా పూర్తిగా మాఫీ చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంది. (చప్పట్లు)

ఏవరైతే రూ.50,000 పైన రుణం తీసుకున్నారో, వాళ్లకి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెట్టి... ఎందుకంటే డబ్బులు ఉంటే మొత్తం ఇచ్చేవాళ్లము కానీ, ఆ ఇబ్బంది ఉంది కాబట్టి మొదటి

సంవత్సరం 20శాతం ఇన్‌స్టాల్‌మెంట్ ఇస్తున్నాము. మిగిలిన 80శాతం నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్ ప్రకారం నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయాలని ఒక కార్యక్రమం పెట్టుకున్నాము. ఇందులో కూడా 10శాతం వడ్డీతో ఎవ్వరికి ఇబ్బంది లేకుండా ఆ వడ్డీ రేటుతో వారికి ఇస్తున్నాము. ఏవరైనా రీ-షెడ్యూల్ చేసుకుంటే 4 శాతానికి వడ్డీ వస్తుంది. ఒక రీ-షెడ్యూల్‌లో వాళ్లు చేసుకుంటే, 6 శాతం వడ్డీ వాళ్లకు మిగిలే పరిస్థితి వస్తుంది. ప్రభుత్వం అయితే చాలా స్పష్టంగా 10శాతం వడ్డీతో ఎవరైతే రైతులకి డబ్బులు ఇవ్వాలో వాళ్లకి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నామని నేను మీకు తెలియచేస్తున్నాను. వ్యవసాయాన్ని మళ్లీ ఒక పద్ధతి ప్రకారం తీసుకుపోవాలని అనుకుంటున్నాము. బ్యాంకులు నమోదు చేసిన ఖాతాల సంఖ్య స్థూలంగా చూస్తే 82,66,000. తొలి దశలో రుణ మాఫీ క్లియర్ చేసిన ఖాతాల సంఖ్య 40,43,000. తొలి దశలో రుణ ఉపశమనం పొందిన రైతుల సంఖ్య 26,77,000. రెండవ దశలో ప్రాసెసింగ్ జరిగే ఖాతాల సంఖ్య డాక్యుమెంట్ సమాచారం అందిన తరువాత 42,33,000 ఏవైతే అకౌంట్ ఉన్నాయో తొలి మరియు రెండవదశలో రుణమాఫీ క్లియర్ చేసిన ఖాతాల సంఖ్య 51,45,000. తొలి మరియు రెండవ దశలో రుణ ఉపశమనం చేందిన సంఖ్య 33,19,000. ఈ రోజు ఈ స్కీమ్ వల్ల 39,19,000 మంది రైతాంగం బాగుపడ్డారు. (చప్పట్లు)

కొంత వరకు ఉపశమనం వచ్చింది. కొంతవరకు రుణవిముక్తి చేశాము. కొంత మందికి పూర్తిగా చేశాము. కొంతమందికి రూ.1,50,000లు వరకు చేశామని మీకు తెలియచేస్తున్నాను. కొంతమంది బాగా ఎక్కువ డబ్బులు తీసుకున్నారు. అవసరాల కొద్దీ వ్యవసాయానికి గానీ, ఇంకొక విధంగా తీసుకున్నారు. 3,96,000 మంది రూ.1,50,000ల కంటే ఎక్కువ తీసుకున్నారు. పెద్ద రైతులకి ఎప్పుడు ఇచ్చేవాళ్లు కాదు. ఈ సారి మాత్రం 3,96,000 మంది రూ.1,50,000ల వరకు రుణ విముక్తి చేసిన ఘనత ఈ తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కిందని నేను తెలియచేస్తున్నాను. (చప్పట్లు)

ఇంకొక ప్రక్క ఎస్.సి., ఎస్.టి. రైతు కుటుంబాలు 3,56,000 మంది దీని వలన లబ్ది పొందారు. లబ్ది పొందిన చిన్నకారు, సన్నకారు రైతు ఖాతాలు చూస్తే 32,44,000 మంది లాభం పొందారు. చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఇంతకు ముందు అయితే విభజన జరగక ముందు ఒక ఎస్టిమేట్ చేశారు. రూ.15,350కోట్లు దగ్గర దగ్గర రెవెన్యూ డెఫిసిట్ ఉంటుంది. ఆ రెవెన్యూ డెఫిసిట్ ఇవ్వాలని ఆరోజు నిర్ణయించారు. ఇంకా ఆ డబ్బులు రావలసిన అవసరం ఉంది. దానికి మనం ప్రయత్నం చేస్తూనే ఉన్నాము. మనం నూతన రాజధాని కట్టుకోవాలి, ఇండస్ట్రీస్ పెట్టాలి. అవసరమైతే ఇంకా ఎక్కువ కష్టపడదాం గానీ, ఇచ్చినమాట నిలబెట్టుకోవాలి. రైతాంగాన్ని ఆదుకోవాలి.

...

దీని వల్ల మీరు చూసినప్పుడు, మొదటి మరియు రెండవ దశ తర్వాత మనం ఇవ్వాల్సిన డబ్బును చూస్తే రూ.18,480 కోట్లు. మనం ఇచ్చిన బాండ్ల పైన నాలుగేళ్లు పడే వడ్డీని

చూస్తే రూ.2561 కోట్లు అవుతుంది. ఈ సంవత్సరం 2014-15 ఇప్పటికే రూ.4,664 కోట్లు ఇచ్చాం. ఇంకా రూ.2176 కోట్లు ఇవ్వాలి. ఇది కేంద్ర ప్రభుత్వం నుండి వస్తూనే ఇద్దామని ఆలోచన చేస్తున్నాం. కానీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మొత్తం మీరు ఈ సంవత్సరం ఇచ్చింది గానీ, నేను చెప్పిన గైడ్‌లైన్స్ ప్రకారం ఇంకా మనం ఇవ్వాల్సిన మొత్తం, ఈ రెండు దశలో వచ్చే డబ్బులు, నాలుగు సంవత్సరాల్లో మనకు అయ్యే ఖర్చును చూసినప్పుడు రూ.21 వేల కోట్లు, ఫేజ్-1, ఫేజ్-2 ఋణ విముక్తి కోసం ఖర్చవుతుంది. హార్టీకల్చర్‌కైతే ఎకరానికి రూ.10 వేల చొప్పున, ఆ రోజు ఎన్నికల్లో నేను చెప్పకపోయినా, పాదయాత్ర సందర్భంగా చెప్పకపోయినా రైతులను ఆదుకోవాలి, పండ్ల తోటలను సాగుచేసే రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు, వారికి కూడా అయిదు ఎకరాల వరకు రూ.10 వేల చొప్పున ఇచ్చే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం చేపడుతుందని నేను మీకు తెలియజేస్తున్నాను.

దానికి కూడా అంచనాలను తయారు చేస్తున్నాం. పదిపదిహేను రోజులు వస్తాయి, అన్ని బ్యాంకులను అప్‌లోడ్ చేయమన్నాం. దానికి కూడా దాదాపు రూ.2 వేల కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. అంటే ఈ రోజు మనం గుర్తు పెట్టుకోవాల్సింది, రాష్ట్రంలో ఉండే ప్రజలు గుర్తు పెట్టుకోవాల్సింది, ఈ ప్రభుత్వం రైతులకు రుణ విముక్తి ద్వారా దాదాపు రూ.23 వేల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చింది. ఇది ఒక చరిత్ర. మీరు ఒకసారి చూస్తే, ఇంతకు ముందు కూడా ఇచ్చారు. ఒకప్పుడు ఎన్‌టి రామారావు గారు నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆ రోజు దేవీలాల్ గారు ఉప ముఖ్యమంత్రిగా ఉండి, ఆ రోజున రైతుకు రూ.10 వేలు చొప్పున ఇచ్చారు. 2007-08 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన రుణ మాఫీ పథకం క్రింద దేశ వ్యాప్తంగా రూ.60 వేల కోట్లు వస్తే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ.23 వేల కోట్లను ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిది. రెండోది ఆ రోజు కంబైన్డ్ రాష్ట్రంలో సమైక్యంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వచ్చిన మొత్తం డబ్బులు రూ.9,636 కోట్లైతే ఈ రోజు 13 జిల్లాలకు మనమిచ్చింది చూస్తే రూ.23 వేల కోట్లు అయ్యే పరిస్థితి.

అదే మాదిరిగా ఈ లెక్కల ప్రకారం చూసినప్పుడు ఏదైతే 2011 సెన్సెస్ ప్రకారం 32 లక్షల మంది రైతులుంటే, అందులో మొదటి దశ, రెండో దశ క్రింద 22 లక్షల 79 వేల మందికి పూర్తిగా లబ్ధి చేకూరే పరిస్థితి వచ్చింది. అంటే 71 శాతం మంది రుణ విముక్తులయ్యారని నేను మీకు తెలియజేస్తున్నాను. ఇంకోప్రక్కన తేది 19.12.2014 నాడు నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ వారు చేసిన సర్వే ప్రకారం, 35 లక్షల 96 వేల మంది రైతులు ఉంటే 92.9 శాతం మంది అప్పుల పాలైపోయారని, అంటే దీనిని బట్టి చూస్తే ఎంత దారుణమైన పరిస్థితి ఉందో మనం అర్థం చేసుకోవాలి. ఇది చూసినప్పుడు ఈ రుణ విముక్తి వల్ల దాదాపు 97 శాతం మంది రైతులు లబ్ధిపొందే పరిస్థితిలోకి వచ్చారు. ఇదేకాకుండా ఇటీవలి కాలంలో పంటల బీమా వస్తే చాలా మంది అన్నారు, ఆ పంటల బీమా కూడా ఈ అప్పులకు అడ్జెస్ట్ చేయమంటే, కాదు, ఇది మంచిది కాదని, నేను రూ.600 కోట్లను పంటల బీమాగా జీఓ ఎంఎస్ నెం.224,

తేది.16.12.2014 ప్రకారం ఒక ఆర్డర్‌ని ఇచ్చాము. అదనంగా రూ.600 కోట్లంటే ఆ డబ్బులను మన ఆర్థిక ఇబ్బందులకు అడ్జెస్ట్ చేసుకోవచ్చు, కానీ అది కరెక్ట్ కాదని, పూర్తిగా ఆ డబ్బులను చెల్లించిన ఘనత కూడా ఈ ప్రభుత్వానికి దక్కిందని నేను మీకు తెలియజేస్తున్నాను.

అయితే ఈరోజు ఇక్కడ ఉండే వారికి గానీ, రాష్ట్ర ప్రజానీకానికి గానీ, ఒక స్పష్టత ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. దీనిని ఒక పద్ధతి ప్రకారం చేశాము, ఒక ప్రొసీజర్ ప్రకారం చేశాము. ఆధార్ మరియు రేషన్ కార్డులను తీసుకున్నాం. రేషన్ కార్డు అందుబాటులో లేకపోతే ఓటర్ ఐడీని ప్రామాణికంగా తీసుకొని, ఒక కుటుంబం అంటే ఏ విధంగా ఉంటుంది, ఎన్ని కుటుంబాలు అందులో ఉంటాయి, అవన్నీ కూడా ఎస్టిమేట్ చేశాము. సెన్సెస్ ప్రకారం 32 లక్షల కుటుంబాల వారిని  ఎస్టిమేట్ చేశారు. ఇంకో ప్రక్కన ఎన్ఎస్ఎస్ ప్రకారం 36 లక్షలని అంచనా వేశారు. ఇవన్నీ నిర్ధారణ చేయడం కోసం, ఆధార్ గానీ, రేషన్ కార్డ్ గానీ, ఓటర్ ఐడీని గానీ ప్రామాణికంగా తీసుకొని ఫైనలైజ్ చేశాము. ఈ డబ్బులు ఇచ్చిన దానికి, ఈ రుణాల వ్యవధిని తీసుకుంటే 01.04.2007 నుంచి 31.12.2013 వరకు, 2007 కంటే ముందు ఆ రోజు కూడా రుణ విముక్తి వచ్చింది. తర్వాత ఈ ఆరు సంవత్సరాలు తీసుకొని, ఎవరైతే పే చేయలేదో వాళ్లందరినీ పరిగణనలోనికి తీసుకున్నాం. ఇందులో కూడా పంట రుణాలు మరియు టైఅప్ రుణాలు రెండు కూడా పరిగణనలోనికి తీసుకున్నాం. మూడవది, దస్తావేజులుగానీ అడంగల్ గానీ ఇవన్నీ కూడా వ్యాలిడ్ భూమి రికార్డుల క్రింద పరిగణనలోకి తీసుకున్నాం. ఒకే సీజన్లో ఒకే సర్వే నెంబర్ పైన యజమాని, కౌలుదారు ఇద్దరు గనుక రుణాలను తీసుకొని ఉంటే, అక్కడ మాత్రం కౌలు రైతుకే మొదటి ప్రధాన్యతనిచ్చి అతనికే చెల్లించాం. ఒకే కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది రుణాలను తీసుకొని ఉంటే, ఈ పథకం క్రింద గరిష్ట మొత్తాన్ని, ముగ్గురు తీసుకున్నప్పటికీ  అందరికీ కలిపి, లక్షా యాభై వేల రూపాయలను ఇవ్వడం జరిగింది. ఇంకో ప్రక్కన ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీని మీరు చూస్తే, పంట రుణాలకు మొదటి ప్రాధాన్యతనిచ్చాం, కన్వర్టెడ్ పంట రుణాలకు రెండో ప్రాధాన్యతనిచ్చాం. బంగారు రుణాలను కూడా తర్వాత ప్రాధాన్యతగా తీసుకొని క్యాలిక్యులేట్ చేసి లక్షా యాభైవేల వరకు ఇచ్చాము. ఒకటి కంటే ఎక్కువ బ్యాంకుల్లో రుణాలను తీసుకొని ఉంటే ఓరిజనల్ పట్టా పాసుపుస్తకాలను ఏ బ్యాంకులో పెట్టారో, ఆ బ్యాంకుకే ప్రాధాన్యతనిచ్చామని నేను మీకు తెలియజేసుకుంటున్నాను.

అదే మాదిరిగా రూ.50 వేల కంటే తక్కువ తీసుకొని ఉంటే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ లేకుండా పూర్తిగా రుణ మాఫీ చేసి, వారు ఎంత తీసుకున్నా, ఒక ఎకరా ఉన్నా, ఇరవై అయిదు వేలు కాదు రూ.50 వేలు తీసుకున్నా, రూ.50 వేల వరకు రుణ విముక్తి చేశాము. పేద రైతులను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని నేను మేకు తెలియజేస్తున్నాను. అదే మాదిరిగా రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకొని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అప్లికేషన్ వచ్చిన తర్వాత అది రూ.50 వేల కంటే తక్కువ ఉంటే ఒన్ టైమ్ సెటిల్‌మెంటు క్రింద, పూర్తిగా తక్కువ ఇచ్చే పరిస్థితి

లేకుండా పూర్తిగా మాఫీ చేశాము. ఆ డబ్బులు రేపో ఎల్లుండో వాళ్ల అకౌంట్లలోకి వెళ్లతాయి. అదేమాదిరిగా రూ.50 వేల కంటే పైన తీసుకున్న రైతులు, రూ.50 వేల కంటే పైన బకాయిలు ఉండే రైతులకు మాత్రం 20 శాతం ఇచ్చాం. అంటే ఈరోజు ఒక లక్ష రూపాయలు ఉంటే రూ.20 వేలను వాళ్లకు ఇచ్చి మిగిలిన రూ.80 వేలను నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్ల ప్రకారం నాలుగు సంవత్సరాల్లో పే చేస్తున్నాం. ఏ రైతు కూడా ఒక్క పైసా పే చేసుకునే పని లేకుండా, వడ్డీ కూడా అతను చెల్లించే పని లేదు, పది శాతం వడ్డీ రేటుతో నాలుగు సంవత్సరాలకు ఎంత అవుతుందో అంతా కూడా ఈ ప్రభుత్వమే భరిస్తుంది.

నేను అందరికీ అప్పీల్ చేస్తున్నాను. రైతులు ముందుకు రావాలి, ఎందుకంటే మీ రుణాలను రీషెడ్యూల్డు చేసుకుంటే ఆటోమేటిక్‌గా 4 శాతం వడ్డీ వస్తుంది. 4 శాతం రేట్ ఆఫ్ ఇంట్రస్ట్‌ను మీరు తీసుకోగలిగితే మీకు వచ్చే డబ్బుల్లో ఆరు శాతం వడ్డీ మాత్రం గవర్నమెంటు అదనంగా ఇస్తాం. బ్యాంకర్స్ ఇచ్చేది నాలుగు శాతం వడ్డీకి ఇస్తారు. మేము 10 పర్సెంటు ఇస్తాము. అంటే మీకు ఆరు శాతం మిగిలే పరిస్థితి వస్తుంది. మీరు ఆదా చేసుకునే పరిస్థితి వస్తుంది. కాబట్టి రైతాంగం ప్రతి ఒక్కరిని విజ్ఞప్తి చేస్తున్నాను, వీలైనంత తొందరలో మీరు రెగ్యులరైజ్ చేసుకోండి, పూర్తిగా మిమ్మల్ని ఆదుకునే బాధ్యత, అదనంగా 6 శాతం వడ్డీని మీకిచ్చే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుందని నేను మీకు తెలియజేస్తున్నాను.

అదే మాదిరిగా ఇంకోప్రక్కన మీరు చూస్తే, హార్టీకల్చర్ ఇవన్నీ నేను చెప్పాను. రాబోయే రోజుల్లో తప్పకుండా హార్టీకల్చర్ ఇవన్నీ ఎస్టాబ్లిష్ చేసిన తర్వాత ఎకరాకు రూ.10 చొప్పున వారికి కూడా ఇస్తామని హామీనిస్తున్నాను. ఈ సందర్భంగా ఈ ప్రభుత్వం రైతాంగం కోసం, ఎట్టి పరిస్థితుల్లో వ్యవసాయాన్ని లాభసాటిగా తయారు చేయడానికి అనునిత్యం పని చేస్తుంది. ఇటీవల హుదూద్ తుపాన్ వస్తే ఆ తుపానులో కూడా రైతాంగానికి రివైజ్డ్ గైడ్‌లైన్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం మనకు ఇన్‌పుట్ సబ్సిడీ తక్కువ ఇచ్చినా, దాని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచి ఇన్‌పుట్ సబ్సిడీని ఇచ్చాము. నిన్న కూడా మన రాష్ట్రంలో కరువు వస్తే, కరువులో కూడా ఇన్‌పుట్ సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం నార్మ్స్ ప్రకారం తక్కువ వస్తుందంటే, కాదు హుదూద్ తుఫాన్ సందర్భంగా ఏదైతే ఇచ్చామో అదేమాదిరిగా ఇవ్వమని చాలా స్పష్టంగా ఆదేశాలను జారీ చేశాము. అదే మాదిరిగా మొదటిసారి మనం వ్యవసాయ బడ్జెట్‌ను తీసుకొచ్చాం.

...

అధ్యక్షా, మనం మొదటిసారిగా వ్యవసాయ బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సంవత్సరం నుంచి ఎన్నో ప్రణాళికలను ప్రభుత్వం రచించింది. అందు నిమిత్తం నేను గానీ, మా మంత్రి గారు గానీ ఎన్నో ఆలోచనలను చేస్తున్నాం. వ్యవసాయానికి ముఖ్యంగా కావల్సింది సాగునీరు. వ్యవసాయ భూమికి సంబంధించిన soil testing దగ్గర్నుంచి వ్యవసాయ ఆధార పరిశ్రమల అభివృద్ధి పర్చుట వరకు అవసరమైన value addition తీసుకుపోవల్సిన అవసరముంది. అందులో కూడా పెద్దయెత్తున రైతులకు సబ్సిడీ సౌకర్యాన్ని ప్రభుత్వం

కల్పిస్తోంది. వ్యవసాయ మెకనైజేషన్ వంటి విషయాలను మరొకసారి చర్చించడం జరుగుతుంది. మెకనైజేషన్‌కు గానీ, soil testing కొరకు గానీ ప్రభుత్వం నిధులను కేటాయించి ఖర్చుచేస్తోంది. ఆధునీకరణ పనులను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అందు నిమిత్తం పెద్దయెత్తున వ్యవసాయ విస్తరణాధికారులను ప్రభుత్వం నియమిస్తోంది. అదే విధంగా value addition కొరకు పెద్ద, పెద్ద పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి తద్వారా వ్యవసాయ ఆధార పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటుచేసి వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా తీసుకువచ్చే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోంది. అన్నింటిలోనూ ప్రభుత్వం ఎక్కే మొదటి మెట్టు "రైతు రుణ విముక్తి". భారతదేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా తీసుకోని విధంగా మన రాష్ట్రంలో రైతాంగం సంక్షేమం కొరకు రైతు రుణమాఫీ పథకాన్ని అమలుపర్చామంటే అందుకు మేమెంతో గర్వపడుతున్నామనే విషయాన్ని మీకు తెలియజేస్తున్నాను.

(సభలో చప్పట్లు)

అధ్యక్షా, రాష్ట్రం ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కానీ, రైతు రుణ మాఫీ పథకం అమలు చేయడం కొరకు ప్రభుత్వం రూ.23 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. నేను ఆరోజున డ్వాక్రా సంఘాలకు కూడా హామీ ఇచ్చాను. ఎన్నికల సందర్భంగా నేను వారితో చెప్పడం జరిగింది. డ్వాక్రా సంఘాలు కూడా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నాయి. రైతులకు రుణమాఫీ చేస్తామని మీరు రైతాంగానికి హామీ ఇచ్చారు. సంతోషమే. మేం అందుకు వ్యతిరేకం కాదు కానీ, డ్వాక్రా సంఘాలు కూడా ఎన్నో ఇబ్బందులనెదుర్కొంటున్నాయనే విషయాన్ని నా దృష్టికి ఆయా సంఘాలు తెచ్చినప్పుడు నేను చాలా స్పష్టంగా హామీ ఇవ్వడం జరిగింది. డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం కొరకు సంఘంలో ఉండే ప్రతి సభ్యురాలికి పది వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని చాలా స్పష్టంగా నేను హామీ ఇచ్చాను. ఆ మాటకు ఇప్పటికి కూడా నేను కట్టుబడి ఉన్నాననే విషయాన్ని కూడా సభాముఖంగా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేసుకుంటున్నాను. (సభలో చప్పట్లు)

అదే మాదిరిగా నేను ఆర్థిక సహాయం విషయమై ప్రకటించే నాటికి, ఆయా డ్వాక్రా సంఘాలు బ్యాంకుల నుండి తీసుకున్న రుణానికి సంబంధించి కొంత అసలుపైన వడ్డీ కట్టే పరిస్థితి ఉన్నప్పటికి పూర్తి వడ్డీనంతా కూడా ఈ ప్రభుత్వమే భరిస్తుందనే విషయాన్ని డ్వాక్రా సంఘాలకు ఆనాడే చెప్పడం జరిగింది. అందువల్ల ప్రభుత్వం ఎనిమిది వేల కోట్ల రూపాయల నుండి పది వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది.

అధ్యక్షా, పెన్షన్ల క్రింద ప్రభుత్వం అధిక మొత్తంలో ఖర్చు చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పెన్షన్ల విషయంలో ఐదు రెట్లు ఎక్కువగా పెన్షన్ల మొత్తాన్ని ప్రభుత్వం పెంచింది. వితంతు, వృద్ధాప్య పెన్షన్లను రెండు వందల రూపాయల నుంచి వెయ్యి రూపాయలకు, ఐదు వందల రూపాయలున్న వికలాంగుల పెన్షన్ మొత్తాన్ని పదిహేను వందల రూపాయలకు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పెంచడం జరిగింది. పెన్షన్

మొత్తం పెంపు వల్ల ఐదు సంవత్సరాల కాలంలో రూ.30 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఖర్చు అవుతుంది. ఈ ప్రభుత్వం ఒకవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని కాంక్షించి రెండింటిని సమాంతరంగా తీసుకువెళ్లాలని యోచిస్తోంది. ఆ దిశగా ప్రభుత్వం ముందుకుపోతోంది. ఈరోజున రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఆర్థిక సమస్యలున్నాయి. ఏవిధంగా మీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందనే విషయాన్ని కొంత మంది అడుగుతున్నారు. ఈ సందర్భంగా నేను వారికి ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకుపోతోంది. ఆర్థిక వనరులను ప్రభుత్వం అభివృద్ధి పర్చుకుంటుంది. ఇసుక మాఫీ విషయంలో గానీ, బెరైటీస్ అక్రమ త్రవ్వకం విషయంలో గానీ, సాండల్ ఉడ్ అక్రమ రవాణా విషయంలో గానీ పెద్దయెత్తున అవినీతి జరిగింది. అవినీతిని పూర్తిగా కంట్రోల్ చేసి, నియంత్రణ చేసి తద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా సంక్షేమం కొరకు, అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఖర్చుచేస్తుందనే విషయాన్ని మీ ద్వారా రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తిచేస్తున్నాను. ప్రభుత్వానికి కష్టాలున్నాయి. కానీ, ప్రజలు ఇంకా కష్టాల్లో ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రజల కష్టాలు తీరుస్తూనే మరోవైపు అభివృద్ధి దిశగా పయనించాల్సిన అవసరముంది.

అదే విధంగా రైతాంగం ఎన్నో ఇబ్బందులనెదుర్కొంటోంది. రైతులు ఆనందంగా ఉంటేనే గ్రామీణ ప్రాంతాలు సుఖసంతోషాలతో, సౌభాగ్యాలతో విలసిల్లుతాయి. అందుకే ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉంది. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎన్ని ఇబ్బందులు ప్రభుత్వానికి ఉన్నప్పటికి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామనే విషయాన్ని మరొకసారి తెలియజేసుకుంటున్నాను.

ప్రభుత్వం అమలుచేస్తున్న స్కీమ్స్ వివరాలను రాష్ట్రంలోని ప్రతి ఒక రైతుకు తెలియజేయడం జరుగుతుంది. ఎక్కడైనా తప్పులు దొర్లితే తప్పనిసరిగా మళ్లీ కంప్లైంట్ సెల్‌ను ప్రభుత్వం కొనసాగిస్తుంది. ప్రభుత్వం చెబుతున్న గైడెన్స్ ప్రకారం ప్రతి రైతుకు న్యాయం జరిగే వరకు చివరి రైతు వరకు పూర్తిగా ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందనే విషయాన్ని మరొకసారి సభాముఖంగా రాష్ట్ర రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

రైతు సంక్షేమం కొరకు ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకం అమలు జరుగుతోంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయనటువంటి విధంగా ప్రభుత్వం రైతు రుణ మాఫీ పథకాన్ని అమలుచేస్తోంది. అయినప్పటికి కూడా రైతాంగం సంక్షేమం కొరకు ప్రభుత్వం చేయాల్సింది ఇంకా చాలానే ఉంది. ఈరోజున ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నాయి. మీరు కూడా కలిసిరండని విజ్ఞప్తి చేస్తున్నాను. వ్యవసాయ రంగాన్ని అన్ని విధాల బాగుచేసి మళ్లీ రాబోయే కాలంలో వ్యవసాయరంగం ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా ప్రభుత్వం

చూడటం జరుగుతుంది. ఆ విషయమై రైతాంగానికి సభాముఖంగా విజ్ఞప్తి చేస్తున్నాను. అదే సందర్భంగా ఈ ప్రభుత్వానికి ధైర్యం ఉంది కాబట్టి రైతు ఎక్కడైనా ఆత్మహత్య చేసుకున్నట్లైతే, అందరు భయపడే పరిస్థితి నుంచి కాపాడుటకై, ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న ఆ రైతు కుటుంబాన్ని కూడా అన్ని విధాలుగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈరోజున ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. రైతు అప్పును రివైవ్ చేయడం కొరకు ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. అందులో కూడా లక్ష యాభై వేల రూపాయలను ఆత్మహత్య చేసుకున్న రైతు అప్పు క్రింద చెల్లించి, మరో మూడు లక్షల యాభై వేల రూపాయల మొత్తాన్ని ఆ కుటుంబం బాగుకొరకు, కుటుంబానికి పునరావాసం కల్పించడం కొరకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆ దిశగా ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అన్నింటిలో ప్రభుత్వం ధైర్యంగా ముందుకుపోతుంది. రైతులకు కూడా మీ ద్వారా ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు కూడా ప్రభుత్వానికి సహకరించండి. మీరు కూడా ధైర్యంగా ముందుకురండి. ఎప్పటికప్పుడు ప్రభుత్వం ఇచ్చే సూచనలు తీసుకోండి. ఇంకా మెరుగైన పద్ధతుల్లో ముందుకుపోయి వ్యవసాయరంగాన్ని లాభసాటిగా తీర్చిదిద్ది తద్వారా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేద్దాం. రైతుల జీవితాల్లో వెలుగును తీసుకువద్దామని విషయాన్ని సభ ద్వారా తెలియజేసుకుంటూ, రైతు రుణమాఫీ పథకంలో చాలా మంది భాగస్వామ్యులైనారు. అటు బ్యాంకర్స్ రేయింబవళ్లు పనిచేశాయి, ఇటు ప్రభుత్వానికి ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న కుటుంబరావు గారు గానీ, ఇంకా చాలా మంది వ్యక్తులు సహకరించారు. చాలా కష్టపడి వాళ్లు పనిచేశారు. అదేవిధంగా రైతు రుణమాఫీ పథకంలో ఆర్థిక శాఖ మరియు వ్యవసాయ శాఖాధికారులు చాలా మంది పనిచేశారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం కొరకు పనిచేసిన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ మీ ద్వారా రాష్ట్ర రైతాంగానికి మరొకసారి భరోసా ఇస్తూ, సెలవు తీసుకుంటున్నాను. నమస్కారాలు.

(సభలో చప్పట్లు)

డా. నిమ్మల రామానాయుడు (పాలకొల్లు): అధ్యక్షా, ఈరోజున రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో కొత్తగా పదమూడు జిల్లాల కలయికతో ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏదైతే ఉందో, ఈ నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాణం వ్యవసాయమైతే, రూపం పరిశ్రమలైతే, నడక నాయకత్వం శ్రీ నారాచంద్రబాబునాయుడుగారు. అటువంటి నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాణమైన వ్యవసాయ రంగాన్ని రక్షించాలనే ఉద్దేశంతో, రైతులకు కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈనాడు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పనిచేస్తోంది. అందుకే ఈనాడు దేశంలో మరే ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టినటువంటి విషయంలో గానీ, ప్రభుత్వం చేపట్టిన ఏడు అభివృద్ధి మిషన్ల విషయంలో గానీ తప్పక ప్రభుత్వాన్ని అభినందించకతప్పదు. ఆ ఏడు అభివృద్ధి మిషన్లల్లో కూడా మొదటి ప్రాధాన్యతక్రమంలో "Primary Sector Mission" క్రింద వ్యవసాయ రంగానికి అత్యంత

ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వం ముందుకువెళ్లుతున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. అందులో భాగంగానే ప్రభుత్వం చేపట్టిన "రైతు రుణ మాఫీ పథకం". ఎందుకంటే, గతంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 208 రోజులు సుమారు 2817 కిలోమీటర్ల దూరం వారు పాదయాత్ర చేసినప్పుడు గత పది సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ పరిపాలన కాలంలో రైతులు పడుతున్న ఇబ్బందులు, కష్టాలు, కన్నీళ్లను స్వయంగా చూసి, రేపు నేను అధికారంలోకి వచ్చిన తరువాత రైతులనందరిని ఆదుకోవాలని, ప్రతి రైతుకు భద్రత కల్పించాలని, ప్రతి రైతుకు భరోసా ఇవ్వాలనే సంకల్పంతో పాదయాత్ర సందర్భంగానే శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు "రైతు రుణ మాఫీ పథకాన్ని" ప్రకటించిన విషయం మనకందరికి తెలిసిందే.

ఆ విషయాన్ని తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన విషయం కూడా మనకు తెలిసిందే. అదే విధంగా ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తదుపరి మొట్టమొదటి సంతకం కూడా "రైతు రుణ మాఫీ పథకం" ఫైలు మీదే చేసిన విషయాన్ని కూడా మనమంతా చూడడం జరిగింది. ప్రస్తుత సభలో ఏదైతే ప్రతిపక్షం ఉందో, ఎవరైతే ప్రతిపక్షపార్టీ నాయకులున్నారో వారందరు కూడా రైతు రుణ మాఫీ సాధ్యం కాదనే విషయాన్ని ఆనాడు తెలియజేయడం జరిగింది. ఆనాడు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షులు శ్రీమతి వై.ఎస్. విజయమ్మ గారు కూడా రైతు రుణమాఫీ అసాధ్యమని, రైతు రుణ మాఫీ అవసరం లేదనే కోణంలో కూడా ప్రతిపక్షపార్టీ నాయకులు మాట్లాడారు. అటువంటి రాష్ట్ర విభజనానంతరం రాష్ట్రానికి లోటు బడ్జెట్ వచ్చినప్పటికి కూడా, రూ.14 వేల కోట్ల రూపాయల లోటు బడ్జెట్‌ను రాష్ట్రానికి గవర్నర్ గారు అప్పజెప్పినప్పటికి కూడా గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టి అమలుపర్చిన బృహత్తర పథకమే "రైతు రుణమాఫీ పథకం" గా అభివర్ణించవచ్చు. ఒక చారిత్రాత్మకమైన అంశంగా పరిగణించవచ్చును. ఎందుకంటే గతంలో ఎప్పుడు రుణమాఫీ చేసినా అది కేంద్ర ప్రభుత్వమే రైతు రుణమాఫీని చేసింది. గతంలో శ్రీ దేవిలాల్ హయాములో గానీ, డా.మన్మోహన్‌సింగ్ గారి హయాములోని ప్రభుత్వంలో గానీ రెండు పర్యాయాలు కూడా కేంద్ర ప్రభుత్వమే రైతు రుణమాఫీని చేసింది. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వమే రైతు రుణమాఫీ పథకాన్ని అమలుచేయడమనేది భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వమే చేసిందనే విషయాన్ని నేను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. అంతేకాదు, మన ప్రక్కనే ఉన్న పొరుగు రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రానికి మిగులు బడ్జెట్ ఉన్నప్పటికి కూడా ఆ రాష్ట్రంలో లక్ష రూపాయల పరిమితి వరకే రైతు రుణమాఫీ వర్తించే విధంగా పథకాన్ని అమలుచేసింది ఆ రాష్ట్ర ప్రభుత్వం. కానీ, మన రాష్ట్రంలో ఏదైతే కోటయ్య కమిటీని ఏర్పాటుచేసుకున్నామో, ఆ కమిటీ కూడా లక్ష రూపాయల వరకే రుణమాఫీ చేయమని సిఫార్సు చేసింది. అయినప్పటికి కూడా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా స్వయంగా రైతుల కష్టాలు, కన్నీళ్ల

చూసిన కారణంగా ఆ లక్ష రూపాయల రుణమాఫీ ఏ మాత్రం సరిపోదని భావించి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్ష యాభై వేల రూపాయల చొప్పున ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ పథకం వర్తించే విధంగా ప్రకటన చేసి, అందుకు అనుగుణంగానే అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేసిన ఘనత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందనే విషయాన్ని తమరి ద్వారా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేస్తున్నాను. ఆ పరిస్థితిని కూడా మనం నేరుగా చూస్తున్నాం. అంతేకాకుండా, గతంలో రైతు రుణమాఫీ చేసినప్పుడు నేను ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీకి అధ్యక్షుడిగా ఉండటం జరిగింది. ఆ కాలంలో రైతు రుణమాఫీ పథకాన్ని మన రాష్ట్రంలో అమలుపర్చినప్పుడు, ఎవరైతే రైతులు తీసుకున్న అప్పు తాలుకూ వాయిదాలను సక్రమంగా బ్యాంకులకు చెల్లించారో అటువంటి రైతులకు మాత్రమే రైతు రుణమాఫీ పథకం అమలు జరిగింది. అందుకే ఆనాడు దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి, దేశంలోని 25 రాష్ట్రాలకు కలిపి కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.56 వేల కోట్ల రూపాయల మొత్తాన్నే రైతు రుణమాఫీ పథకం క్రింద ఖర్చుచేసింది. ఆ కాలంలో కూడా మన రాష్ట్రంలో ఎవరైతే రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణానికి సంబంధించిన వాయిదాలను సక్రమంగా చెల్లించారో అటువంటివారికి, అంటే కేవలం పది శాతం మంది రైతులకు మాత్రమే ఆ రైతు రుణ మాఫీ పథకం అమలుజరిగింది. ఆ పరిస్థితిని కూడా గతంలో మనం చూశాం. కానీ, ఈనాడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం ఎటువంటి నిబంధన పెట్టకుండా నూటికి నూరు శాతం రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలనే ఉద్దేశంతో రైతు రుణమాఫీ పథకాన్ని అమలుపరుస్తోంది.

...

ఈరోజు చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వం 10 శాతం 20శాతం కాకుండా నూటికి నూరుశాతం రైతులకు న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతో రుణాలు చెల్లించిన వారికీ, రుణాలు చెల్లించలేకపోయిన వారికి కూడా రుణమాఫీ వర్తింపజేసే విధంగా మన ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అమలు పరుస్తోంది. ఎటువంటి హామీలు ఇవ్వకపోయినప్పటికీ, ఉద్యానవన పంటలకు సంబంధించి ఉద్యాన పంటల సాగుబడి చేస్తున్న రైతుల అభ్యర్థనను దృష్టిలో ఉంచుకొని ఎకరానికి రూ.10000చొప్పున ఇస్తున్నారన్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా తమదృష్టికి తీసుకువస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదటి విడతగా రూ.4750కోట్లు బడ్జెట్‌లో ఉంచుకొంటే అందులో దగ్గరదగ్గర రూ.4600కోట్లు రూపాయల దాకా రైతుల ఖాతాల్లోకి చేరిన పరిస్థితి ఉంది. రెండవ దశలో చెల్లించేందుకు రూ.4300కోట్లు కేటాయించుకున్నాం. మొదటి విడతో 44లక్షల రైతు కుటుంబాలకు న్యాయం జరుగగా, రెండవ విడతలో 42లక్షల రైతు కుటుంబాలకు న్యాయం జరిగేలా నిధులు సిద్ధంగా ఉన్నాయన్న విషయాన్ని కూడా తమ దృష్టికి తీసుకు వస్తున్నాను.

రాష్ట్ర విభజనతో మనరాష్ట్రం లోటు బడ్జెట్‌తో ఉంది. ఈరోజు నా నియోజకవర్గంలో గ్రామాల్లోని ఏదైనా సీ.సీ.రోడ్ కానీ, డ్రైనేజ్ పనుల కోసం నాలుగు ఐదు లక్షల రూపాయలు నిధులు అడిగితే, నా నియోజకవర్గ అభివృద్ధి నిధుల్ని కూడా కోల్పోయి వారికి ఇవ్వలేనటువంటి పరిస్థితుల్లో ఉండగా, ఆ గ్రామాల్లోని రైతులకు మాత్రం మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు రూ.70లక్షల నుండి 80లక్షల వరకు ఒక్కొక్క గ్రామానికి అందించారు. నియోజకవర్గానికి కోటి రూపాయల వరకు రాష్ట్ర విభజన మూలాన నేను నష్టపోయాను కానీ, నా నియోజకవర్గానికి మొదటి విడతగా రూ.70కోట్ల రూపాయలు రైతులకు అందిస్తే అందులో నా నియోజకవర్గంలోని రైతులకు రూ.21కోట్ల రూపాయలు రైతులకు వారి ఖాతాల్లోకి నేరుగా అందించడం జరిగింది. మానియోకవర్గంలోని ఒక గ్రామంలో రైతులకు రుణవిముక్తి పత్రాలను అందజేస్తుంటే, అక్కడ రుణవిముక్తి పత్రం అందుకున్న వైఎస్ఆర్‌సీపీకి చెందిన రైతు రుణవిముక్తి పత్రం అందుకుంటూ రెండు చేతులూ జోడించి మా నాయకుడు జగన్మోహన్‌రెడ్డి గారు వచ్చిఉంటే రుణవిముక్తి అసాధ్యం అన్నారు, ఇది సాధ్యమయ్యేది కాదు. రూ42వేలు నాకు రాకపోనూ ఈరోజు మీ ప్రభుత్వం చంద్రబాబునాయుడు గారు వచ్చారు కాబట్టి ఈరోజు రూ.42వేలతో నేను రుణవిముక్తి చెందుతున్నాను అంటూ రెండు చేతులు జోడించి రుణవిముక్తి పత్రం తీసుకున్నారు.

ఇంత పెద్ద ఎత్తున ఈరాష్ట్రంలో రుణమాఫీ అమలుచేస్తుంటే, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు మాకు చాల బాధకలిగిస్తున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం కానీ, తెలుగుదేశం నాయకులు కానీ, అసత్యాలు, *** చెప్పే సంస్కృతి ఎవరికీ లేదు. ఈరోజు రైతులకోసం ఎన్నోరకాలుగా ఉద్యమాలు పోరాటాలు చేసిన నాయకులు మా చంద్రబాబునాయుడు గారు. ఆరోజు మనందరకీ తెలుసు. బాబ్లీ సంఘటనపై మహారాష్ట్రకు వెళ్లీ పోలీసుల లాఠీలను సైతం ఎదిరించిన చరిత్ర మా నాయకుడు చంద్రబాబునాయుడు గారిది. రైతులకు న్యాయం జరగడం కోసం తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి నిరవధిక నిరాహారదీక్షకు పూనుకున్న చరిత్ర మా నాయకుడు చంద్రబాబునాయుడు గారిది. చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వం ఇంతపెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలు అములు చేస్తుంటే, ప్రతిపక్షాలు విమర్శలు చేయడం మంచిదికాదు. మీ విమర్శలు మమ్మల్ని ఆలోచింపజేసే విధంగా ఉండాలి తప్ప ప్రజల్ని తప్పుదోవ పట్టించే విధంగా ఉండకూడదని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను.

ఈరోజు పెట్టుబడులు పెరిగిపోయి దిగుబడులు తగ్గిపోయి గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితుల్లో రైతులు అయోమయం పరిస్థితులో ఉండగా చంద్రబాబునాయుడుగారు ఆయొక్క పెట్టుబడులను తగ్గించి దిగుబడులను పెంచే విధంగా పొలం పిలుస్తుందనే కార్యక్రమం ద్వారా ఈరోజు భూపరీక్షలు చేపట్టారు. అవి చాలా అవసరం. భూసార పరీక్షా

*** Expunged as ordered by the Chair

భూఆరోగ్య కార్డులు రైతులకు అందించే విషయంలో కానీ, ఆధునిక యాంత్రీకరణ పద్ధతులు అవలంబింపజేస్తున్నారు. నేను కూడా రైతు కుటుంబంలో నుండి వచ్చాను. నేను గత 15-20సంవత్సరాల నుండి వ్యవసాయం చేస్తున్నాను. నిజంగా వ్యవసాయ యంత్ర పరికరాలమీద 50-70శాతం వరకు వ్యవసాయ యంత్ర పరికరాలమీద సబ్సిడీ ఇచ్చే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం ఉందని మీకు ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను. గత ప్రభుత్వం ఎక్కడో మెకానిక్‌గా పనిచేసేవారు, కాంపౌండర్‌గా పనిచేసే వారిని కూడా గ్రామాల్లో ఆదర్శరైతులుగా నియమించారు. ఈరోజు చంద్రబాబునాయుడు గారు చంద్రన్న క్షేత్రాల్ని తీసుకువచ్చి ఎవరైతే వ్యవసాయవిద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్స్ పీ.హెచ్.డీ. పట్టాలు పొంది అర్హతలు కలిగి ఉన్నారో అటువంటివారు, 6354మందిని మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్‌గా తీసుకురావడం మారైతాంగానికి మేలు చేకూరుతుందన్న విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

రైతు అభివృద్ధి చెందాలన్నా వ్యవసాయం బాగుండాలన్నా, ఈదేశంలో నదుల అనుసంధానం జరగాలన్న విషయం మనందరికీ తెలుసు. మనందరం చెప్పుకుంటున్నాం కానీ అమలు పరిచే విషయంలో చాలా వెనుకబడి ఉన్నాం. గంగ, గోదావరి వంటి జీవనదులున్న ఈదేశంలో ఇంతటి కరువా అంటూ విదేశీయులు కూడా ఆశ్చర్యపోతున్నారు. అందుకే మన తెలుగు వ్యక్తి ఇంజనీరు, కేంద్రంలో మంత్రిగా పనిచేసిన కే.ఎల్.రావు గారు కూడా గార్లండ్ ఆఫ్ ది రివర్స్ అనగా ఈదేశంలో నదుల పూలమాల అవసరమని చెప్పిన పరిస్థితి ఉంది. ఈరోజు ఈదేశంలో నదుల అనుసంధానం విషయంలో కూడా వ్యవసాయానికి ఉపయోగపడే నదుల అనుసంధానంలో చాలా అవరోధాలు అడ్డంకులు ఎదురౌతున్నాయి. దీనికి కారణం దేశభక్తి కూడా తగ్గిపోయి రాష్ట్రభక్తి జిల్లాభక్తి, మండల భక్తి పెరిగిపోయిన పరిస్థితుల్లో ప్రజల భక్తిని మరచిపోయిన పరిస్థితి చూస్తున్నాం. ఈరోజు మనకున్న సరిహద్దులు, గీతలు, కేవలం మన పరిపాలనా సౌలభ్యం కోసం మాత్రమే ఏర్పరుచుకున్నవే తప్ప మరొకటి కాదన్న విషయం మనం గుర్తించుకోవాలి. ప్రవహించే నదులకు కానీ, విస్తరించే అడవులకు గానీ, భూమిలో ఉన్న ఖనిజాలకు ఈ హద్దులు తెలియవు. ఒక్కొక్క నది మూడు నాలుగు రాష్ట్రల మీదుగా ప్రవహిస్తోంటుంది. ఒక్కొక్క నది విదేశాల నుండి కూడా ప్రవహిస్తూ వస్తోంది. వీటన్నింటినీ దృ ష్టిలో ఉంచుకొని నదుల అనుసంధానంలో ప్రక్రియగా ఒక్క సంవత్సరం ఒక్క టీఎంసీ నీరైనా సముద్రంలో కలిసిపోయినా అది మన దురదృష్టం అని మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఆ నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి నదిపై ఒక లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టేందుకు పూనుకున్నారు.

ఈరోజు ప్రతిపక్షాలు మాట్లాడుతున్న మాటలు నాకు చాలా ఆశ్చర్యం అనిపిస్తోంది. ఈరోజు మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై 13లిఫ్ట్ ఇరిగేషన్స్ పెట్టుకుంటే, అభ్యంతరం లేని మన ప్రతిపక్షానికి, ఈనాడు అదే గోదావరి నదిపై ఒక లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టుకుంటే, దీనికోసం ఇంత

రాద్ధాంతం చేయడం కేవలం రాజకీయ కోణంలో చేస్తున్న విమర్శలే తప్ప మరొకటి కాదని ఈసందర్భంగా వారికి తెలియజేస్తున్నాం. ఏదేమైనా వ్యవసాయదారులను, రైతులను కాపాడే ప్రభుత్వం వచ్చిందనే భరోసా, భద్రతా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రైతులందరికీ ఏర్పడిందన్న విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. డెల్టా రైతుగా ఉభయగోదావరి జిల్లాల్లో నేను చూశాను గత ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. అమాయకంగా రైతులు నిజమనుకున్నారు. కానీ ఆ రైతుల పేరు చెప్పి కాంగ్రెస్ నాయకులు పండుగ చేసుకున్నారు.

ఆనాటి కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టులు కట్టకుండా కల్వర్ట్‌లు కట్టుకున్నారు, కాలువలు త్రవ్వుకుంటూ జలయజ్ఞం అన్నారు.  అది ధనయజ్ఞంగా కనిపించింది కానీ వారు చెప్పిన జలయజ్ఞం మాకెక్కడా కనిపించలేదు. వాళ్ల అవినీతిని చూసి రాష్ట్రంలో.. వాళ్ల అవినీతి ఎంత తారాస్థాయిలో ఉందంటే.. వాళ్లకంటే రాబందులే నయం అన్న పరిస్థితిలో ఈరాష్ట్ర  రైతులు అనుకుంటున్నారు.   ఎందుకంటే, రాబందులు కుళ్లిన మాంసాన్ని ముట్టుకోవు. ఈ నాయకులెవరైతే ఉన్నారో వారు గుడినీ, గుళ్లో లింగాన్ని మింగేసే రకం. ఆ రాబందులు కూడా కాంగ్రెస్ నాయకుల అవినీతికి జడిసి ఈరోజు రాష్ట్రంలో రాబందులు కూడా ఎక్కడా కనిపించని పరిస్థితి ఏర్పడిందని గ్రామాల్లోని రైతులు అనుకునే పరిస్థితి కనిపిస్తోంది.

...

అందుచేత ఇవాళ శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఈ రుణమాఫీ విషయంలో గానీ, ''పొలం – పిలుస్తోంది'' కార్యక్రమం ద్వారా గాని, వ్యవసాయ ప్రత్యేక బడ్జెట్ ద్వారా గాని, ప్రాథమిక రంగం మిషన్ ద్వారా గాని, ఈవిధంగా అణువణువునా వ్యవసాయాన్ని మిళితం చేసుకుంటూ రైతులకు ఉపయోగపడేవిధంగా, బడ్జెట్‌ను తీసుకొచ్చే విధానంలో గాని, ఇటువంటి ప్రకటలు చేసే విషయంలో గాని, ఈ రాష్ట్ర రైతాంగమంతా కూడా తెలుగుదేశం ప్రభుత్వానికి, తెలుగుదేశం ప్రభుత్వ నాయకుడు శ్రీ నారా చంద్రబాబునాయుడుగారికి కృతజ్ఞతాపూర్వకంగా రైతాంగమంతా ఉంటుందని, రైతు బిడ్డగా, రైతు నాయకుడిగా తెలియజేసుకుంటూ, ఈరోజు ఈ అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలను తెలియజేసుకుంటూ సెలవు తీసుకొంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః విష్ణుకుమార్‌రాజు గారు.

శ్రీ పి. విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం–నార్త్)ః అధ్యక్షా,  గౌరవ సభ్యులు( డా. నిమ్మల రామానాయుడు   గారినుద్దేశించి) ఇప్పుడే మాట్లాడుతూ చంద్రబాబునాయుడుగారు మా నాయకుడు అని అన్నారు.  ఆయన పచ్చ రంగు షర్టు వేసుకున్నారు.  కానీ గుర్తుంచుకోవలసిన విషయం ఏమంటే, చంద్రబాబునాయుడుగారు తెలుగుదేశం పార్టీ నాయకుడే కాదు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకుడు. కాబట్టి ప్రజలందరికీ  శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు నాయకుడు అని మేము పరిగణిస్తాము. గౌరవ మంత్రివర్యులు,

కొంతమంది శాసనసభ్యులు ఎంతసేపూ మా నాయకుడు, మా నాయకుడూ అని అంటున్నారు. అది కొంచెం ఇబ్బంది పెడుతోంది. శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ప్రజల నాయకుడు అని మీద్వారా అందరికీ తెలియజేస్తున్నాను. (అధికార పార్టీ సభ్యులు మన నాయకులు అని అన్నారు) పోనీ మన నాయకులు అంటే బాగుంటుంది.

అధ్యక్షా, శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు రెండు సంవత్సరాల క్రితం 16 జిల్లాలలో 208 రోజులు కాలినడకన నడిచారు. 2,818 కిలోమీటర్లు నడవడమంటే సామాన్య విషయం కాదు. నేను రోజుకి మూడు కిలోమీటర్లు నడవటానికే చాలా కష్టపడుతున్నాను. అటువంటిది ప్రతీ ఒక్కరూ కూడా ఈ విషయాన్ని చాలా జాగ్రత్తగా గమనించాలి. కనీసం రోజుకి ఒక అరగంట చొప్పున మంత్రివర్యులు, శాసనసభ్యులందరూ మార్నింగ్ వాక్ చేస్తే చాలా బాగుంటుంది. ఎప్పుడైతే మనం మార్నింగ్ వాక్ చేస్తామో, కొంతమంది విపక్ష సభ్యులు చేసే మాటలు, కామెంట్స్‌ను కూడా మనం వినకుండా ఉండగలుగుతాం. నన్ను కూడా ఏమైనా కామెంట్స్ చేస్తారేమోనని రోజాగారిని చూస్తున్నాను. 2,818 కిలోమీటర్ల పాదయాత్ర అంటే సాధారణం కాదు. రాష్ట్ర ప్రజలు దానిని గుర్తించుకోవలసిన అవసరం ఉంది. ఈ సుదీర్ఘ యాత్రలో రైతులు పడే ఇబ్బందులన్నీ గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి వచ్చాయి. రైతాంగానికి మేలు చేయటం కోసం ఆయన చేస్తున్న ప్రక్రియలో భాగంగా మొట్టమొదటి సంతకం రైతు రుణమాఫీ మీద సంతకం పెట్టడం నిజంగా హర్షణీయం.

జనరల్‌గా అందరూ చంద్రబాబునాయుడుగారంటే Hi-tech C.M. అని గౌరవ అనుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవటంలో శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు చేసిన ప్రక్రియ అత్యంత అద్భుతమైన ప్రక్రియ. రైతుకు ఎంతో మేలు చేసిన ముఖ్యమంత్రిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన పేరు చిరస్థాయిగా మిగిలిపోతుందని మీద్వారా తెలియజేసుకొంటున్నాను. ఎంతో ఇబ్బందికరమైన పరిస్థితిలో, క్లిష్ట పరిస్థితిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, మనకు ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉన్నప్పటికీ కూడా మొట్టమొదటి సంతకం చేసి రైతుకు ఉపశమనం కలిగించడానికి, ప్రతీ ఒక్క రైతు కుటుంబానికి రూ.1.50 లక్ష వరకు రుణమాఫీ చేయడానికి చేసిన నిర్ణయం సామాన్య నిర్ణయం కాదు. ఏదో చెప్పారు గానీ, practical గా implement అవుతుందో లేదో అని చాలామంది అనుకున్నారు. ప్రతిపక్ష నేతలు, ప్రతిపక్షంలో ఉన్న సభ్యులు కూడా చాలాసార్లు చెప్పడం జరిగింది. అలాగే నేను ప్రతిపక్ష సభ్యులకు దగ్గర్లో కూర్చుంటాను కాబట్టి రోజూ నాకు కూడా చెబుతుంటారు. నాకు కూడా అదే డౌట్ వచ్చింది. కానీ, ఇప్పుడు మొట్టమొదటి విడతగా 26,77,000 మంది రైతుల రుణమాఫీ కార్యక్రమం పూర్తి చేసినందుకు వారికి మనస్ఫూర్తిగా అభినందనలను తెలియజేస్తున్నాను.

రుణ విముక్తి కలిగి రైతులు ఎవరైతే లాభపడ్డారో, ఆ రైతుల తరపున, భారతీయ జనతాపార్టీ తరపున మన గౌరవ ముఖ్యమంత్రిగారికి హృదయపూర్వక ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. (అధికార పార్టీ సభ్యులు చప్పట్లు) ఎంత తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై తప్పనిసరిగా ఉంది. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, ముఖ్యమంత్రిగారు చేస్తున్న మంచి పనులకు మరొక్కసారి మేం ధన్యవాదాలను తెలుపుతున్నాం. రైతు ఏవిధమైన ఇబ్బందులు పడుతున్నారో, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలు పడుతున్న బాధలను మనం చూస్తే చాలా ఇబ్బందిగా ఉంటుంది. వినటానికే ఇబ్బందిగా ఉంటుంది. మనం ప్రాక్టికల్‌గా చూస్తే చాలా హృదయవికారమైన ఇబ్బందులు రైతులు పడుతున్నారు. ఇటువంటివాటికి ముఖ్యమంత్రిగారు చేసే మంచి మంచి నిర్ణయాలు, వీటిమీద ఒక స్పెషల్ ఫోకస్ పెట్టి, రైతుల మైండ్లలోకి ఆత్మహత్య అనే ఆలోచన రాకుండా ఉండే కార్యక్రమాన్ని చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్తున్నాను. రైతులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత మనం కాంపెన్‌సేషన్ ఇచ్చే బదులు, ముందే రైతులకు అటువంటి ఆలోచన రాకుండా, రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంది. ఆ దృష్ట్యా ఎవరైనా ఇబ్బందికర పరిస్థితిలో ఉంటే సంబంధిత ఎమ్మెల్యేకు గాని, సంబంధిత మంత్రివర్యులకు గాని, తప్పనిసరిగా వాళ్ల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే విధంగా ఒక ప్రక్రియను పెడితే బాగుంటుందని నా సూచన. దీనిని కూడా ప్రభుత్వం ఒకసారి ఆలోచించవలసిందిగా కోరుతూ, పర్టిక్యులర్‌గా ఈ రైతు రుణమాఫీ సమస్య మీద, రైతు రుణ మాఫీ విముక్తిలో ఫస్ట్ కార్యక్రమం, ఫస్ట్ ఫేజ్ కార్యక్రమం చేసినందుకు మరొక్కసారి గౌరవ ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలును తెలుపుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలను తెలియజేసుకొంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః బుచ్చయ్య చౌదరి గారు.

శ్రీ జి. బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్)ః అధ్యక్షా, ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు సాహసోపేతంగా తీసుకున్న రైతు రుణఉపశమన పథకానికి హృదయపూర్వకంగా ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. దీనిని మూడు కోణాలలో చూడవలసిన అవసరం ఉంది. ఏ పరిస్థితిలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు రుణ విముక్తి పథకాన్ని ప్రకటించారో, ఆ సమయం ఏమిటో రాష్ట్ర విభజన, విభజన అనంతర పరిణామాలు, ఈనాడు రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి వీటన్నింటినీ మనం ఆలోచించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే కొంతమంది ఇవన్నీ పనికిరాని పథకాలుగా, ప్రభుత్వ సొమ్మును ఏదో ధారాదత్తం చేస్తున్న పథకాలుగా వర్ణిస్తూ ఉన్నారు. ఏదో అలవిగానివన్నీ ప్రకటించారు అన్న భావన కలిగేలా రకరకాలుగా మాట్లాడుతున్న విషయాన్ని కూడా మనం ఒకసారి గమనించాలి.

నాయకుని అనుచరులుగా, మా నాయకునితోపాటు మేము కూడా పాదయాత్రలో పాల్గొన్నాం. అనేక సమస్యలను కళ్లారా చూసి, ఆ సమస్యల తీవ్రతను గమనించి, సమాజంలో వివిధ వర్గాల వారి ఆలోచనలు, వివిధ వృత్తుల వారి సమస్యలు, నేరుగా తెలుసుకున్న వ్యక్తిగా, అక్కడికక్కడే వారు స్పందించిన సందర్భాలను కూడా మేం చూశాం. మావరకు మేమే ఆశ్చర్యపోయే వాళ్లం. ఏంటీ నాయకుడు ఈవిధంగా, ఇంత స్పీడుగా రియాక్ట్ అయిపోతున్నారు, రేపటి ఆర్థిక పరిస్థితి ఏంటి అని అంటే "మానవత్వం ఉంటే ఏదైనా చేయవచ్చు" అని ఆయన ఒకటే చెప్పారు. హ్యూమన్ టచ్‌తో పనిచేయాలని చెప్పి, వారు చేసిన నిర్ణయాల ఫలితం ఇది. ఇవాళ ప్రభుత్వం రూ.23,000 కోట్లు రుణ మాఫీకోసం వెచ్చించి, ఈ సంవత్సరంలో ఇప్పటికే సుమారుగా రూ.7,000 కోట్లు బ్యాంకులకు జమచేసి లక్షలాది రైతాంగాన్ని ఆదుకున్న పరిస్థితిని మనం చూసినప్పుడు, ఇది సాధ్యమా, చేస్తారా, చేయగలరా, చేయకుండా ఉండాలనుకున్న వాళ్లకి గుణపాఠం చెప్పేలాగ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు దీనిని అమలు చేసిన తీరును భారతదేశమంతా ఒక్కసారి ఆలోచిస్తుంది.

...

ఎందుకంటే, గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం రైతు సమస్యల మీద కేంద్రాన్ని ఒప్పించి, రైతులకు అనేక సార్లు రుణవిముక్తి చేయడానికి కారణమయింది. నందమూరి తారక రామారావు గారు ఒకసారి, చంద్రబాబు నాయుడు గారు మరొకసారి, రెండు సార్లు కూడా కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి, ఆరోజున రైతుల రుణవిముక్తికి కారకులయ్యారు. ఆరోజున ఇదే శాసనసభలో అపహాస్యం చేసిన నాయకులున్నారు, ఈరోజు వారు లేరు. ఎక్కడి నుంచి చేస్తారు అన్నారు. ఢిల్లీ వెళ్ళి, అన్ని పార్టీలనూ కదిపి, కేంద్రాన్ని ఒప్పించేలాగా చేస్తే, ఈరాష్ట్రంలో అమలులోకి వచ్చేటప్పటికి, మేమే చేశామని, చంకలు గుద్దుకుంటూ ప్రచారం చేసుకున్నారు ఆనాటి దివంగత నేతలు.

ఇది సాధ్యం చేయాలని రైతుల కోసం పాదయాత్ర చేశారు. పాదయాత్ర చేసినప్పుడు, రైతుల సమస్యలను తెలుసుకున్నారు కనుకనే, ఆరోజు ఆ కార్యాచరణ ప్రకటించారు. ఈరోజున మన సీమాంధ్రప్రదేశ్‌లో దాదాపుగా 36 లక్షల మంది రైతులున్నారు. మన గణాంకాల ప్రకారం దాదాపు 99.9 శాతం అప్పుల ఊబిలో ఉన్నారు. పరిశ్రమల్లో, వ్యాపారాల్లో సంపాదిస్తున్న రైతులుండొచ్చేమో గానీ, రైతులు గానీ, కౌలు రైతులు గానీ, తీవ్రమైన ఇక్కట్లలో ఉన్నారనేది మనం చూస్తున్నాం. వీళ్ళను ఏదోరకంగా రక్షించాల్సిన అవసరముంది. రక్షించకుండా గాలికి వదిలివేయలేము. ఎందుకంటే వ్యవసాయ పంట దిగుబడిలో గానీ, పంటకు గిట్టుబాటు ధర విషయంలో గానీ గ్యారంటీ లేదు. ఒకవైపు కరువు కాటకాలు, మరొక వైపు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోవడాన్ని మనం చూస్తున్నాం. చీడ-పీడల వల్ల కూడా పంటలు నష్టపోతున్నాయి. రైతు తనకు వచ్చే ఆదాయంతోటి తన బిడ్డలను చదివించుకోలేక, తన కుటుంబ అవసరాలు తీర్చుకోలేక, తన ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోలేక నాశనమై

పోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి రావడం లేదు. నేనుగూడా ఒక రైతుబిడ్డగా డిగ్రీ పూర్తిచేసిన తరువాత వ్యవసాయం చేద్దామని మా ఊరికి వెళ్ళి నాలుగు సంవత్సరాల పాటు వ్యవసాయం చేశాను. చేతులు కాల్చుకున్న తరువాత మరలా పట్టణబాట పట్టాను. అలాగే ఈరోజు అనేక మంది రైతు బిడ్డలు వ్యవసాయం మీద ఆధారపడలేక ఇతర వృత్తులకు వెళ్ళిపోతున్నారు. భారతదేశానికి వెన్నెముకలా ఉన్నటువంటి గ్రామీణ భారతం నిలబడాలంటే, రైతుల ఆధారితమైన ఈదేశం నిలద్రొక్కుకోవాలంటే రైతులను ఆదుకోవలసిన అవసరముంది.

ఈరోజు కొంతమంది సబ్సిడీలు ఎందుకు, తీసేద్దామని అంటున్నారు. సబ్సిడీ లేకపోతే ఎలాగ? అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశంలోనే భారీ ఎత్తున సబ్సిడీలు ఇస్తున్నారు. పంటలు వేయకున్నా సబ్సిడీ ఇస్తున్నారు. పండిన పంటకీ సబ్సిడీ ఇస్తున్నారు. పెట్టుబడులు ఇస్తున్నారు. యంత్రాలు ఇస్తున్నారు. మరి పేద దేశం, పేద రైతాంగం ఉన్న భారతదేశంలో, రైతులను ఆదుకోవలసిన బాధ్యత మనమీద లేదా? అందుకనే మన ప్రియతమ నేత, ఈ రైతు రుణమాఫీని నెత్తికెత్తుకున్నారు. ఆర్థిక ఇబ్బందులున్నాయి. జీతాలకు డబ్బుల్లేని పరిస్థితి వస్తోంది. అనేక సమస్యలను పరిష్కారం చేసుకుని వస్తున్నాం. నిన్నటి రోజున ఉద్యోగుల జీతభత్యాలను 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి పెంచారు. ఎందుకంటే, వారి జీవనప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా, వారి పనితీరుని మెరుగుపరచాలన్న ఉద్దేశంలో భారీ ఎత్తున ఆ కార్యక్రమాన్ని నెత్తికెత్తుకున్నారు.

అలాగే, రూ.200ల పెన్షన్‌ను రూ.1000లు చేసి, వికలాంగుల పెన్షన్‌ను రూ.1500లు చేసి, గత మూడు నెలలుగా రెగ్యులర్‌గా ఇస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది భారతదేశంలోనే ఉన్న ఏకైక ప్రభుత్వం శ్రీ నారా చంద్రబాబునాయుడి గారి నాయకత్వంలోని తెలుగు దేశం ప్రభుత్వం. (ఈ సందర్భంలో కొందరు అధికారపక్ష సభ్యులు చప్పట్లు కొట్టడం ద్వారా తమ హర్షాతిరేకాలను వ్యక్తపరిచారు.)కనుక, ఆవిధంగా ప్రతీదానికీ ప్రాధాన్యతనేర్పరచుకొని ముందుకు వెళుతున్న ప్రభుత్వం ఇది. రైతు సంక్షేమమే ప్రధానంగా ముందుకు వెళుతోంది. గతంలో అసత్యాలను మరీ మరీ చెప్పి ప్రచారం చేసి చంద్రబాబునాయుడు గారు 'రైతు వ్యతిరేకి అన్న భావన'ను కల్పిస్తూ ప్రచారం చేసుకుంటూ తిరిగారు. ఆరోజు నేనూ ఉన్నాను. ఆయన చెప్పింది ఒక్కటే. వ్యవసాయం గిట్టుబాటు కావాలి. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలుంటేనే వాళ్ళు బాగుపడతారు అని చెబితే దానికి వక్రభాష్యం చెప్పి, "వ్యవసాయం దండగ అన్నారు, వ్యవసాయం దండగ అన్నారని" చెప్పిందే చెప్పి రైతులను మోసం చేశారు. అధికారంలోకి వచ్చి జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేసి దోచుకుపోయారు. ఫలితాలు వచ్చాయా? వస్తే ఎన్ని ఎకరాలకు నీళ్ళిచ్చారు? ఇస్తే ఈ పరిస్థితి ఎందుకు వస్తుంది? అయితే ఈ ప్రభుత్వం ఈ తెలుగు దేశం ప్రభుత్వం. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం.

మన దేశంలో రెండు బడ్జెట్‌లు ఉంటాయి. మొదటగా పెట్టేది రైల్వే బడ్జెట్. రెండవది ఆర్థిక బడ్జెట్. ఈనాడు మన ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం రెండు బడ్జెట్‌లు తీసుకుంది. ఒకటి ఆర్థిక బడ్జెట్. రెండవది రైతు బడ్జెట్. రెండు బడ్జెట్‌లు పెట్టడం ద్వారా రైతాంగానికి ఇచ్చే ప్రాధాన్యతకు, రైతాంగానికి కల్పించే సౌకర్యాల గురించి ఈ ప్రభుత్వానికున్న దృఢ నిశ్చయానికి ఇదొక దృష్టాంతం అని నేను సవినయంగా మనవి చేసుకుంటున్నాను. జలవనరులని సద్వినియోగం చేసుకుంటూ ప్రతీ నీటిబొట్టునీ కూడా ఒడిసి పట్టుకుంటూ, వెనుకబడ్డ మారుమూల ప్రాంతాలకు కూడా నీరందించేలా అటు వెనుకబడ్డ ఉత్తరాంధ్ర జిల్లాలకు గానీ, నీటిచుక్క కోసం అలమటించే రాయలసీమ వాసులకు నీరందించడం కోసం కార్యాచరణతో ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఆర్థిక ఇబ్బందులున్నా లెక్కచేయకుండా, కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఏనాడో వచ్చే ఫలితాలకంటే, సత్వరమే వచ్చే ఫలితాల కోసం శ్రీ చంద్రబాబునాయుడు గారు ఈనాడు పట్టిసీమ ప్రాజెక్టును టేక్‌అప్ చేస్తున్నారు. దానికీ వక్ర భాష్యాలు చెప్పారు. ఎంత చెప్పినా వినిపించుకోరు. నేను మొన్న చెప్పాను. ఎంతచేసినా మూర్ఖుని మనస్సుని రంజింపజేయలేము. అలాంటి మూర్ఖుణ్ణి గురించి మాట్లాడుకోవడం కూడా వృథా. దృఢచిత్తం గల నాయకుడు పనిచేసుకుంటూ వెళ్తుంటాడు. ఆశాభావంతో ముందుకు వెళతాడు. దాన్ని సాధిస్తాడు. దానికి దృష్టాంతం చంద్రబాబునాయుడు గారు హైదరాబాదును ఏవిధంగా తీర్చిదిద్దాడో మనమందరం చూశాం. అదేవిధమైన న్యాయం మన సీమాంధ్రకు కూడా చేస్తాడనే విశ్వాసం మాలో ఉంది. రైతాంగం కోసం జలవనరులని ప్రయత్నిస్తున్నారు. రైతాంగం కోసం ప్రత్యేక అగ్రికల్చర్ బడ్జెట్ పెట్టడంలో ప్రధన ఉద్దేశం ఏమిటంటే ఏవిధంగా రైతులను ఆదుకోవాలి, వ్యవసాయానికి వాల్యూ యాడెడ్ మార్కెట్‌ను ఏవిధంగా కల్పించాలనే వారి తపనను మనం ఈరోజు చూస్తున్నాం. వాల్‌మార్ట్ వంటి సంస్థలను పిలిచి, మీరు మా వస్తువులను మార్కెట్ చేయమని, మా సముద్ర ఉత్పత్తులను మార్కెట్ చేయమని మా పంటలను మార్కెట్ చేయమని చెప్తున్నారంటే, రైతాంగానికి వాల్యూ యాడెడ్ మార్కెట్ రావాలనే, మన ఉత్పత్తిని అయినకాడికి అమ్ముకోకుండా, రైతులు వారు పండించిన పంటకి గిట్టుబాటు ధర లభించేట్లుగా, డా.స్వామినాథన్ (వ్యవసాయ శాస్త్రవేత్త) గారు చెప్పినట్లుగా, రైతులకి కొంత లాభం కూడా ఉండేలా చేయాలనే తపనే చంద్రబాబునాయుడు గారిది. దానిలో భాగమే. ఈ రైతు రుణ విముక్తి. అందుకనే, దీన్ని మేము పూర్తిగా కోరుతున్నాము.

డ్వాక్రా మహిళల విషయానికొస్తే, ఇసుక అమ్మకాలను వారికే అప్పగించారు. వాళ్ళ సమాఖ్యలకు డబ్బు వస్తోంది. ఇంకా రుణమాఫీకి దాదాపుగా రూ.8000కోట్లు నుండి రూ.9000కోట్లు దాకా పెట్టుకోవలసి ఉంది. అదే రాష్ట్ర విభజన జరగకుండా సమైక్య రాష్ట్రానికి చంద్రబాబుగారు ముఖ్యమంత్రి అయ్యుంటే ఒకే ఒక్క కలంపోటుతో, ఒకే ఒక్క క్షణంలో అమలు చేసి ఉండేవారనే విషయాన్ని మనం గమనంలోకి తీసుకోవాలి. ఇవాళ ఇబ్బందులున్నాయి. కేంద్రం నుండి నిధులు రాబట్టుకోవాలి. మనకు ఉన్న వనరులను పెంచుకోవాలి. రాజధాని లేదు. కార్యాలయాలు లేవు. అద్దెభవనాల్లో ఉన్నట్లు పరిస్థితులున్నప్పటికీ,

ఇంత ధైర్యంగా కార్యక్రమాలు చేస్తుంటే హర్షించవలసింది పోయి విమర్శించడం తగదు వాళ్ళందరికీ. అన్నింటికీ రకరకాలుగా చెప్తుంటారు. ఇన్స్యూరెన్స్‌ను బ్యాంకుల్లో జమ చేసుకుంటున్నారంటే వెంటనే నిర్ణయించారు, జీ.ఓ. నెం.224 ఇచ్చారు. ఫలితంగా రూ.600కోట్లు రైతుల ఖాతాల్లోకి వచ్చాయి. దాదాపుగా ఎవరికైతే రూ.50,000ల లోపల రుణం ఉన్నవాళ్ళందరికీ కూడా రుణ విముక్తి చేశారు. కొంతమందికి వడ్డీ పెరగడం మూలాన వారి రుణం ఇన్‌స్టాల్‌మెంట్‌లోకి వెళ్ళిందని అంటున్నారు. ఏదైనా నిర్ణయం చేసినప్పుడు, దానికొక కటాఫ్ పెట్టినప్పుడు సహజంగా కొంత అటూ ఇటూ అవుతుంటుంది. మాగ్జిమమ్ వర్కవుట్ చేసి అటు కౌలు రైతులకీ, ఇటు అసలు రైతులకీ ఇద్దరికీ కూడా న్యాయం జరిగేవిధంగా ముందుకు వెళ్ళడం హర్షించదగ్గ పరిణామం. అందుకని వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించా ల్సిన అవసరం ఏర్పడుతోంది. ఒకవైపు ఎరువుల ధరలు పెరుగుతున్నాయి. పురుగుమందుల ధరలు పెరుగుతున్నాయి. కూలీ రేట్లయితే అసలు అందుబాటులో లేని పరిస్థితి వస్తోంది. యాంత్రిక యుగంలోకి ప్రవేశించి ఆధునీకరిస్తే గానీ రైతుకు కనీసం గిట్టుబాటు ధర లభించే పరిస్థితి లేదు. అదేవిధంగా సీజన్లు. ఏదైనా సకాలంలో నీరందితే, సకాలంలో పంట వేస్తే, సకా లంలో దిగుబడులు వస్తాయి. దురదృష్టవశాత్తు నీటివనరులు లేనందువల్ల ముఖ్యంగా రాయల సీమలో గానీ, కృష్ణా డెల్టాలో గానీ, సకాలంలో నార్లుపోసి నాట్లు వేయలేని పరిస్థితి ఉంది. ఫలి తంగా సైక్లోన్ జోన్‌లో పడిపోతున్నాం. మరొకవైపు కరువుకాటకాల్లో పడిపోతున్నాం. అందుకనే నీటివనరులను కూడా అగ్రికల్చర్‌లో ఒక భాగంగానే చూస్తున్నాం.

...

ఈ మూడింటిని అనుసంధానం చేస్తూ మనం ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా వ్యవసాయ రంగానికి 'ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్'ను ముఖ్యమంత్రి గారు నియమించారు. గతంలో చంద్రబాబునాయుడు గారు మార్కెట్ యార్డులను శిక్షణా కేంద్రాలుగా తీర్చిదిద్దారు. పది సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వాటిని పట్టించుకోకుండా గాలికి వదలివేశారు. పద్ధతులను, విధానాలను సర్వనాశనం చేశారు. కొన్ని పద్ధతులను సృష్టించడం చాలా కష్టం. పద్ధతులను నాశనం చేయడం చాలా సులభం. పద్ధతులను, విధానాలను మా ప్రభుత్వం మరలా పునాదుల నుంచే మొదలుపెడుతున్నది. గ్రామసభల్లో రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి కార్యాచరణలో తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి గారి సూచనల, సలహాల ప్రకారం రైతుల వద్దకు వెళ్ళి వారు ఎలా ఉన్నారో, వారి పరిస్థితి ఎలా ఉందో ఎప్పటికప్పుడు వాకబు చేస్తున్నాం. మొన్న నేను మూడు హార్వెస్టర్స్‌ను పంపిణీ చేశాను. పది మంది రైతులు ఒక గ్రూప్‌గా ఏర్పడి సకాలంలో వ్యవసాయం చేసుకుంటే పంటను ఎక్కడ ఆరబెట్టుకోవాలో తెలియడం లేదంటే 50శాతం సబ్సిడీతో యంత్రాలను పంపిణీ చేశాం. ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోకుండా చూసే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కుటుంబంలో ఒకరు మరణిస్తే ఐదు లక్షల రూపాయలు పరిహారం ఇస్తారని ముఖ్యమంత్రి గారు ప్రకటించగా దానిని రైతులు మరోరకంగా భావిస్తే తప్పుడు సంకేతమవుతుంది. ఒక రైతు మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా అప్పులపాలు

కాకుండా సర్వం కోల్పోకుండా ఉండాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి గారు చేసిన కార్యక్రమం ఇది. దానిని దుర్వినియోగం చేయకుండా రైతుల గుండెలలో మనోధైర్యాన్ని మనం నింపాలి. ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా రైతులకు కల్పించడంలో మనం ముందుండాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క రైతు కూడా మరణించకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, శాసనసభ్యులపై ఉంది. స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్తగా చంద్రబాబు నాయుడు గారు ఉండి తీరుతారు.

ఆనాడు విజన్ 2020 కార్యక్రమం చేసినపుడు అనేక రాష్ట్రాలు కూడా చేపట్టాయి. విజన్ 2020ని ఒరిస్సా, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు మోడల్‌గా తీసుకొని వారి రాష్ట్రాలను అభివృద్ధి చేసుకోగలిగారు. విజన్ 2020ని 420 గాళ్లు దుర్వినియోగం చేసి సెజ్‌ల పేర్లతో రైతులను, ప్రభుత్వ ఖజానాను దోచుకొన్నారు. అందువల్ల మా ప్రభుత్వం దానిని విజన్ 2029గా మార్చుకోవల్సి వచ్చింది. అదే చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే ఈనాడు మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారి ఉండేదని ప్రజలు భావిస్తున్నారు. ఏదైనా ఒక పథకం/కార్యక్రమం అమలు చేసేటప్పుడు కొన్ని ఇబ్బందులు వస్తాయి. రాజకీయ పక్షాలు దానిని అర్థం చేసుకొని సమర్థించాలి తప్ప ఈ కార్యక్రమం విఫలం కావాలని, ప్రభుత్వంపై మట్టి వేయాలనుకుంటే, ఆ మట్టి వారిపై పడుతుందన్న విషయాన్ని గమనించాలని తెలుపుతున్నాను.

విజయవాడ మహానాడులో విద్యుత్ సంస్కరణలపై మాట్లాడమని నన్ను అడిగారు. ఆనాడు దేవతలు, రాక్షసులు సముద్రంలో పర్వతాన్ని చిలికినపుడు హాలాహలం వస్తే శివుడు తన కంఠంలో ఎలా దాచారో, ఈ విద్యుత్ సంస్కరణలలో ముందుగా హాలాహలం వస్తుందని దానిని మీ (సభా నాయకుడిని ఉద్దేశించి) కంఠంలో దాచుకోవాలని ఆరోజే చెప్పాను. ఆ విషాన్ని తన కంఠంలో పెట్టుకొని పది సంవత్సరాలు అధికారం లేకున్నా భరించారు. విద్యుత్ సంస్కరణలపై నిర్ణయం తీసుకున్నారు. అయితే ఫలితాలు ప్రపంచానికి మేలు చేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు భారతదేశానికే మోడల్‌గా నిలిచి, విద్యుచ్ఛక్తి రంగంలో నూతన దృక్పథానికి నాంది పలికాయి. రుణమాఫీ వాయిదాల పద్ధతిలో చెల్లించాలని లేదా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మూడు సంవత్సరాలకు ముందే మెరుగైతే ముందే ఇచ్చే పరిస్థితి ఉంటుంది. రైతులు సహృదయంతో అర్థం చేసుకుంటారని, అర్థం చేసుకున్నారని భావిస్తూ మరొకసారి ముఖ్యమంత్రి గారికి అభివందనలు, ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: Dr.Jayanageswara Reddy.

డా.బి. జయనాగేశ్వర రెడ్డి (ఎమ్మిగనూర్)ః అధ్యక్షా, మా ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు రైతు రుణఉపశమన పథకం గురించి వారి ప్రసంగం ప్రారంభించేముందు చెప్పిన వాక్యాన్ని 'దేనిలోనైనా జాగు చేయవచ్చు గాని ఒక్క వ్యవసాయంలో

తప్పు' అన్న వాక్యంతో ముఖ్యమంత్రి గారికి రైతులపై ఉన్న చిత్తశుద్ధి, గౌరవం ఏమిటో తెలుస్తుంది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోనున్నప్పుడు హేతుబద్ధతలేకుండా రాష్ట్ర విభజన చేస్తే, ఒక ప్రక్క రాష్ట్రాన్ని విభజించడమే కాకుండా ప్రజలకు అన్యాయం చేశారు. ఒక ప్రక్క రైతుభాందవులని, రైతు బిడ్డలమని చెప్పుకునే నాయకులందరూ రైతులకు మంచి కార్యక్రమాలు చేసి ఉంటే ఈ రైతు రుణ ఉపశమన పథకం ఎందుకు చేయాల్సి ఉంటుంది? రాష్ట్రంలో ఒక ప్రక్క ఆర్థికలోటు ఉంది. మా నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి గారు పాదయాత్ర చేసేటప్పుడు ఈ రోజుకు నాకు గుర్తున్న విషయం ఒకటుంది. మా నియోజకవర్గంలో ముఖ్యమంత్రి గారు పర్యటించేటప్పుడు వారి వెంట పూజ్యులు, ఉపముఖ్యమంత్రి శ్రీ కె.ఈ.కృష్ణమూర్తి గారు ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు గారికి తీవ్రమైన మోకాలి నొప్పి రావడం జరిగింది. ఆ నొప్పి వల్ల పాదయాత్రలో ఇబ్బంది అవుతుందని చెబితే ఆయన చెప్పిన మాట ఇప్పటికీ నా చెవిలో వినిపిస్తోంది. మీ (సభా నాయకుడిని ఉద్దేశించి) అనుమతి తీసుకొని ఆ మాటను చెప్పదలచుకున్నాను. 'రైతులు ఇబ్బందులలో ఉన్నారు, తెలుగు ప్రజలందరూ కష్టాలలో ఉన్నారు. వారి బాధలముందు నా నొప్పి ఎంత' అని ఆ రోజు చెప్పారు.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరచడం ద్వారా తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు)

ఆ నొప్పిని, బాధను భరిస్తూ 2,816 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. యువకులుగా మేము మా నియోజకవర్గాలలో తిరగలేదు. ఆ పాదయాత్రలో రైతులు పడుతున్న కష్టాలు, బాధలు తెలుసుకొని, రైతు రుణ ఉపశమన పథకాన్ని మ్యానిఫెస్టోలో పెట్టి, రైతుల ఆత్మహత్యలు కొంతైనా నివారించేందుకు ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు.

సభలో నిన్న కరువు సమస్యపై, ఈ రోజు రైతుల సమస్యలపై చర్చించేటప్పుడు ప్రతిపక్షం సభలో లేకపోవడం దురదృష్టకరం. ప్రతిపక్ష పార్టీకి స్వచ్ఛత, పారదర్శకతలకు అర్థం తెలియదు. అవినీతికూపంలో మునిగిపోయారు. పారదర్శకంగా ఒక కమిటీ వేసి చరిత్రలో నిలబడిపోయే విధంగా పథకాన్ని అమలుచేసే ఉద్దేశంతో ముఖ్యమంత్రి గారు ఉన్నారు. కోటయ్య కమిటి ఇచ్చిన సిఫార్సులతో, ఒక ప్రణాళికాబద్ధంగా, మంత్రిమండలి ఆమోదంతో ఒక కటాఫ్ తేది పెట్టి, పథకం వినియోగించే విధానం రైతులందరికీ సులభంగా అర్థం అయ్యేలా చేసిన విధానం, చాలా హర్షించదగినది. 'efforts of a present is more effective than politician' అని పెద్దలన్నారు. అదేవిధంగా కేవలం లక్ష రూపాయలు మాత్రమే రుణమాఫీ చేయాల్సిన అవసరం ఉంటుందంటే, కాదు రైతులు చాలా ఇబ్బందులలో ఉన్నారని లక్ష యాభై వేలు చేయాలని చెప్పిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికే దక్కుతుంది. అంతేకాకుండా, రైతులకు మేలు చేసేవిధంగా బీమా క్రింద రూ.600 కోట్లతో జీవో ఇవ్వడం జరిగింది.

...

రైతులు పడుతున్న కష్టాలకు, ఖచ్చితంగా ఈరోజు ఇబ్బంది కలుగకుండా వారికి రుణ ఉపశమన పథకాన్ని సక్రమంగా వినియోగం చేసే విధంగా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ముఖ్యంగా మా నియోజకవర్గాలలోని చాలా మంది శాసనసభ్యులు మాట్లాడారు. మా నియోజక వర్గం గురించి గర్వంగా చెప్పుకుంటున్నాం. రాయలసీమ నుంచి వచ్చిన శాసనసభ్యులం మేము. మాప్రాంతంలో దాదాపు రూ.35,000, 40,000, 50,000 లోపు రుణాలు ఉన్నటువంటి వారి కి, రుణాల బాండ్లను శాసనసభ్యులు వారికి రుణవిముక్తి పత్రం ఇచ్చినపుడు వారి ఆనందానికి అవధులు లేవు. ప్రతి ఒక్క రైతు గుండెల్లో ఆనందం ఉంటే, పాపం కొంతమంది నాయకులకి మాత్రం కడుపు మంటగా ఉంది. ఎవరికీ కడుపుమంటగా ఉందో సభాముఖంగా చెప్పకపోయినా ఒక విషయం చెప్పదలుచుకున్నా. ఎవరైతే 'రుణమాఫీ మావల్ల కాదు' అని చెప్పారో, రైతు వ్యతిరేకులైనటువంటి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారు కానీ, వారి తండ్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి గారు కానీ వారే 'ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వండి కానీ, రైతుల రుణాలను మాత్రం మీరు మాఫీ చెయ్యవద్దు' అని చెప్పారు. ఇటువంటి పరిస్థితులలో ఎవరైతే రుణమాఫీ చెయ్యలేము, మాకు చేతకాదు అని చెప్పిన వాళ్ళు ముక్కుమీద వేలు వేసుకునే విధంగా ఈరోజు చరిత్రలో నిలబడే విధంగా రుణమాఫీని చెయ్యగలము అని చెప్పి, ఎన్ని కష్టాలు ఉన్నా, ఈ రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్న పరిస్థితిలో కూడా రూ.7,000 కోట్లతో రుణమాఫీని....రెండు దశలలో రుణమాఫీని చెయ్యడం... రూ.23,000కోట్లతో పెనుభారమైనా... చెయ్యడం చాలా హర్షించదగ్గ విషయం అని సభాముఖంగా తెలియజేస్తున్నాం.

ఈ రోజు ముఖ్యంగా రైతాంగం పట్ల కానీ, వ్యవసాయం పట్ల కానీ ఒక ప్రణాళికాబద్ధతతో, దూరదృష్టితో రుణమాఫీ అంశాన్ని మ్యానిఫెస్టోలోనే పెట్టారు. ఒకప్రక్క ఆర్థికలోటు, ఇంకోకపక్క మా ముఖ్యమంత్రి గారికీ, మా ప్రభుత్వానికీ చాలా విచిత్రమైన సమస్యలు. ఎందుకంటే ఒకపక్క లోటే కాదు, ప్రకృతి పరంగా హుద్‌హుద్ తుపాను విలయతాండవం చేసింది. ప్రళయం వలన వచ్చిన నష్టాన్ని పూడ్చుకునే సమయంలో ప్రతిపక్షపార్టీకూడా అవగాహన లేనటువంటి, ఆవేశం ఉన్నటువంటి, ఆలోచన లేనటువంటి ప్రతిపక్షపార్టీని ఎదుర్కోవడం కూడా ఒక చిన్నపాటి సమస్యగా తయారు అయ్యింది ఈరోజు. పక్క రాష్ట్రాలకు ఊతమిచ్చే విధంగా, రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అసలు రైతుల రుణమాఫీ జరగనే జరగలేదని చెప్పే వాళ్లు... ఇంకో పక్క రాష్ట్రం అంతా బాగుందని సంకేతాలు ఇచ్చేవాళ్లు... ఐదుకోట్ల ఆంధ్ర ప్రజలకు తప్పుద్రోవ పట్టించే విధంగా మాట్లాడే ప్రతిపక్షం ఉండడం కూడా చాలా దురదృష్టకరం. ముఖ్యంగా మనమందరం ప్రజలకు ఈ సభ ద్వారా చెప్పేది ఏదైనా కానీ, ఈ రుణ ఉపశమనం పథకంతో మరోసారి చరిత్రలో గతంలో నందమూరి తారక రామారావుగారి తరువాత మళ్లీ రుణవిముక్తి చేసిన ఘనత చంద్రబాబునాయుడిగారికి ఒక్కరికే దక్కుతుందని గర్వంగా చెప్పుకుంటాం.

(అధికార పక్షసభ్యులు బల్లలు చరిచారు)

అంతేకాకుండా, రైతు మేలు కోరి 'పొలం పిలుస్తోంది, నీరు-చెట్టు' వంటి అనుబంధ కార్యక్రమాలు పెట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఇక్రిసాట్ ద్వారా ల్యాబ్ టూ ల్యాండ్ అనే విధంగా ప్రతి ఒక్క సాయిల్ టెస్టింగ్ పద్ధతుల ద్వారా రైతులకు మేలు చేసే చర్యలు చేపట్టారు. ఏ కారణంచేతైనా రైతుల ఆత్మహత్యలు జరిగినప్పటికీ, ఎన్ని కష్టాలున్నా, ఎంత ఆర్థిక లోటున్నా రూ.5,00,000లు ప్రకటించడం రైతుపక్షపాతిగా తెలుగుదేశం ముఖ్యమంత్రిగారి ఆలోచనను సభ ద్వారా అభివ్యక్తపరచడం జరుగుతోంది. మేము ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఈ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన మా రాయలసీమ ప్రాంతానికి చెందిన సాగునీటి విషయంలో ఒక దూరదృష్టితో ఆయన తీసుకున్న నిర్ణయం. ఈ రోజు గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి పోతున్న జలాలను పట్టిసీమ ద్వారా మా ప్రాంతానికి నీటిని అనుసంధానం చెయ్యాలి అని చెప్పిన వారి ఆలోచనను కూడా రాజకీయం చేస్తున్న సమయంలో వారికి ప్రత్యేకంగా రాయలసీమ నుంచి వచ్చిన శాసనసభ్యుడిగా ఆయనకి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. అంతేకాకుండా సాగునీటి విషయంలో వారు తీసుకున్న ప్రతిఒక్క నిర్ణయానికి కూడా మాప్రాంత రైతులు ప్రతిఒక్కరూ హర్షించే విధంగా ఉంది. నిన్న నేను సెలవుపైన మా నియోజకవర్గానికి వెళ్లడం జరిగింది. అక్కడ ప్రజలు సభను మొత్తం గమనిస్తున్నారు. ఈరోజు చాలా గౌరవప్రదంగా, హుందాగా, చాలా అనుభవం ఉన్న నాయకుడిగా 9 సంవత్సరాలు అధికారంలో ఉండి, 10 సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నటువంటి వారు మాప్రాంత సమస్య చర్చకు వచ్చినపుడు, సాగునీటి విషయంలో మా గొంతునొక్కుతున్నారంటూ ప్రతిపక్షనాయకులు చైర్ మీద ఎలిగేషన్ చేసే పరిస్థితి ఉంది. చాలా హుందాతనంగా ఆరోజు మా కళ్లముందే, ముఖ్యమంత్రిగారు స్వయంగా రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన నీటి విషయంలో మాట్లాడేందుకు, 'జగన్‌మోహన్‌రెడ్డిగారికి 10 నిమిషాలు కాకపోతే 20 నిమిషాలు మైకు ఇవ్వండి' అని చెప్పిన ఏకైక నాయకుడు ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగారు అంటే ఒక్క చంద్రబాబునాయుడుగారని చెబుతున్నాం. కాబట్టి రైతు సంక్షేమం, రైతు మేలు కోరే ప్రభుత్వంగా అన్ని కష్టాలు ఉన్నా, ఆర్థిక లోటు ఉన్నా ఇన్ని వేల కోట్ల అవినీతి డబ్బుని తప్పుదోవ పట్టించకుండా సక్రమమైన గాడీలో పెట్టి, ఈరోజు మళ్లీ ఆ డబ్బును ప్రజల సంక్షేమం గురించి వాడుతున్న మా ముఖ్యమంత్రిగారికి, ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః గొల్లపల్లి సూర్యారావుగారూ.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః అధ్యక్షా, ఈరోజు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ఉన్న రైతాంగం ఆనందంగా ఉందని చెప్పవచ్చు. సరిగ్గా మనం జూన్‌లో వచ్చాం. మొదటి పంట చేతికి తెచ్చుకుని రైతులు అందరం, ఈ ప్రభుత్వం యొక్క ఆలోచన, రైతు విధానాల గురించి ఎదురుచూస్తున్న తరుణంలో మొట్టమొదటి పంట చాలా సురక్షితంగా, క్షేమంగా ఆంధ్రప్రదేశ్ రైతులు అందరూ ఇంటికి తెచ్చుకున్నారు. మళ్లీ ఇప్పుడు రెండో పంట వచ్చింది. ఈ పంట కూడా ఇంకో నాలుగు, ఐదు రోజులలో ఇంటికొస్తుంది. అందుకే

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైతాంగం అందరూ ఆనందపడుతున్న పరిస్థితి చూస్తున్నాము. ఎందుకంటే ఈ మధ్య గ్రామాలకు వెళ్లాము. సహజంగా డెల్టాప్రాంతంలో ఫిబ్రవరి, మార్చి నెలలలో ఆఖరి తడి కోసం చాలా ఆతృతగా ఎదురుచూస్తుంటారు. వాళ్లందరికీ మేము భరోసా ఇచ్చాం. ముఖ్యమంత్రిగారు ఏ ఒక్క అంగుళం భూమిలోని పంటని కూడా పాడవ్వకుండా ప్రతి అంగుళం భూమికి నీరు ఇచ్చి మీరు వేసినటువంటి ప్రతి పంట సురక్షితంగా ఇంటికి తెచ్చుకుని ఒక మహత్తరమైన చేయూత, భరోసా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు మీకు ఇచ్చారు. మీరు ఏ రకమైన ఆందోళన చెందవద్దని మేము రైతులందరికీ చెప్పాం. నిన్న సాయంత్రం ఐదుగంటలకి మేము బయలుదేరినప్పుడు రైతులందరూ అసెంబ్లీకి మమ్మల్ని పంపుతూ చాలా ఆనందంగా, సంతోషంగా మా పంటలకి కావలసిన నీటిని ఆఖరి విడత కూడా సక్రమంగా అందించారు అన్న ఆనందాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నటువంటి ఈ సందర్భంలో ముఖ్యమంత్రిగారు రైతులయొక్క ఆర్థికస్థితిగతులు ఇంకా మెరుగుపడాలి, వాళ్లకి నేను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి ఒక పక్క అనేక ఇబ్బందులు ప్రభుత్వ పరంగా ఆర్థికపరంగా ఉన్నప్పటికీ ఆనాడు నేను ఏదైతే మాట ఇచ్చానో ఆ మాట ప్రకారం నేను నిలబడి ఉండాలి ఇచ్చిన మాటని అమలు చేసి రైతు శ్రేయోభిలాషిగా, ఆపద్బాంధవుడిగా ఉండాలి నా జీవితంలో పదవులు కాదు ముఖ్యం, ఇచ్చిన మాటను నిలబెట్టుకుని కష్టాలలోను, ఆపదలలోను, ఇబ్బందులలో ఉన్న రాష్ట్ర ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని ఆదుకోవాలి అనే లక్ష్యంతో ఈ రోజు రుణ ఉపశమన పథకం అనే మహత్తరమైన సందేశాన్ని గడిచిన డిసెంబరులో కానీ, ఈరోజు, రేపు ఇవ్వబోతున్న రైతు రుణవిముక్తి పత్రాలను అందించే సందర్భాలలో రైతులకు ఇచ్చిన మాట, యావత్ ఆంధ్రప్రదేశ్‌కి నిజమైన రైతాంగ వారసుడు కానీ, రైతాంగానికి దశ, దిశనిర్దేశకుడు కానీ ముఖ్యమంత్రిగారు అవుతారని మొట్టమొదటిగా మనవిచేస్తున్నాను. ఇప్పటికే మొదటి విడతగా రాష్ట్రంలో ఉన్న 82.66 లక్షల రైతు ఖాతాలకు తొలిదశలో సుమారు 40.43 లక్షల ఖాతాల రుణమాఫీకి క్లియరెన్స్ ఇచ్చిన విషయం ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అదేవిధంగా ఉపశమనం పొందిన రైతులు 26.77లక్షల మంది. ఇది బహుశా ఈ ప్రభుత్వం యొక్క నిబద్ధతకు ముఖ్యంగా ప్రభుత్వం అంటే ఉమ్మడి ప్రభుత్వంగా, ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగారు ఇచ్చిన మాట. రాష్ట్రం విడిపోయిన తరువాత ప్రతి ఒక్క స్కూలు విద్యార్థికానీ, కాలేజ్ విద్యార్థికానీ, రైతులు కానీ సాధారణమైన ప్రజలందరికీ కూడా అర్థం అయ్యింది. చాలా ఇబ్బందులలో, ఆర్థికపరమైన అనేక అనేక హెచ్చుతగ్గులతో ఈ రాష్ట్రం విభజించబడింది. ఈ రాష్ట్రముఖ్యమంత్రి ఇచ్చినమాటను ఎలా నిలబెట్టుకుంటారు అన్న మాట ప్రజలలో ఉంది. అలాంటి మాటలను సంభాషించుకున్నటువంటి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి విడతగా రైతాంగానికి ఇచ్చినటువంటి మాట సుమారు 26,77,000మందికి రూ.50,000 లోపు ఆపైన ఉన్నవారికి విడతలవారీగా రుణమాఫీ పొందినటువంటి రైతుల మాటలో, వారిముఖాలలో ఉన్న ఆనందాన్ని చూస్తున్నప్పుడు అది మాటలతో చెప్పలేని అనుభూతి.

ఇలాంటి సమయంలో మరల రెండవ విడత ఇస్తారా లేదా, బడ్జెట్ అయిపోతుందేమోనన్న ఆందోళనలో వున్న వారికి ఆనాడు రైతులకిచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం రెండవ విడతగా సుమారు 51.45 లక్షల ఖాతాలను ప్రభుత్వం క్లియర్ చేయడానికి ముందుకొచ్చింది. అదేవిధంగా 33.19 లక్షల రైతు కుటుంబాల వారిని రుణాల భారీ నుంచి విముక్తం చేయడానికి, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని 3.56 లక్షల ఎస్సీ, ఎస్టీ రైతు కుటుంబాల వారిని విముక్తం చేయడానికి ఇప్పుడు చర్యలు తీసుకున్నారన్న విషయాన్ని మనవి చేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల గురించి, వారెదుర్కొంటున్న ఆర్థిక అసమానతలు లేదా దీనావస్థల గురించి ఆ రోజున చంద్ర బాబు నాయుడు గారు చెప్పినప్పుడు ఆ మాటలు విన్న మాకు ఆయనలోని పట్టుదల, ధైర్యం విన్నప్పుడు మాకు నమ్మకం కలిగింది. ఎందుకంటే ఈ రాష్ట్రానికి ఆయన ఒక కారణజన్ముడు. అధికార పక్షంలో కాని, ప్రతిపక్షంలో కాని వున్నప్పుడు ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం. ఆయన పాదయాత్రకు వెళ్తున్నప్పుడు చాలా మంది అనేకరకాలుగా వ్యాఖ్యానించడం మనందరం చూశాం. అప్పుడు ఆయన అన్న మాటలు ఒకసారి గుర్తు చేసుకోవలసిన అవసరముంది. అధికారం కోసం ఆరాటం కాదు నాది. ప్రజలు నాకు అధికారం ఇచ్చారు. నేను తొమ్మిది సంవత్సరాలు ముఖ్య మంత్రిగా పని చేశాను. ఇప్పుడు ప్రతిపక్షంలో వున్నాను. ప్రతిపక్షంలో వున్నప్పుడు కేవలం ప్రతిపక్ష నాయకుని బాధ్యత మాత్రమే కాదు నేను నిర్వహించాల్సింది. నాకు అధికారమిచ్చిన రైతులు, రైతు కూలీల, ప్రజల శ్రేయోభిలాషిగా వారి కష్టనష్టాల్లో పాలుపంచుకోవలసి వుందన్నారు. ఆ రోజున డాక్టర్లు కూడా వారికి వారి వయసు రీత్యా, శారీరక పరిస్థితి దృష్ట్యా అంత దూరం నడవలేరు ఒకసారి ఆలోచించుకోండి అంటే నా శరీరం, వయసు సహకరిస్తుందా లేదా అన్నది కాదు, ఈ రోజు రాష్ట్రంలోని అనేకానేక ప్రాంతాలలో దీనావస్థలో వున్న రైతుల నుంచి వస్తున్న అభ్యర్థనల మేరకు వారి శ్రేయస్సు కోసం వెళ్తున్నానని చెప్పారు. ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రైతులయితే బతికుంటే బలుసాకు తినైనా బతుకుతాం కాని ఈ నాటి కాంగ్రెస్ ప్రభుత్వ యొక్క రైతు వ్యతిరేక విధానాలు, వైఫల్యాల వలన మేం ఆర్థికంగా చితికిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయామని, రైతులకు అప్పులివ్వని పరిస్థితి వుందని, మేలైన విత్తనాలు కాని, ఎరువులు కాని, పురుగు మందులు కాని దొరకని పరిస్థితి వుందని, మరో పక్కన ప్రకృతి వైపరీత్యాల వల్ల కూడా రైతులు అన్నిరకాలుగా ఇబ్బందుల్లో పడివున్నారని, వారి ఇబ్బందులను ఎవరితో చెప్పుకోవాలో, చెప్పుకున్నా ఎవరూ వినలేని పరిస్థితుల్లో వున్నారన్న వారి ఆవేదన గమనించి వారి సంక్షేమం కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని మేల్కొల్పాలని, రాష్ట్ర రైతాంగాన్ని కూడా చైతన్యవంతం చేయాలన్న ఒకే ఒక లక్ష్యంతో ఈ పాదయాత్రను ప్రారంభిస్తున్నానని చెప్పి ఆయన పాదయాత్ర ప్రారంభించిన సందర్భాన్ని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

ఆయన రెండవ దశ రుణ ఉపశమన కార్యక్రమం చేస్తున్న ఈ సందర్భంగా 'Everything can wait, but not Agriculture' అని ఆయన ఆనాడు రైతుల పక్షాన చెప్పిన ఒక మాటను జ్ఞాపకం చేస్తున్నాను. ఎంత అద్భుతమైన మాట అది. నేను ఎప్పుడు ఇలాంటి

proverb వినలేదు. దేశానికి రైతు వెన్నెముక అని మనమంటుంటాం. నిజంగా ఈనాడు ఈ సృష్టిలోనూ, ప్రకృతిలోనూ అంతర్భాగమైన మనిషి, అతనికి అనుబంధంగా వున్న పాడి పశువులను మనం చూస్తున్నప్పుడు ఈ సృష్టిలోగాని ప్రకృతిలోగాని మనం గమనించినట్లయితే మనిషికి, పాడిపశువులకు సన్నిహిత సంబంధాలున్నాయి. మనం ప్రాధాన్యతనివ్వాల్సిన మొట్టమొదటి అంశం వ్యవసాయమని మన ముఖ్యమంత్రి గారు చెబుతుంటారు. ఇవ్వాళ మన రైతాంగంలో వ్యవసాయం పట్ల బాధ్యతతో ముందుకెళ్లాలన్న ఒక ఉత్సాహం రావడానికి కారణం మన ముఖ్యమంత్రి గారి నోటి వెంట రైతుల సంక్షేమం, అభివృద్ధి పట్ల కృషి చేయడమే తన జీవిత ధ్యేయమని పాదయాత్ర సందర్భంగా ప్రకటించడమేనని చెప్పవచ్చును. అదేకాకుండా ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో రైతులకిచ్చిన మాట నిలబెట్టుకోవలసిన అవసరం గురించి చెప్పాల్సివస్తే రాష్ట్రం విడిపోయిన తరువాత కూడా ఆ మాట నిలబెట్టుకోవాలని రైతులెవ్వరూ అనుకోరు. అయినా కూడా నాదీ బాధ్యత అని భావించి ఎలా ఇవ్వాలి, ఎప్పుడివ్వాలి, ఏ విధంగా ఇవ్వాలన్న విషయాలగురించి సమగ్రంగా అధ్యయనం చేసి ఉమ్మడి రాష్ట్రంగా వున్నప్పుడు బ్యాంకు ఖాతాలెన్ని, విడిపోయిన తరువాత ఎన్ని ఖాతాలు, మొదలైనవవన్నీ స్టడీ చేయడానికి ప్రత్యేకంగా కోటయ్య కమిటీని వేసి సమగ్రంగా అధ్యయనం చేయించి లక్ష లోపు రుణాలను రద్దు చేయవచ్చునన్న ఆ కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకోవడమే కాకుండా రైతులకు నేనిచ్చిన మాట మేరకు రైతుల మొహాల్లో నవ్వు, ఆనందం చూడాలన్నదే నా ధ్యేయం కాబట్టి కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం కేవలం లక్షలోపు రుణాలే కాదు. లక్షన్నర లోపు రుణాలను రద్దు చేయాలన్న నిర్ణయం తీసుకొని దానిని ఏ విధంగా అమలు చేయాలన్న దానికి సంబంధించి సమగ్రమైన రీతిలో విధి విధానాలను రూపొందించి అమలు చేస్తూ రైతుల రుణాలను విడతల వారీగా రద్దు చేసే ప్రక్రియ చేపట్టడం జరిగింది. నేను మీ ద్వారా ఈ రాష్ట్ర రైతాంగానికి మనవి చేసేదేమంటే ఇంత గొప్ప, సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడమన్నది మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి తప్ప వేరొకరికి సాధ్యం కాదని తెలియజేస్తున్నాను. ఎందుకంటే ఈ ప్రభుత్వాన్ని, చంద్రబాబు నాయుడు గారిని ఇరకాటంలో పెట్టాలని, ఈ విషయాన్ని ఏదోరకంగా ప్రజల్లో ఎప్పుడూ చర్చనీయాంశంగా చేయాలన్న ఆలోచనలతో చాలా మంది వున్నారు బయట. వాళ్లకు రోజూ ఇదే పని. కాని మేం గత సంవత్సరం డిసెంబర్ 14న మొదటి విడత రుణ విముక్తి పత్రాలిచ్చిన తరువాత ఏ ఒక్క రైతు కూడా నాకు అన్యాయం జరిగిందని, నాకు సకాలంలో పత్రాలివ్వలేదని మాకెవరూ చెప్పలేదు. ఎందుకంటే మేం నిత్యం ప్రజలతో తిరుగుతూ వాళ్లతో సంభాషిస్తూ, వాళ్ల కష్టనష్టాలు తెలుసుకుంటూ వుంటాం. మాకు ఎక్కడ కూడా ఏ ఒక్క అలిగేషనూ రాలేదు. కాస్త ఆలస్యమయ్యిందనే ఒకే ఒక్క మాట తప్ప రైతు ఎక్కడ కూడా నిరాశతో కాని నిస్పృహతో కాని మాట్లాడలేదు. అలాగే చంద్రబాబు నాయుడు గారు మాకిచ్చిన మాట నిలబెట్టుకోలేదన్న మాట కూడా మాకు ఎక్కడా ఏలాంటి పరిస్థితుల్లోనూ వినపడలేదన్న విషయాన్ని నేను ఈ సందర్భంగా సభకు మనవి చేస్తున్నాను. అయితే ముఖ్యమంత్రి గారు మాట నిలబెట్టుకోలేదు కాబట్టి ఆయన దిష్టిబొమ్మల్ని తగలబెట్టమని ఈ ప్రతిపక్షనాయకుడు ఒకసారి పిలుపు ఇచ్చాడు. కాని మేం

ఆశ్చర్యపోయిందేమిటంటే ఆ సందర్భంలో రైతులంతా ప్రతిపక్ష నాయకుని దిష్టిబొమ్మల్ని తగలబెట్టారు. అయినా వాళ్లకు కనువిప్పుకలగడం లేదు. వాళ్లలో మార్పు రావడం లేదు. నాకన్నా ముందు మాట్లాడిన మా సోదరులు చెప్పారు. భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా ఎన్టీ రామారావు గారి ప్రోద్బలంతో దేవీలాల్ గారు ఉప ప్రధానిగా వున్నప్పుడు రైతుల రుణమాఫీ విధానాన్ని ప్రకటించారు. అప్పుడు నేనుకూడా ఇక్కడ శాసనసభ్యునిగా వున్నాను. రైతు రాజు కావాలన్న ఆలోచన, ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం అన్న గొప్ప నిర్వచనాన్నిచ్చి తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్‌టీరామారావుగారు ఈ రైతాంగాన్ని ఆదుకోవాలి, దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రైతులు కరువుతో ఇబ్బందులనెదుర్కొంటున్నారని, అలాంటి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన చేసిన సూచన మేరకు దేశంలోనే మొట్టమొదటి సారిగా రైతుల రుణాలను మాఫీ చేసిన నేపథ్యం, అధికభాగం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతులను ఆదుకున్న నేపథ్యం ఆనాడుంది. కేంద్రం రెండవసారి రుణవిముక్తి కోసం అంతంతమాత్రంగా సహాయం చేసినప్పుడు కూడా నేను ఇక్కడున్నాను. అప్పుడు రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకూ ఇవ్వలేదు. ఇవ్వక్కరలేదని చెప్పిన ముఖ్యమంత్రిని అప్పుడు చూశాను. రైతుల ఉపశమనం కోసం కేవలం ఐదువేలిద్దామని చెప్పి చేతులు దులుపుకున్నటువంటి పాలకుల వారసులమని చెప్పుకుంటున్న వీళ్లు, ఇవ్వాళ ఈ ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని, రైతు సంక్షేమం పట్ల అభివృద్ధి పట్ల కృషి చేస్తున్న ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నారు. నిజంగా ఇలాంటి ముఖ్యమంత్రి నభూతోభవిష్యతి. ఎవరైనా ఎప్పుడైనా దేనికైనా ఒకే ఒకసారి నిరాహార దీక్షలు చేశారేమో కాని రైతులకోసం ఎవరూ చేయలేదు. కాని ఈ ముఖ్యమంత్రి కేవలం రైతుల సంక్షేమం, అభివృద్ధి పేరుతో కేవలం రైతు అజెండా పేరుమీద తొమ్మిది రోజుల పాటు నిరాహార దీక్షలు చేశారు.

...

ఆ తొమ్మిది రోజులు మేం చాలా భయపడ్డాం, ఆందోళన చెందాం. రాత్రి సమయంలో వారి కొడుకు తండ్రి దగ్గర కూర్చొని ఉండగా మేమంతా ఆయన చుట్టూ ఉండి ఎందుకోసం చంద్రబాబునాయుడుగారు ఇలా దీక్ష చేస్తున్నారు, ప్రజలు ఓట్లు వేయాలనుకుంటే ఎట్లా అయినా వేస్తారు, ఈయన తన ప్రాణాన్ని హింసించుకుంటున్నారని అంటే ఆయన ఈ రాష్ట్రంలోని రైతాంగం ప్రయోజనాల కోసం నిరాహారదీక్ష చేశారు. చాలా మంది ఆనాడు అపహాస్యం చేశారు. చంద్రబాబు నాయుడుగారు సమన్యాయం అన్నప్పుడు కొన్ని పత్రికలకు, వాటి యాజమాన్యాలకు, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నవారికి అర్థం కాలేదు. కానీ భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వానికి, ప్రధానమంత్రి మోదీగారికి అర్థమయింది. చంద్రబాబు నాయుడు గారు సమన్యాయం, సమన్యాయం అని చెప్పుకొంటే కొంతమందికి అర్థం కాలేదు కానీ మోదీగారికి అర్థమై మొట్టమొదటి కేబినెట్ మీటింగ్‌లోనే ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేస్తూ ఒక గొప్ప నిర్ణయాన్ని తీసుకొని గొప్ప భవిష్యత్తును రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి ఇచ్చిన నేపథ్యం చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలోని పార్టీది, ప్రభుత్వానిది. రుణమాఫీ రెండో విడత కూడా త్వరలోనే అనగా బహుశా శాసనసభ సమావేశాలు ముగిసిన తరవాత రైతుల ముంగిటకు వెళ్లే మహత్తర

అవకాశం ఇచ్చారు. రైతుల శ్రేయోభిలాషిగా తెలుగుదేశం పార్టీకి, ప్రభుత్వానికి మరలా వంద సంవత్సరాల ఆయుష్షును చంద్రబాబునాయుడుగారు పెంచారు. ఇపుడొక చక్కటి కవిత చదువుతాను. "లోకానికి వెలుగు ఇచ్చేది సూర్యుడు అయితే సమస్త జీవకోటి కడుపు నింపే అన్నదాత ఆకుపచ్చ సూర్యుడు. మట్టినుంచి బువ్వ పుట్టించే అపరబ్రహ్మ రైతన్న, ఆకు మడతపడితే అతని జీవితాన్ని చక్కబరచడమే మా ప్రభుత్వ ధ్యేయం, అదే చంద్రబాబు నాయుడుగారి ప్రభుత్వ ధ్యేయం." తప్పకుండా రైతులు కష్టాలలో ఉంటే రైతుల ఆవేదనను ఏ విధంగానైనా, ఏ ప్రక్రియద్వారానైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రిగారి దృష్టికి వచ్చిన వెంటనే తప్పకుండా స్పందించి రైతులను ఆదుకొనే ప్రభుత్వంగా ఈ ప్రభుత్వం ఉంటుందని సవినయంగా మనవి చేసుకుంటూ అప్పుల ఊబిలో కూరుకొనిపోయిన రైతు కుటుంబాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది. భారతదేశంలో సగటున చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో 92.9 శాతం రైతుల అప్పుల ఊబిలో కూరుకొనిపోయినది. అలాంటి మన రాష్ట్రంలో రైతుల భవిష్యత్తును బాగుచేయడంకోసం వారు పండించిన పంటలకు ఉద్యానవనపంటలతో సహా పది వేల రూపాయల వరకు రుణవిముక్తి కల్పించారు. మా కోనసీమ ప్రాంతంలో కొబ్బరి తదితర ఉద్యానవన పంటలు విరివిగా పండిస్తారు. వారిని కూడా దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన వారికి కూడా మేలు చేయాలనే ఆశాభావ దృక్పథంతో ఉన్నారు కాబట్టి వారికి కూడా రుణవిముక్తి కలిగించి వారికి భరోసా కల్పించిన చంద్రబాబునాయుడుగారికి హృదయపూర్వకంగా గౌరవిస్తూ ఈ అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ యరపతినేని శ్రీనివాసరావు (గురజాల): అధ్యక్షా, ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల లక్షలాది రైతు కుటుంబాల సభ్యుల కళ్లలో ఆనందం కనిపిస్తున్నది. గత పది సంవత్సరాలుగా వారు పడ్డ కష్టాలు, వ్యవసాయంలో వారు ఎదుర్కొన్న సంక్షోభాలు, గత ప్రభుత్వం చేసిన పాపాలవల్ల రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొని అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి నుంచి ఈ రోజు చంద్రబాబునాయుడు గారు తీసుకొన్న నిర్ణయం వలన రాష్ట్ర ఆర్థికపరిస్థితి బాగాలేకపోయినా ఆనాడు పాదయాత్రలో రైతులు పడుతున్న ఇబ్బందులను దగ్గరగా చూసి, రైతుల ఆర్థికస్థితిగతులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి, వ్యవసాయాన్ని ఈ రోజు అందరూ లాభసాటిగా చేయాలనే ధ్యేయంతో చాలా గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఈరోజు భారతదేశంలోనే ఒక రాజకీయ నాయకుడు ఏవరూ చేయని విధంగా 208 రోజులపాటు 2817 కిలోమీటర్లు చరిత్రాత్మకమైన పాదయాత్ర చేసి పేదప్రజల హృదయస్పందన ఏవిధంగా ఉందో తెలుసుకొన్న ఏకైక నాయకుడు ఈ భారతదేశంలో ఉన్నారంటే ఒక్క చంద్రబాబునాయుడుగారే. 2002-03లో ఆనాటి ఒక నాయకుడు పాదయాత్ర చేశారు. ఆయన అపుడు చేసిన పాదయాత్ర అధికారంకోసం, అధికారంలోకి వస్తే ఎక్కడెక్కడ ఏయే వనరులున్నాయి, ఆ వనరులను ఏవిధంగా దోచుకోవాలి, ఆ వనరులను గుర్తించేందుకు ఆ పాదయాత్రను ఉపయోగించుకొన్నారు. 9 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ఎక్కువ కాలం

అనగా తొమ్మిది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి పాదయాత్ర చేయడం అంటే మామూలు విషయం కాదు. సాధారణంగా ఎవరైనా అధికారంకోసం పాదయాత్ర చేస్తారని అనుకొంటారు గానీ తొమ్మిది సంవత్సరాలు అనగా 1995లో చంద్రబాబునాయుడుగారు అధికారంలోకి వచ్చి 2004 వరకు అధికారంలో ఉండి వారు అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. అప్పటి రాష్ట్ర ఆర్థికపరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. చివరకు ప్రభుత్వోద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నుంచి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గట్టెక్కించి పరిపాలనలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి 1999 తరవాత విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకొని ఈ రాష్ట్ర ఆర్థికపరిస్థితిని గాడిలో పెట్టారు. అపుడు కరవు సంభవించినా కూడా ఆ కరవును సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్రంలో ప్రజలకు, పశువులకు తాగునీరు లేకపోయినా నీరందించి, ఇతర రాష్ట్రాలనుంచి పశుగ్రాసాన్ని తెప్పించి మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు తమ పశువులకు అవసరమైన మేతను అందచేసి కరవును సమర్థవంతంగా ఎదుర్కొన్న పరిస్థితులను మనం చూశాం. అదే విధంగా వ్యవసాయరంగంలో కూడా ఎపుడూ ఇబ్బంది లేకుండా నీటిపారుదల రంగానికి అవసరమైన నిధులు కేటాయించి 23లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి నీటిసంఘాలను ఏర్పాటుచేసి నీటిపారుదల సౌకర్యాలను కల్పించిన పరిస్థితి ఉంది. కానీ ఆ తరవాత 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టివేసింది. అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లోని రైతులు క్రాప్ హాలిడే ప్రకటించేలా చేసిన పాపం కాంగ్రెస్ పార్టీది, అప్పటి ముఖ్యమంత్రులదని చెబుతున్నాను. అటువంటి పరిస్థితుల్లో తిరిగి 2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఒకపక్క ఇబ్బందికర పరిస్థితులు మరొకపక్క రాజకీయ పరిస్థితులు, అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకొన్న అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర విభజనవల్ల కొత్త రాష్ట్రంలో ఈరోజు అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఒకపక్క రాజధాని లేకపోవడం, మరొకపక్క ఆర్థికలోటు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబునాయుడుగారు పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఏవిధంగా నెరవేర్చాలనే విషయంపై దృష్టి పెట్టినపుడు ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ప్రతి క్షణం వాటి గురించే ఆలోచించి రైతుల విషయంలో ఎపుడు కూడా తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలుచేసింది.

...

ప్రతి క్షణం రైతుల విషయంలో ఎక్కడా కూడా తెలుగుదేశం పార్టీ రైతుల ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేయాలని, రైతుల కళ్లలలో ఆనందం చూడాలని ఆయన ప్రతి క్షణం తపించడం మనం చూశాము. చంద్రబాబు నాయుడుగారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ కష్టాలే, అధికారంలోకి వచ్చినా కష్టాలే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు చూశారు. ఆరోజు రైతుల సమస్యలు అసెంబ్లీలో మాట్లాడాలంటే గొంతునొక్కే వాళ్లు, మైకు కూడా ఇవ్వని పరిస్థితి. ఈ రోజు అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని నిర్ణయాలూ అమలు చేద్దామంటే ఆర్థిక ఇబ్బంది, మానసిక సంఘర్షణ. ఏవిధంగా చేయాలని నిత్యం కూడా అటు మంత్రులతో, ఇటు

అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ ఇచ్చిన హామీలు ఆర్థిక లోటు ఉన్నా కానీ, అమలు చేయాలనే ఒక అకుంఠితమైన దీక్షతో పని చేసిన ఒక సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు నాయుడుగారు. గతంలో అనేక ముఖ్యమంత్రులను మనం చూశాము. వ్యవసాయ రంగాన్ని కుదేలుగా మార్చిన ముఖ్యమంత్రులను మనం చూశాం. రైతుల దగ్గర నుంచి సెజ్‌ల రూపంలో లక్షలాది ఎకరాలు లాక్కొని, స్వంత అనునూయలకి ఏవరైతే వేల కోట్ల రూపాయలు ఇస్తారో వాళ్లకి కట్టబెటడం, రైతులు ప్రశ్నిస్తే వాళ్లపైన కాల్పులు జరపడం. అదేవిధంగా రైతాంగానికి కావలసిన ఫర్టి లైజర్స్ విషయంలో రైతులు ప్రశ్నిస్తే, బావ మరదుల ఫ్యాక్టరీ నుంచి అక్రమ నకిలీ ఎరువుల్ని సప్లయ్ చేయడం, అవి వేసిన రైతుల పంటలు పండకపోవడంతో ఆత్మహత్యలు చేసుకోవడం గతంలో మనం చూశాము. ఫర్టిలైజర్ గానీ, సీడ్స్ గానీ, అదేవిధంగా ధరల విషయంలో గనుక మనం చూస్తే, రైతాంగానికి తాము పండించిన పంటలకి గిట్టుబాటు ధర లేకపోవడమే గాక, మరోపక్క నిత్యావసర వస్తువుల ధరలు చూస్తే ఆకాశాన్ని అందడం ఇవన్నీ కూడా మనం చూశాము.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ రోజు పర్యావరణ పరంగా చూస్తే సమతుల్యంగాలేని రాష్ట్రం. ఐదారు జిల్లాలు అంటే నెల్లూరు, ప్రకాశం, అదేవిధంగా రాయలసీమలోని నాలుగు జిల్లాలు కరువు జిల్లాలు. ఇటుప్రక్క కోస్తా జిల్లాలు చూస్తే తుపాను ప్రభావిత జిల్లాలు. సగం రాష్ట్రంలో కరువు మరో సగం రాష్ట్రంలో తుపాను. వాతావరణం సమతుల్యత లేని కారణంగా కరువు పీడిత ప్రాంతాలలో సహాయ చర్యలు చేపట్టడం, అదేవిధంగా తుపాను ఎదుర్కొంటున్న జిల్లాలలో నష్టం జరిగితే ఏవిధమైన చర్యలు తీసుకోవాలో అది కూడా ఆలోచన చేయడం ఈ రోజు ఈ ప్రభుత్వానికి కత్తి మీద సాము లాగా ఉంది. గతంలో మనం చూశాం. 1995–2004మధ్య కోస్తా జిల్లాలలో తుపాను వచ్చినప్పుడు, ఆరోజు అధికారులు కూడా పోలేని పరిస్థితులలో, ముఖ్యమంత్రిగా హెలికాప్టర్ తీసుకువెళ్లి రోడ్డు మీద దించి, అతి భయంకరమైన పరిస్థితిలో కూడా రైతులను పరామర్శించి, కోస్తా జిల్లాలని ఆదుకున్న వ్యక్తి చంద్రబాబు నాయుడుగారు. విశాఖలో వచ్చిన తుపాను ఒక పెను తుపాను. కొన్ని వేల కోట్ల రూపాయల ఆర్థిక నష్టాన్ని మిగిల్చిన తుపాను. ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల ప్రాణ నష్టం ఎక్కువగా జరగకుండా ముఖ్యమంత్రిగారు తమ సమర్థవంతమైన నాయకత్వ ప్రతిభవల్ల ప్రాణనష్టం తప్పింది. అదేవిధంగా కేంద్రం నుంచి సహాయం తెప్పించడంలోగాని,బాధిత ప్రజల్ని ఆదుకోవడంలో కూడా ఈ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసిన విషయాన్ని మనము చూస్తున్నాము.

ఈ రోజు ఆంధ్ర రాష్ట్రంలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. ప్రతిపక్షం వాళ్లు అనుకుంటున్నారు. ఈ రోజు చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన హామీలు అమలు చేయలేడు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు. కనుక మేము మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారు. మొన్న వాళ్ల ఎమ్.ఎల్.ఏ.లు చెబుతున్నారు. మీరు అసెంబ్లీలో గట్టిగా పోరాడాలి,

మీరు అసెంబ్లీలో ముఖ్యమంత్రిని తిట్టాలి, స్పీకరు గారిమీదకు వెళ్లాలి. ఇది కనుక మీరు చేయకపోతే వచ్చే నా క్యాబినేట్‌లో మంత్రులు కారని చెబుతున్నారు. చాలా విచిత్రమైన పరిస్థితి. అప్పుడే వీళ్లు అధికారంలోకి వచ్చినట్టుగా ఈ ప్రభుత్వం ఏమి చేయనట్టుగా 8 నెలలోనే ఇలా ఊహించుకుంటున్నారు. రంగుల ప్రపంచంలో విహరిస్తున్నారు. ఒక చేతకాని ప్రతిపక్షం, ఒక అసమర్థత ప్రతిపక్షం, ఒక ఫ్యాక్షనిస్ట్ ప్రతిపక్షం ఒక ఫ్యాక్షనిస్ట్ ప్రతిపక్ష నాయకుడు ఉంటే ప్రజలకు ఏమి ఒనగూరుతుందని ఈ రోజు ప్రత్యక్షంగా మనం అసెంబ్లీలో కూర్చోని చూస్తున్నాము. ఈ రోజు ప్రజాసమస్యల మీద మాట్లాడాల్సిన ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీలో ugly scenes సృష్టిస్తూ, మేము చెప్పినట్లుగా అసెంబ్లీ నడవాలి అన్నట్లుగా, బాధ్యతాయుతమైన స్పీకర్‌పై అనేక రకమైన ఆరోపణలు చేయడం, ముఖ్యమంత్రిగారిని ఇష్టారాజ్యంగా మాట్లాడడం, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఇష్టారాజ్యంగా మాట్లాడటం వీళ్లు ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తిస్తున్నారు. దీన్ని కూడా ఈ రోజు ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం చూస్తున్నారని మీకందరికీ తెలియచేస్తున్నాను.

రైతుల విషయంలో గత పది సంవత్సరాల కాలంలో ఇష్టారాజ్యంగా అగమ్యగోచరమైన కరెంటు సరఫరా చేశారు.7 గంటల పాటు ఇస్తామన్నారు. కనీసం 4 గంటలు కూడా ఇవ్వలేకపోయారు. రైతులు తమ పంటలు పండించుకోవడానికి రాత్రులు పొలాలకి వెళ్లితే కరెంటు రాదు. ఒకవేళ కరెంటు వస్తే, కరెంటు షాకుల వలన అనేక మంది రైతులు చనిపోయారు. పాము కాటుల వలన కానీ, కరెంటు షాకుల వల్ల కానీ అనేక మంది రైతులు చనిపోయిన పరిస్థితి మనం చూశాము. కానీ, తెలుగుదేశం ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత ఒక నెల రోజులలోనే కరెంటు వ్యవస్థను గాడిలోపెట్టి, ఈ రాష్ట్రంలో ఎక్కడా కరెంటు కోత లేకుండా చేసిన ఘనత ఈరోజు తెలుగుదేశం ప్రభుత్వానిది, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు గారిది. సమర్థవంతమైన పాలన అంటే అది.

ఒక సమర్థవంతమైన పాలన, ఒక సుదీర్ఘమైన అనుభవం ఉన్న వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ఏవిధంగా రాష్ట్ర పరిపాలన ఉంటుందో ఒక నెల రోజులలోనే చూపించిన ఘనత చంద్రబాబు నాయుడుగారిది అని మీకందరికీ ఈ సభ ద్వారా తెలియచేస్తున్నాను. ఈ పది నెలల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఆర్థిక లోటు ఉన్నా కానీ, ఈ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని ఒక తపన ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడు గారు. రాజధాని విషయంలో కూడా ల్యాండ్ పూలింగ్ విధానంలో తీసుకున్నట్లయితే రైతులు తిరగబడతారు, రైతులు ప్రభుత్వానికి భూములు ఇవ్వరు, ఈ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది అని ప్రతిపక్ష నాయకులు అనుకొన్నారు. కానీ, ఆ అంచనాలకు భిన్నంగా ఈ రోజు ముఖ్యమంత్రిగారిపై ఉన్న అచంచలమైన విశ్వాసంతోనే ఒక్క రైతు కూడా వ్యతిరేకత వ్యక్తం చేయకుండా, 35 వేల ఎకరాలు ప్రభుత్వానికి ఈ రోజు స్వచ్ఛందంగా

అప్పజెప్పారంటే అది చంద్రబాబు నాయుడుగారి మీద, తెలుగుదేశం ప్రభుత్వం మీద ఉన్న విశ్వాసమేనని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

ఈ రోజు మనకు ఒక రాజధాని లేదు. కట్టుబట్టలతోనే వెళ్లగొట్టారు. హైదరాబాదు నుంచి ఎక్కడ సమావేశాలు పెట్టుకోవాలో తెలియదు, ఎక్కడ మీటింగ్‌లు పెట్టుకోవాలో తెలియదు. ఇట్టి పరిస్థితుల్లో చాలా కష్టకాలంలో ఉన్నా కానీ, ప్రపంచంలోనే నెంబర్.1 రాజధాని ఏర్పాటు చేయాలని రైతుల సహకారం తీసుకొని ప్రయత్నం చేస్తుంటే దానిని కూడా వక్రీకరించి దానిని కూడా రాజకీయం చేసి మేము అధికారంలోకి వస్తే మీ భూములు మీకు తిరిగి ఇస్తామని చెప్పడం రైతుల మీద ఉన్న కపట ప్రేమకి నిదర్శనమని మీ అందరికి తెలియచేస్తున్నాను.

రైతుల గురించి మాట్లాడుతున్నారు. ఎవరు అధ్యక్షా రైతులు? రైతులంటే తెలుగుదేశం పార్టీకి పూర్తిగా విశ్వాసంతో ఉన్న వ్యక్తులు. 1983లో కూడా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఆరోజు ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గానీ, ఈ రోజు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గానీ రైతులను పూర్తిగా బలోపేతం చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ. రైతులను బలహీనపరచిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. ఆరోజు వైఎస్.రాజశేఖర రెడ్డి గారి నుంచి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఎంతో మంది రైతులని బలహీన పరిచి, రైతుల్ని పావులుగా వాడుకొని, సెజ్‌ల రూపంలో లక్షలాది ఎకరాల రైతుల భూముల్ని లాక్కుని, అప్పనంగా తమ అనుయాయులకి అప్పచెప్పిన వ్యవస్థ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జమానా అవినీతి ఖజానా.

...

ఈరోజు రైతుల పట్ల ప్రేమగా మాట్లాడుతున్నారు. నేను ఒకటి అడుగుతున్నాను, భారత రాజ్యాంగం పట్ల ఏ మాత్రం గౌరవం లేని వ్యక్తులు, చట్టసభల పట్ల, శాసన వ్యవస్థ పట్ల ఏ మాత్రం భక్తి విశ్వాసాలు లేని వ్యక్తులు ఈరోజు ప్రధాన ప్రతిపక్ష నేతగా ఆంధ్రప్రదేశ్‌లో ఉండటమనేది ఇది ప్రజల దురదృష్టం. రాజధానిని తీసుకెళ్లి ఇడుపుల పాయలో కట్టాలి, లేకపోతే రాజధానిని తీసుకెళ్లి వాళ్లకు ఇష్టమైన ప్రదేశాల్లో కట్టాలి, ప్రజలకు మాత్రం సౌకర్యాలు ఉండకూడదు, వాళ్లకు మాత్రం బెంగుళూరులో 40 ఎకరాల్లో 200 గదుల ఇల్లు ఉండొచ్చు, లోటస్‌పాండ్‌లో ఉండొచ్చు, ఇడుపులపాయలో ఉండొచ్చు, పులివెందులలో ఉండొచ్చు, కడపలో ఉండొచ్చు. కానీ పేద ప్రజానీకానికి సౌకర్యాలు ఉండకూడదు. రైతాంగానికి ఈ ప్రభుత్వం ఉపయోగకరమైన పనులు చేయకూడదు. చేస్తే వారు ఏ మాత్రం జీర్ణించుకోలేని పరిస్థితి. ఈరోజు అసెంబ్లీ అన్నా, కౌన్సిల్ అన్నా, లోక్‌సభ అన్నా, రాజ్యసభ అన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు, వారి ప్రతినిధులకు ఏ మాత్రం గౌరవం లేదు. ఈరోజు కొంత మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా ప్రతినిధులు మాట్లాడుతున్నారు. అసలు ఆ మాటలు చెప్పాలంటే చాలా అసభ్యకరంగా ఉన్నాయి. అవి చర్చించాలంటే అసభ్యకరం. నిన్న

ఏ.బీ.ఎన్.(టి.వి.న్యూస్ ఛానెల్)లో కూడా మనం చూశాము. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కూడా రాశారు. మనం చూశాము. ఇక్కడ వారి పేరును ప్రస్తావించొచ్చో లేదో నాకు తెలియదు గానీ, కొంత మందైతే విలేకర్లు మాట్లాడితే, మమ్మల్ని చంపిస్తారా? లేక మమ్మల్ని *** చేస్తారా? అంటున్నారు. విలేకర్లు అడిగారు, ఇదేంటండీ ఆ పదమేంటండీ అంటే, నువ్వు చేస్తావా *** అని విలేకర్ల ముందు మాట్లాడే పరిస్థితి. మనం ఎక్కడ ఉన్నాం? ఈరోజు ఈ శాసనసభలో ఎంతో మంది మహానుభావులు కూర్చున్నారు. ఇక్కడ పెద్దపెద్ద మహానుభావులు కూర్చొని, అనేక అంశాల మీద చర్చలు జరిపి, ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం పాటుపడిన అతి చక్కని వ్యవస్థ ఈ శాసనసభ. ఈ సభకు ఇలాంటి వాళ్లా వచ్చేది. నేను అడుగుతున్నాను, ఆ పదాన్ని మీరు ఉపసంహరించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ మహిళలకు మీరు క్షమాపణలు చెప్పాలి. మా సభ్యుల్లో ఒక సభ్యుడు నిన్న అంటున్నాడు, నన్ను *** చేసే ధైర్యం ఉందా అని ఆ సభ్యురాలు అడిగితే, కరెక్టే.. నిన్ను *** చేసే ధైర్యం ఎవరికీ లేదు. ఎందుకు లేదు? ఇక్కడ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇక్కడ చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ రాష్ట్ర మహిళల పట్ల వారి రక్షణ విషయంలో అత్యధికమైన శ్రద్ధను తీసుకునే ప్రభుత్వం చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం అధికారంలో ఉంది. అందుకనే నిన్ను *** చేసే ధైర్యం ఎవరికీ లేదు. అదే గనుక మీ నాయకుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గనుక ముఖ్యమంత్రి అయితే నీ కోరిక ఇప్పటికే నెరవేరేదని చాలామంది మా సభ్యులు అన్న మాటను మనం గమనంలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అదే విధంగా ముఖ్యమంత్రి గారి గురించి, మీ గురించి (గౌరవ సభాపతి) చాలా అసహ్యమైన పదజాలాన్ని వాడతారు. ముఖ్యమంత్రి గారి ఆరోగ్యం గురించి మాట్లాడతారు. మంత్రుల గురించి మాట్లాడతారు. దళిత మంత్రులనైతే అవహేళన చేస్తారు. బీసీ ఎమ్మెల్యేలను అవహేళన చేస్తారు. కెమేరాల్లో వీడియో తీస్తే కెమేరాలను పగులగొడతామంటారు. ఇష్టమొచ్చిన పదజాలంతో ఎమ్మెల్యేలను దుషిస్తారు. మనం ఎక్కడ ఉన్నాము? ఈరోజు ప్రతిపక్షంలో ఉన్న వీళ్లే ఇలా ప్రవర్తిస్తే ఇలాంటి వ్యక్తులు అధికారంలోకి వస్తే ఏ విధంగా ఉంటారో మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈరోజు రైతుల విషయం గురించి మాట్లాడుతున్నారు. నా నియోజకవర్గంలో ఇదే ప్రతిపక్ష నాయకుడు, నా నియోజకమైన మాచవరం మండలంలో సిమెంట్ ఫ్యాక్టరీని పెట్టడానికి ఎనిమిది సంవత్సరాల క్రితం భూములు కొన్నాడు. మూడు సంవత్సరాల్లో ఫ్యాక్టరీని కడతానన్నాడు. రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. కానీ రైతుల కుటుంబాలకు ఎక్కడా ఉద్యోగాలిచ్చిన పాపాన పోలేదు. మూడు సంవత్సరాల తర్వాత మీరు ఫ్యాక్టరీ కట్టలేదు కాబట్టి మేము మా భూముల్లో పంటలను పండించుకుంటాం, మీరు ఫ్యాక్టరీ కట్టినప్పుడు మా

*** Expunged as ordered by the Chair
*** Expunged as ordered by the Chair

భూములను తిరిగిస్తామని రైతులు పంటలు వేసుకుంటే, పులివెందుల నుంచి 300 మంది గూండాలను తీసుకొచ్చాడు. నా నియోజకవర్గంలోకి గూండాలను, ట్రాక్టర్లను, నాటు బాంబులను, పెట్రోల్ బాంబులను తీసుకొచ్చి రైతుల మీద దాడులు చేశాడు. రైతులు వేసుకున్న పంటలను సమూలంగా నాశనం చేసి మొత్తాన్ని దున్నించాడు. రైతులు వేసుకున్న పంటలను దున్నించి, అడ్డు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన రైతుల మీద, మహిళా రైతుల మీద పెట్రోలు పోసి నిప్పంటించబోయిన ఘనత ఈ శాడిస్టు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీదని తమరి ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి తెలియజేస్తున్నాను. ఆ రోజు మీరు చూశారు. టీవీల్లో వచ్చింది, పత్రికల్లో ప్రముఖంగా ప్రచురితమైయ్యింది. ఏమిటి ఈ గుండాగిరి అంటే నీ ఫ్యాక్టరీ కట్టకుండా, నీవు మూడు సంవత్సరాల్లో ఫ్యాక్టరీని కడతానని రైతుల దగ్గర నుండి ఎకరానికి లక్ష రూపాయల చొప్పున కొనుగోలు చేస్తే, రైతులు పంటలు వేసుకుంటే దాంట్లో తప్పేంటి? మీరు ఫ్యాక్టరీ కట్టుకున్నప్పుడు మీ భూములను మీరు తీసుకోండి. మీరు ఫ్యాక్టరీ కట్టకుండా ఖాళీగా ఉన్నప్పుడు రైతులు సాగు చేసుకుంటే, ఆ పొలాన్ని నాశనం చేసి, రైతుల మీద దాడులు చేసి, పెట్రోల్ బాంబులతో దాడులు చేసి, పెట్రోలు పోసి నిప్పంటించబోయి, చీరలు లాగి, ఇది దుశ్శాసన పర్వమా అధ్యక్షా? మీరా రైతుల గురించి మాట్లాడేది. మీకా రైతుల మీద ప్రేమ. అందుకనే రైతులు వచ్చి ఆరోజున లోటస్‌పాండ్‌లో నీ ఇంటి ముందు ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో పల్నాడు రైతాంగం నీ ఇంటి ముందు ధర్నా చేస్తే ఇంట్లో దాక్కొని కనీసం బయటకు వచ్చి రైతులను పరామర్శించకపోవడం సిగ్గుచేటు. జరిగిన సంఘటన పట్ల కనీసం ఇప్పటికీ కూడా పశ్చత్తాపాన్ని వ్యక్తం చేయకుండా, రైతుల మీద జరిగిన దాడిని ఖండించకుండా, ఇంకా రైతులను ప్రలోభపెట్టి, మరలా ఈ సంవత్సరం కూడా ఆ రైతులు పంట వేయకుండా చేయాల్సిన దౌర్భాగ్యకరమైన పరిస్థితుల్లో ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉంది.

అందుకే నేను చెబుతున్నాను, ఎన్ని ఇబ్బందులు ఉన్నా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకపోయినా, ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలను తీసుకొనే చంద్రబాబు నాయుడు గారి మీద ఈ రాష్ట్ర ప్రజానీకం సంపూర్ణమైన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంది. ఈరోజు కేంద్ర ప్రభుత్వాన్ని కూడా మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంది, ఇక్కడ మీరేమి సహాయం చేయాల్సిన అవసరం లేదని, దొంగ లెక్కలను వాళ్ల సలహాదారుడు సోమయాజులు ద్వారా పంపించి, ప్రభుత్వం విషయంలో ఒక ప్రక్క కపట ప్రేమను చూపిస్తూనే ప్రభుత్వాన్ని ఎక్కడెక్కడ ఇబ్బందులు పెట్టాలో అక్కడక్కడ ఇబ్బందులు పెట్టే విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోంది. మనం చూశాం 8 మందిని సస్పెండ్ చేస్తే ఎంత రాజకీయం చేస్తున్నారిక్కడ? మీ మీద వ్యక్తిగతమైన దూషణలు, మైకులు ఇరవటాలు, బయటకు వెళ్లి ఇష్టానుసారం మాట్లాడటాలు, ఈరోజు ఒక్కటే చెబుతున్నాము. రైతు ఋణమాఫీ విషయంలో ఎన్ని ఇబ్బందులున్నా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా, ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ రోజు రైతుల కళ్లల్లో ఆనందాన్ని చూసే విధంగా ఈరోజు ఒక చరిత్రాత్మకమైన నిర్ణయాన్ని తీసుకున్న వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు

నాయుడు గారు. అది తెలుగుదేశం పార్టీకి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు గర్వకారణం. మొత్తం భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌ని అగ్రగామిగా నిలిపేందుకు ఈ ప్రభుత్వం పని చేస్తోంది. అందుకనే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. గతంలో రూ.75 పెన్షన్‌ను రూ.200 లకు పెంచామని జబ్బలు చరుచుకున్నారు, జుట్లు పీకున్నారు, మేమేదో గొప్ప ఘనకార్యాలను సాధించామని చెప్పుకున్నారు. మా ప్రభుత్వమొచ్చాక అదే రూ.200 పెన్షన్‌ను రూ.1000 లకు పెంచాము, దాని గురించి మాట్లాడరు. రూ.500 పెన్షన్‌ను రూ.1500 లకు పెంచాము, దాని గురించి మాట్లాడరు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కి రూ.16 వేల కోట్లను కేటాయించాము, దాని గురించి కూడా మాట్లాడరు. రోడ్ల విషయాల్లో రోడ్ల సేఫ్టీ విషయంలో ఎన్నో రకాల చర్యలను తీసుకుంటున్నాం, మరి దాని గురించి ఎందుకు మాట్లాడరు? వాళ్లకు కావాల్సింది రాజకీయం. ఆరోజు చివరి నిమిషం వరకు మేమే అధికారంలోకి వస్తాం, వస్తున్నాం, మేం వస్తే మొదటి సంతకం ఇది పెడతాం, రెండో సంతకం ఇది పెడతాం, మూడో సంతకం అది పెడతామని కలలు కన్నారు. ఆ కలలన్నీ కల్లలయ్యాయి. కాబట్టి వాస్తవ ప్రపంచంలోకి రాకుండా ప్రతిపక్ష నాయకుడు ఇంకా ఆ కలల ప్రపంచంలోనే విహరిస్తున్నాడు. ఏదైనా చర్చ శాసనసభలో జరుగుతుంటే గౌరవ సభాపతి వైపు చెయ్యి ఊపి ఉసిగొలపడం, అధికార పక్షం మీదికి ఉసిగొలపడం, ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఇది చాలా బాధాకరం. అందుకని ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకం చూస్తున్నారు. ఈరోజు మేము ఒకటే చెబుతున్నాము, ప్రతిపక్షమైనా అధికార పక్షమైనా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఈరోజున మేము అధికారంలో ఉన్నామంటే, ఇది మాకు పూలపానుపు కాదు. మా ముఖ్యమంత్రి గారికి ఇది ముళ్లపానుపు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ వారు ఆనందంగా లేరు. ఆరోజు ప్రతిపక్షంలో ఉండి ఎన్ని నిద్రలేని రాత్రులను గడిపారో, ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా అన్నే నిద్రలేని రాత్రులను గడుపుతున్నారు. ఈరోజు మన ముందు పెను సవాళ్లు ఉన్నాయి. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి. రాజధానిని నిర్మించుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవాలి. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవాలి. ఇవన్నీ చేయాలంటే ఈరోజున ప్రజల సహకారం అవసరం. అందుకని ఈరోజున రైతుల విషయంలో, మిగతా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం విషయంలో వాళ్ల సహకారం మనకు అవసరం. ఈరోజు వాళ్ల దీవెనలు చంద్రబాబు నాయుడు గారికి శ్రీరామరక్ష. అందుకని ప్రతిపక్షాలు ఎన్ని రకాలుగా మాట్లాడినప్పటికీ, ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినప్పటికీ ఒక గౌరవప్రదమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి కూడా అవమానాలను దిగమింగుకొని నిజంగా ఆయన గురించి మాట్లాడిన మాటలు గానీ, ప్రభుత్వం గురించి మాట్లాడిన మాటలు గానీ, చాలా జుగుప్సాకరంగా ఉన్నప్పటికీ, ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకం కోసం, ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమం కోసం అన్ని దిగమింగుకొని అహోరాత్రులు పని చేస్తున్న ఈ ముఖ్యమంత్రి గారికి ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని తెలియజేస్తూ నేను సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు(కుప్పం): అధ్యక్షా, సభలో చాలా మంది గౌరవ సభ్యులు వారి యొక్క హర్షాన్ని గానీ, ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి గాను అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏ విధంగా ప్రయత్నం చేసిందో ఆ అంశాలను గౌరవ సభ్యులు ప్రస్తావించడం జరిగింది. ఈరోజున జరిగిన చర్చలో భాగంగా కొంత భాగాన్ని చూసినట్లైతే ఒక విషయం చాలా స్పష్టంగా కనబడుతోంది. మనకు చాలా ఆర్థిక ఇబ్బందులున్నాయి. సమస్యలున్నాయి. అయినప్పటికి కూడా రూ.22 వేల నుంచి రూ.23 వేల కోట్ల రూపాయలు మంజూరు చేయడం ద్వారా 'రైతు ఋణ మాఫీ పథకం" కింద రైతులను ఋణ విముక్తులను ఈ ప్రభుత్వం చేస్తోంది.ఇది భారతదేశ చరిత్రలోనే ఒక సువర్ణాధ్యాయంగా మనం అభివర్ణించవచ్చు.

(సభలో చప్పట్లు)

భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత పెద్ద యెత్తున మన రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులున్నాసరే రైతులకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి "రైతు ఋణ మాఫీ పథకం" క్రింద రూ.23 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత కూడా మన రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందనే విషయాన్ని కూడా నేను మీకు తెలియజేస్తున్నాను. రాష్ట్రంలోని రైతుల విషయానికొస్తే, దగ్గరదగ్గర 33 లక్షల 13 వేల మంది రైతులకు తద్వారా ప్రయోజనం చేకూరింది. మన రాష్ట్రంలో 13 వేల పంచాయతీలున్నాయి. ఒక్కో పంచాయతీకి ఒక కోటి డెబ్బై లక్షల రూపాయల చొప్పున ఈరోజున రైతు ఋణ మాఫీ పథకం ద్వారా ఒక్కో పంచాయతీకి ప్రభుత్వం ఇస్తోందంటే అది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధి అని కూడా నేను మీకు తెలియజేస్తున్నాను. ఇంకోవైపున ఈరోజు ఈ తెలుగు దేశం పార్టీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వాళ్లు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరముంది.

అధ్యక్షా, రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సమయంలో అంటే, మే మాసం 14వ తేది, 2004న ప్రమాణస్వీకార కార్యక్రమంలో రాజశేఖరరెడ్డి గారిచ్చిన స్టేట్‌మెంట్‌ను చదివి వినిపించదలిచాను.

> "ఒక్క రైతు కూడా రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకోవడానికి వీలు లేదు" అని మనవి చేస్తున్నాను. మీకు ఎన్ని సమస్యలున్నా తీర్చడానికి మేం సిద్ధంగా ఉన్నాం. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతు ఆత్మహత్యలు జరగకూడదు. మీకు ఏ సమస్యలున్నా చెప్పండి. మీతో పాటు ఉంటాం. సమస్యల పరిష్కారం చేస్తాను".

ఇది ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్. అందు నిమిత్తం హెల్ప్‌లైన్ పెట్టారు. అందు నిమిత్తం అనేక మాటలు చెప్పారు. ఆ విషయమై అసెంబ్లీలోచాలా పర్యాయాలు మేం ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించాం. చివరకు 2004వ సంవత్సరం నుంచి 2013వ సంవత్సరం

వరకు ఎక్కువగా రైతు ఆత్మహత్యలు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే జరిగాయి. ఆ కాలంలో మన రాష్ట్రంలో మొత్తం 24,012 మంది రైతులు అప్పుల కారణంగా ఆత్మహత్యలు చేసుకున్నారనే లెక్కలను ఆనాడు అందరు తేల్చారు. ఇంకోవైపున 2001వ సంవత్సరం నుంచి 2011వ సంవత్సరం వరకు లక్ష మందికి ఒక రైతు చొప్పున రైతు ఆత్మహత్యలకు సంబంధించిన రేటు చూస్తే, దేశంలోనే మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విపరీతంగా ఆ రేటు పెరిగింది. ఆనాడు దేశంలో 20.40% రైతు ఆత్మహత్యలుంటే, మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 36.20% ఆత్మహత్యలు చేసుకున్న రైతుల రేటు పెరిగింది. అదే మహారాష్ట్ర లో అంతకుముంద 34.70% ఉండగా, ఆ రేటు 29.10% కు తగ్గింది. కర్ణాటక రాష్ట్రంలో 40.50% ఉండగా, ఆ రేటు 34.80% కు తగ్గింది. అదే విధంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలకు పాల్పడిన రేటు 15.40% నుంచి 16.10%కు అంటే ఒక శాతం మేరకు ఆత్మహత్యలకు పాల్పడే రైతుల రేటు పెరిగే పరిస్థితి ఏర్పడింది.

అధ్యక్షా, ఆరోజున రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో వారు చెప్పిందేమిటంటే, ఋణ మాఫీ బదులు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వండని, ఋణాల మాఫీ వద్దే వద్దు, తద్వారా బ్యాంకుల్లో ఇన్‌డిసిప్లేన్ వస్తుందని మాట్లాడారు. అదే విధంగా ఈరోజున వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ప్రతిపక్ష నాయకుడు, శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు కూడా "రైతు ఋణ మాఫీ ఎలా సాధ్యం? రాష్ట్రానికి ఆదాయమే లేదు, ఋణ మాఫీ ఎలా చేస్తారని" క్వశ్చన్ చేశారు. అయితే, నేను ఒకే మాటను ఆరోజున చెప్పాను. సమైక్య రాష్ట్రంలో నేను చెప్పాను. ఆ విధంగా చెప్పిన మాటకు నేను కట్టుబడి ఉన్నాను. చెప్పిన మాటను నిలబెట్టుకోవడానికి అవసరమైతే ఇంకా కష్టపడతాం తప్ప మాట నిలబెట్టుకోకపోవడమంటూ జరగదు. రైతుల కళ్లలో వెలుగులు చూడాలనే ఉద్దేశంతో నేను ముందుకు నడిచాను. ఎక్కడ కూడా వెనుదిరిగే సమస్యే లేదు.

(సభలో చప్పట్లు)

అధ్యక్షా, రైతు ఋణ మాఫీ విషయంలో ఆరోజున నేను తీసుకున్న నిర్ణయం వల్ల రైతుల్లో ఒక నమ్మకాన్ని కల్గించగలిగాం. గత యేడాది కాలంలో దేశంలో 1109 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వంలో ఉండే వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గారు లోక్‌సభలో చెప్పడం జరిగింది. "వ్యవసాయంలో నష్టాలు భరించలేక 2014వ సంవత్సరంలో దేశంలో 1109 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే, ఈ రైతు ఆత్మహత్యల రేటు 26% పెరిగింది" అని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శ్రీ మోహన్‌బాయ్ కుందారియా మంగళవారం లోక్‌సభలో ప్రశ్నకు సంబంధించి వ్రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. గత ఏడాది దేశవ్యాప్తంగా మొత్తం 1109 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే, వారిలో అత్యధికంగా మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన 986 మంది రైతులున్నారని కూడా వ్యవసాయ శాఖ సహాయ

మంత్రి గారు లోక్‌సభలో చెప్పడం జరిగింది. అదే విధంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 84 మంది రైతులు, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన 29 మంది అన్నదాతలు అప్పుల కారణంగా ప్రాణాలను కోల్పోయారని కూడా కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి గారు లోక్‌సభలో చెప్పడం జరిగింది. 2012వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 1046 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా, 2013వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 879 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్టుగా కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గారు లోక్‌సభలో వివరించారు. అంటే, ఇది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం సాధించిన విజయం. ఈ ప్రభుత్వ విజయం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతుల పరిస్థితిని ఎక్కడా కూడా కేంద్ర ప్రభుత్వం ప్రస్తావించ లేకపోయిందంటే ధైర్యంగా నేను కూడా అదే విషయాన్ని చెప్పగలిగాను. రాష్ట్రంలో ఎక్కడైనా రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడితే విష్ణుకుమార్‌రాజుగారు ఇందాక చెప్పినట్టుగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏమేమి చేయాలో అవన్నీ కూడా చేయడం జరుగుతుంది. ఏ రైతైనా అప్పుల బాధతో దిగులుపడి, మానసిక బలహీనత వల్ల ఆ రైతు ఆత్మహత్యకు పాల్పడితే ఆ రైతు కుటుంబం అనాథ కుటుంబం కావడానికి వీలు లేదు. అందుకే, ఐదు లక్షల రూపాయల మొత్తాన్ని ఎక్స్‌గ్రేషియా క్రింద చెల్లించి పూర్తిగా ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకునే ప్రయత్నం చేస్తుందనే విషయాన్ని కూడా నేను మీకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, నేను ఒక విషయమై కాదు, చాలా విషయాల్లో ఆలోచిస్తున్నాను. 14వ ఫైనాన్స్ కమీషన్ నందు కూడా అదే విషయాన్ని చెప్పడం జరిగింది. ఐదు సంవత్సరాల తరువాత కూడా మన దగ్గర రెవెన్యూ డెఫిషిట్ ఉంటుందనే విషయాన్ని 14వ ఆర్థిక సంఘం నివేదికలో చెప్పడం జరిగింది. కేంద్ర ప్రభుత్వంతో మనం రాష్ట్రానికి సంబంధించిన అంశాల్లో ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటూ ముందుకుపోతున్నాం. తప్పకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ఆర్థిక సహాయం వస్తుందనే ఆశతో మన ప్రభుత్వం ముందుకుపోతోంది. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందిస్తోంది. పూర్తిగా వర్కౌట్ అవుతుందనే ఆశభావంతో మన ప్రభుత్వం ఉంది. కొంత మంది నాతో మాట్లాడుతున్నారు. రూ.23 వేల కోట్ల రూపాయలను రైతు రుణమాఫీ పథకం క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చింది. అదే విధంగా వివిధ పెన్షన్ల కోసం ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 30 వేల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టబోతోంది. అదే విధంగా డ్వాక్రా సంఘాలకు దగ్గరదగ్గర తొమ్మిది వేల కోట్ల రూపాయలను వారి సంక్షేమానికి ప్రభుత్వం ఖర్చు చేయబోతోంది. ఆ విధంగా 22, 23 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినట్లైతే, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి గాను కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు వస్తాయని, ఆ మొత్తంతో రాష్ట్రానికి సంబంధించిన మిగిలిన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయినట్లైతే రాష్ట్రంలో కరవు అనే పరిస్థితి కనబడదనే విధంగా కొంతమంది నాతో చెప్పడం జరిగింది. కానీ, వారితో నేను ఒక మాట చెప్పాను. రైతులను ఆదుకోవాలి. రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పాలి. ఒకవైపున రైతుల్లో

ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తూనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కూడా ఆగడానికి వీలు లేదని చెప్పడం జరిగింది. నూటికి నూరు శాతం పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందనే విషయాన్ని కూడా నేను మీకు తెలియజేసుకుంటున్నాను.

(సభలో చప్పట్లు)

అధ్యక్షా, రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలంటే దగ్గరదగ్గర రూ.25 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. అందులో కూడా ప్రాజెక్టుకు సంబంధించిన excavation పనులకు గానీ, ప్రాజెక్టు నిర్మాణాలను పూర్తిచేయుటకు గానీ, అన్ని పనులనూ సత్వరమే పూర్తిచేయాలంటే, భూ సేకరణ నిమిత్తం గానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం గానీ అన్నింటికి కలిపి సుమారుగా 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయాలంటే ఇప్పుడున్న ఎస్టిమేట్స్ ప్రకారం రూ.11,300 కోట్లు అవసరం ఉంది. కానీ, excavation పనులకు గానీ, భూములకు సంబంధించిన నష్టపరిహారం మొత్తం వంటి వాటిని ఇవ్వకపోతే మళ్లీ ప్రాజెక్టు పనుల నిమిత్తం కొత్తగా టెండర్లు పిలవాలంటే కాలయాపన జరుగుతుంది. అందు నిమిత్తమే ప్రభుత్వం తరఫున ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ విషయమై ఇంత వరకు ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదికను ప్రభుత్వానికి ఇచ్చింది. అదే విధంగా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించే నిమిత్తం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఒక ఎంపవర్‌మెంట్ కమిటీ ఏర్పాటు అయింది. వాళ్లందరూ వర్కౌట్ చేసుకుని ముందుకువస్తే, అందుకు అదనంగా మరో ఆరేడు కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసి సుమారుగా 18 వేల కోట్ల రూపాయలు కనుక ప్రభుత్వం ఖర్చు పెట్టగలిగితే రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ పూర్తవుతాయి. ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని పనులను ప్రభుత్వం పూర్తిగా ట్రాన్స్‌పరెంట్‌గా చేస్తోంది. భూసేకరణ నిమిత్తం రూ.3,500 కోట్లు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం రూ.1,500 కోట్లు, ఫారెస్ట్ ల్యాండ్ కొరకు రూ.1,200 కోట్లు, నేషనల్ హైవే క్రాసింగ్స్ కొరకు గానీ, రైల్వే క్రాసింగ్స్ కొరకు గానీ రూ. 400 కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. టెంటేటివ్‌గా ఒక అసెస్‌మెంట్‌కు ప్రభుత్వం వచ్చింది. అన్నింటికీ కలిపి రూ.25 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టాల్సి వస్తుంది. నాలుగేళ్ల కాలంలో ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తిచేయాలనే ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసుకుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి గాను రూ.16,000 కోట్లు కావల్సి వస్తుంది. ప్రభుత్వం ఇప్పటికే రూ.5,500 కోట్లు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి గాను ఖర్చుచేసింది. మరో రూ.11,000 కోట్లు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమవుతాయి. అదే విధంగా భూ సేకరణ నిమిత్తం గానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం మరో రూ.4 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం మరో 15 వేల కోట్ల రూపాయలను రాబోయే నాలుగు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ఖర్చు పెట్టాల్సిన అవసరముంది.

అధ్యక్షా, పోలవరం నిర్మాణానికి ముందు ప్రభుత్వం ముందు ఉన్న ప్రాజెక్టు "పట్టిసీమ ఎత్తిపోతల పథకం". నేను అందుకనే చాలా స్పష్టంగా చెప్పాను.

...

రూ.1,300కోట్లు ఖర్చు అవుతుందనీ, నాలుగు సంవత్సరాలు కూడా తీసుకోకుండా వీలైనంత త్వరగా పట్టిసీమ ప్రాజెక్టు పూర్తిచేసి తద్వారా వచ్చే నీరు కృష్ణా డెల్టాకు వాడుకొని పైనుండి వచ్చే నీటిని ఆదా చేసి శ్రీశైలం కాలువ ద్వారా రాయలసీమకు పంపిస్తే నూటికి నూరు శాతం కరవు నివారించే అవకాశం వస్తుంది. అందుకు కట్టుబడిఉన్నాం.

ఈ సంవత్సరం నీరు-చెట్టు కార్యక్రమం పెట్టాం, దానికీ ప్రాధాన్యత ఇస్తాం. నీటితో ఏమైనా చేసే అవకాశం ఉంటుంది. మిత్రులు సూర్యారావు గారు మాట్లాడారు. ఈసంవత్సరం గోదావరిలో నీరు తగ్గాయి. కానీ, సీలేరు ద్వారా చాలావరకు మేనేజ్ చేసి ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా గోదావరి పరీవాహకప్రాంతం కింద పంటల్ని కాపాడిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని మీకు తెలియజేసుకుంటున్నాను. ఈరోజే కాదు గోదావరి ద్వారా రెండవ పంటకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు నీరందించిన ఘనత కూడా తెలుగుదేశం ప్రభుత్వానిదేనని మీకు తెలియజేసుకుంటున్నాను. భవిష్యత్‌లో నాకు ఏమాత్రం అనుమానం లేదు, పోలవరం ప్రాజెక్టు పూర్తయితే, గోదావరి డెల్టా stabilization అవుతుంది. అదేవిధంగా మెట్ట ప్రాంతాలకు కూడా నీళ్లిచ్చే పరిస్థితి వస్తుంది. గోదావరి ప్రాజెక్టు ఎట్టి పరిస్థితిల్లోనూ పూర్తిచేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని, అది జరుగుతుందని కూడా తెలియజేసుకుంటున్నాను. ఈకార్యక్రమాలన్నింటినీ చూసి కొంతమంది భరించలేకనే ఇవన్నీ చేస్తున్నారు తప్ప మరొకటి కాదు.

ఈప్రభుత్వం రుణ విముక్తితోనే సరిపెట్టుకోవడం లేదు. నీరనేది వ్యవసాయానికి చాలా ముఖ్యం. నీరు అందించగలిగితే వ్యవసాయంలో అనేక ఫలితాలొస్తాయి. 2015-16వ సంవత్సరంలో బడ్జెట్‌చూస్తే, ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ బడ్జెట్ కోసం రూ14,780 కోట్లు కేటాయించామంటే, అదే ఈతెలుగుదేశం పార్టీకి ఉండే శ్రద్ధ, తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని కూడా మీకు తెలియజేసుకుంటున్నాను. మరోప్రక్క ఈరోజు రోజుకు 7గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా 22మిలియన్ యూనిట్స్ లోటు ఉంటే, దానిని అధిగమించి ఎండా కాలం కూడా ఒక్క గంటైనా విద్యుత్ విరామం లేకుండా 7గంటలు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నాం. దానివలన చాలా వరకు వ్యవసాయం ముందుకు వెళ్లే పరిస్థితి వచ్చింది. వ్యవసాయాన్ని రుణ విముక్తితోనే సరిపెట్టడం లేదు. దీనికొక Focus approach తీసుకున్నాం.

7 మిషన్‌లలో మొదటిది Primary Mission అందులో వ్యవసాయాన్ని తీసుకున్నాం. దీనికి నిధులు కొరత కాదు. ఎంతైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. అందుకు భూసార

పరీక్షలతో ప్రారంభిస్తున్నాం. నాలుగు లక్షల శ్యాంపిల్స్‌తో భూసార పరీక్షలు చేస్తున్నాం. అందులో 2000 జీపిఎస్‌లు తీసుకొని ఎక్కడికక్కడ భూసార పరీక్షలు చేపట్టి ఆన్‌లైన్‌తో అనుసంధానించే పరిస్థితిని కూడా తీసుకువచ్చామని తమకు తెలియజేసుకుంటున్నాను.

ఇది కాకుండా ఎక్కడైనా Micro Nutrient Deficiencies ఉన్నటువంటి జింగ్, బోరాన్, జిప్సం ఇటువంటివన్నీ గ్రామాల వారీగా సరఫరాచేస్తున్నాం. ఇవన్నీ చరిత్రలో మొదటిసారి. ఒకవ్యక్తి యొక్క ఆరోగ్యం బాగుండాలంటే, శరీరంలో ఏవిధంగా పౌష్టికాహార, విటమిన్స్ నిల్వలు ఉండాల్సి ఉందో, ఆదేవిధంగా భూమిలో అన్ని మైక్రో న్యూట్రియన్స్ బ్యాలెన్స్ ఉంటే, పంట దిగుబడులు ఎక్కువగా వస్తాయి. చరిత్రలో మొదటిసారి రూ.90,000కోట్లు బడ్జెట్‌లో కేటాయించాం. అవసరమైతే, ఎంత డబ్బులైనా ఖర్చుపెట్టి భూసార పరీక్షద్వారా Micro Nutritions అన్నీ బ్యాలెన్స్ చేస్తాం. దీనివల్ల 15-20 శాతం వరకు దిగుబడి, ఉత్పాదకశక్తి పెరుగుతుంది.

రెండవదేమంటే, నాణ్యమైన విత్తనాల సరఫరా చేయడం. ఈరోజు బెస్ట్ ప్రాక్టీసెస్ ఎన్ని కావల్సి ఉందో అవన్నీపెట్టాం. ఇక్రిశాట్‌తో ఒక ఒప్పందం చేసుకున్నాం. నాబార్డ్‌తో మరొక ఒప్పందం చేసుకోబోతున్నాం. వారికున్న పరిజ్ఞానాన్ని పూర్తిగా ఉపయోగించుకొని మనం ముందుకుపోయే పరిస్థితి ఉంది. ఆధునీకరణ కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.142కోట్లు కేటాయించాం. అవసరమైతే మరో రూ.100కోట్లయినా ఫరవాలేదు. Dryers కానీ, Harvesters కానీ, Mechanization కు కావల్సిన అన్నీ కూడా ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 నుండి 70శాతానికి సబ్సిడీ పెంచామని కూడా మీకు తెలియజేస్తున్నాను.

రైతులకోసం ఇంతకు మునుపు ఎన్నో సార్లు అసెంబ్లీలో పోరాటం చేశాం. ఆరోజు ఎవరైతే, ఆదర్శ రైతు పేరుతో వ్యవసాయం తెలియని వాళ్లందరినీ ఆదర్శరైతులుగా పెట్టి ఇబ్బందుల్ని తీసుకువచ్చారో, ఆవిధంగా కాకుండా 6500 మంది MPEO posts Sanction చేశాం. రిక్రూట్ చేస్తాం, ఖరీఫ్‌కు సిద్ధంగా ఉంటారు. 2000 tabs కూడా వారికి అప్పగిస్తున్నాం. ఈ 2000ట్యాబ్స్ ద్వారా ఎక్కడికక్కడ Information online లో ఉంచి, పొలానికి వెళ్లారా లేదా అనే సమాచారం ఆన్‌లైన్‌లో వచ్చే పరిస్థితి ఉంటుంది. అదేవిధంగా Farm ponds కు రూ.30కోట్లు కేటాయించాం. Sprinkler Irrigation, Drip Irrigation ఎంత వీలైతే అంత వరకు పెద్దఎత్తున ముందుకు తీసుకుపోతాం. ఒకప్పుడు ఎరువులు తీసుకోవాలంటే రైతుకు లాఠీ దెబ్బలు తగిలేవి. ఎప్పుడు చూసినా ఎరువులు తీసుకునేందుకు రైతులు క్యూలో నిలుచొనేవారు, రాత్రింబవళ్లు క్యూలో నిలుచొనేవారు. క్యూలోనే నిద్రించేవారు. వారు చెప్పులను కూడా క్యూలోనే ఉంచిన ఫొటోలు చూపించాం. ఎవరూ బాధ్యత తీసుకున్న పాపానపోలేదు. ఈ సంవత్సరం ధైర్యంగా చెప్పగలుగుతున్నాను. మొదటిసారి ఎక్కడా ఎరువుల కొరత లేకుండా సకాలంలో రైతుకు ఎరువులందించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కింది. అందుకోసం

మార్క్‌ఫెడ్‌కు రూ.60,000కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చాం. Buffer Stock  పెట్టుకోమన్నాం. ఇది చరిత్రలో మొదటిసారి. ఎక్కడా రైతుకు ఎరువు కొరత రాదని మీకు తెలియజేస్తున్నాను. “పొలం పిలుస్తుంది“ కార్యక్రమం కింద 50724 Field visits చేశారు.

( అధికారపక్ష సభ్యులు చప్పట్లు )

చంద్రన్న రైతు క్షేత్రం కింద 1608 Demonstrations చేశారు. అనేక పంటల్ని ఏవిధంగా ముందుకు తీసుకువెళ్లాలో ఆవిధంగా ముందుకు తీసుకువెళ్లే పరిస్థితికి వచ్చారు. ఈ అనుభవంతో రాబోయే ఖరీఫ్‌లో పెద్దఎత్తున ముందుకు పోయే పరిస్థితి ఉంది. వరిపంట హెక్టారుకి 2,554 కేజీల నుండి 3,073కేజీలకు పెరిగింది. సెనగ పంట హెక్టారుకి 682 నుండి 1,089కేజీలకు పెరిగింది. పెసర పంటను హెక్టారుకు 512 నుండి 907కేజీలకు పెంచాం. ఇది ప్రారంభం మాత్రమే. ఈరోజు డిపార్ట్‌మెంట్‌కు ఒక టార్గెట్ ఇచ్చాను. జాతీయ స్థాయిలో ఏ పంటకు ఏరాష్ట్రం ముందంజలో ఉందో దానిని ఒక బెంచి మార్క్‌గా తీసుకోండి, ముందు ఆ బెంచ్ మార్క్‌ను చేరుకోమని చెప్పాం. Micro Nutrients కు ఎంత డబ్బులు కావాల్సి ఉందో అంత తీసుకోమని చెప్పాం. Extension, mechanization కు ఎంత డబ్బులు కావాల్సి ఉందో ఇస్తామని చెప్పాం. నాకు కావల్సింది ఖర్చు తగ్గాలి, ఆదాయం పెరగాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలు రావాలని చాలా స్పష్టంగా ఆదేశాలిచ్చాం. ఈ సంవత్సరం కరవు ఉన్నా GSDP Contribution 5.59శాతం పెరిగింది. రాబోయే సంవత్సరంలో Double Digit target ఇచ్చాం. Growth Engineలో వ్యవసాయంలో ఉండే Main Engines ను తీసుకొని ముందుకు పోతున్నాం.

ఈ ప్రభుత్వానికి ఒక స్పష్టత ఉంది. ఈ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించడం కోసం వ్యవసాయ రంగాన్ని పైకి తీసుకురావాలనీ దీనికి కావల్సిన నిర్దిష్టమైన విధానాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ఒక Focus Approach తో ముందుకు పోతున్నాం. అందుకే రైతులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను, ఇది మొదటి ప్రక్రియ మాత్రమే. రైతు రుణ మాఫీ, రైతు రుణ విముక్తితోనే మొత్తం అయిపోయినట్లు నేను భావించడం లేదు. కానీ ఈరోజు రైతులకు  ఒక భరోసా, ఆత్మవిశ్వాసం కల్పించాలి. ఆత్మ విశ్వాసాన్ని కల్పించడం కోసం, కొంత వెసులుబాటు కల్పించడం కోసం రైతు నిలదొక్కునేందుకు ఈ కార్యక్రమం తెచ్చాం. మళ్లీ మళ్లీ రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఎన్ని కష్టాలున్నా ఫర్వాలేదు, మిమ్మల్ని ఈ ప్రభుత్వం ఆదుకుంటోంది, మీకళ్లలో వెలుగులు చూడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాను. ఇంకా ఇలాంటి నిర్ణయాలతో ఈ ప్రభుత్వం ముందుకు పోతుంది. నేను కొన్ని గైడ్‌లైన్స్ కూడా చెప్పాను, అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఎవరైనా సరే నేను చెప్పిన గైడ్‌లైన్స్ ప్రకారం ఎక్కడైనా ఫలితాలు రాకపోతే, మీరు కంప్లైంట్ చేయండి, నేను మీ అందరికీ హామీ ఇస్తున్నాను, ఎవరైనా ఎక్కువ డబ్బులు తీసుకుంటే, మొత్తం నేను ఇవ్వలేకపోవచ్చు కానీ, రూ.1.50లక్షలు వరకు ప్రతి ఒక్క కుటుంబానికి ఇచ్చే బాధ్యత తీసుకుంటాను. అదేమాదిరి మీరు ఎవరైనాసరే రూ.50,000 కంటే

తక్కువ తీసుకుంటే, one time settlement ఇస్తాం. రూ.50,000 మీద ఎక్కువ తీసుకున్నా scale of finance వల్ల రూ.50,000 కంటే తక్కువ ఉంటే, అదికూడా settle చేస్తాం.

...

ఎవరైతే ఎక్కువ తీసుకున్నారో.. రూ.1.50లక్ష తీసుకున్న వారందరికీ మొదట 20 శాతం డబ్బులు ఇచ్చి, మిగిలిన 80 శాతాన్ని నాలుగు వాయిదాలలో పూర్తిగా ప్రభుత్వమే కట్టే బాధ్యత తీసుకుంటుంది. మీ రుణాలును మీరు రీ షెడ్యూలు చేసుకుంటే 4 శాతం వడ్డీచెల్లించాల్సి వుంటుంది. నేను అదనంగా 6 శాతం వడ్డీ ఇచ్చి మీకు ఆదా వచ్చే పని చేస్తాం. ఈ రెండు కూడా రాబోయే 4 సంవత్సరాల కాలంలో ప్రతీ ఒక్క రైతు అప్పులు ఏవైతో ఉన్నాయో, ఆ అప్పుల మీద 10 శాతం వడ్డీని కూడా భరించే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకొంటుందని తెలియజేస్తున్నాను.

ఇదే కాకుండా హార్టికల్చర్‌కు సంబంధించి, పండ్ల తోట రైతులకు కూడా హామీ ఇస్తున్నాను. పదిపదిహేను రోజులలో అన్ని ఎస్టిమేట్స్‌ను తయారుచేస్తాం. బ్యాంకులలో ఇంటిగ్రేట్ చేస్తాం. మీ అందరికీ ఎకరాకు రూ.10,000 చొప్పున 5 ఎకరాలకు ఆర్థిక సహాయం చేసే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకొంటుంది. దీనిని ఒక సవాలుగా తీసుకుని ముందుకు వచ్చాను. చాలా సిస్టమేటిక్‌గా చేశాం. దయచేసి రైతులందర్నీ ఒకటే కోరుతున్నాను. అన్ని ఊళ్లల్లో నోటీసు బోర్డులను పెట్టిస్తాను. ఏ రైతుకు ఎంత డబ్బులు వచ్చాయో, ఏ ఊరుకు ఎంత డబ్బులు వచ్చాయో మొత్తం వివరాలను నోటీసుబోర్డులో పెట్టడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మీకు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమం గురించి దేశంలో ఎవ్వరూ ఆలోచించలేదు. ఒక పెద్ద కార్యక్రమాన్ని మనం చేశాం. చరిత్రలో ఎప్పుడూ చేయని కార్యక్రమాన్ని మనం చేయడం జరిగింది. గౌరవ శాసనసభ్యుల్ని, ప్రజా ప్రతినిధుల్ని, రైతుల్ని, ఇంటలెక్చువల్స్‌ని, ప్రజలందర్నీ కోరుతున్నాను. ఈరోజు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో ఎన్ని ఇబ్బందులున్నా, ఈ నిర్ణయం రైతు శ్రేయస్సు కోసం ఈ ప్రభుత్వం తీసుకుంది. ఇది రైతు ప్రభుత్వం. రైతుల కోసం ఏమైనా చేయడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నేను ఎన్నోసార్లు చెప్పాను. ''రైతు'', ''పేదవాడు'' ఈ ప్రభుత్వానికి రెండు కళ్లు అని మీకు తెలియజేస్తున్నాను. ఒకవైపు సంక్షేమం, ఇంకోవైపు అభివృద్ధి. అభివృద్ధి కోసం నేను ప్రపంచమంతా తిరుగుతున్నానంటే, నా స్వార్థం కోసం కాదు. ఈ రాష్ట్రంలో పరిశ్రమలు రావాలి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రావాలి. అందులో ఆదాయం రావాలి. ఆ ఆదాయాన్ని మళ్లీ పేదవారికి, రైతుల కోసం ఖర్చు పెట్టాలని ఆలోచిస్తున్నాం. దీనిని అందరూ పూర్తిగా అర్థం చేసుకుని, సహకరించవలసిందిగా నిండు మనస్సుతో ఆశీర్వదించి, అన్ని విధాలా సహకారం అందించవలసిందిగా మరొక్కసారి కోరుకుంటూ మీద్వారా అందరికీ విజ్ఞప్తి చేస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

* * *

MR.SPEAKER: Now, let us take up the Demands.

Yes, Minister for Transport Roads and Buildings.

SRI SIDDHA RAGHAVA RAO (Minister for Transport Roads and Buildings): Sir, with your permission I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs. 3,315,74,09,000/- under Demand No. XI(11) – Roads, Buildings and Ports."

SRI DEVINENI UMAMAHESWARA RAO: (Minister for Irrigation Command Area Development, Water Resources Management) I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.4,586,63,16,000/- under Demand No. XXXIII (33) – Major and Medium Irrigation."

SRI DEVINENI UMAMAHESWARA RAO (Minister for Irrigation Command Area Development, Water Resources Management): Sir, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.690,44,17,000/- under Demand No. XXXIV (34) – Minor Irrigation."

SRI DEVINENI UMAMAHESWARA RAO :(Minister for Irrigation Command Area Development, Water Resources Management) On behalf of Chief Minister, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs. 4,365,80,81000/- under Demand No. XXXV (35) – Energy."

MR.SPEAKER: All the Demands are moved. Cut Motions from 62 to 80 are deemed to have been moved.

**(Ref. Annexure 1)**

The House is adjourned to meet again tomorrow at 9.00 a.m.

(The House then adjourned at 2.14 p.m. to meet again at 9.00 AM on Tuesday, the 24th of March, 2015)

* * *